సంపుటి : 29
సంచిక : 2

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 49 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 325 రూపాయలు.

సెప్టెంబర్, 1979

BANK STAFF RECREATION CLUB * TENALI *
BOOK NO. 214

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

తొలిమాట

నమస్కారము! ధరలు రోజురోజుకి విపరీతంగా పెరుగుతున్నాయి ప్రెస్సు రేట్లు, పేపరు ధర ఆకాశాన్నంటుతోంది. ఇంకారేట్లు పెంచాలని క్రాంతి ప్రెస్‌లో జరుగుతున్న సమ్మె, అడిగిన ధర ఇచ్చినా కావల్సినంత పేపరుదొరుకని పరిస్థితి, పత్రికా నిర్వహణే కష్టసాధ్యంగా తయారైంది.

ఈ పరిస్థితిలో పత్రిక ధర స్వల్పంగా పెంచక తప్పటం లేదు. వచ్చే నెలనుండి అపన మరియు సప్లిమెంట్‌ల ధరలు రు. 4-00లకు హెచ్చింపబడినవి. యీ కొత్త రేట్లు పాఠకులు సానుభూతితో అర్థం చేసుకొని, ఎప్పటివలె మాతో సహకరించ గలరని ఆశిస్తున్నాము.

కొత్త రేట్లప్రకారం వచ్చే నెలనుండి హోమ్‌డెలివరీ సభ్యులకు వి. పి. రు. 7-75 పై. లకు పంపబడుతుంది. ఏడాది చందా రు. 49/ లకు, జీవితచందా రు. 325/లకు హెచ్చింపబడింది.

'జీవిత చందా' కట్టదలుచుకున్న పాఠకులకు యీ నెల ఒక ప్రత్యేక సౌకర్యము కలిగిస్తున్నాము. అపన, సప్లిమెంట్ రెంటికి కలిపి జీవిత చందా రు. 650/-లు అవుతుంది. రు. 150/-లు తగ్గించుకొని, 30-8-79 తేదీలోగా ఒకేసారి రు. 500/-లు పంపిన పాఠకులకు పత్రిక ధరతో నిమిత్తం లేకుండా వారి జీవిత కాలమంతా అపన, సప్లిమెంట్ అందజేయబడతాయి. పై తేదీ తర్వాతగాని, ఏదో ఒక పత్రికకుగాని జీవితచందా కట్టే వారికి యీ తగ్గింపు వర్తించదు. సెలవా మరి—

— మీ శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో ....

కథలు (మాసపత్రిక)

4. కటకటాల వెనక—వాణిశ్రీ
16. వేట కుక్కలు—రేవతి
33. వెలలేని చిరునవ్వు—వసుంధర
51. దండన్యాయము—ఆర్యస్యన్
64. కార్బన్ షీటు—గ్లాస్కోపంచె—
ఎం. వి. వి. సత్యనారాయణ
88. రివాల్వర్ దొంగ—అంధపరపు మల్లిబాబు
100. భూస్థాపితం—యస్. గీతారాణి
117. నకిలీ మనిషి—మోదుకూరి జతీంద్రశర్మ
129. ట్రాన్సిస్టర్ దొంగ—మల్లాది వెంకటకృష్ణమూర్తి
140. చావు ఎవరికీ—కృష్ణ చైతన్య
158. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—సికిందర్

నవలలు (సప్లిమెంట్)

3. పరిదిద్దుకోలేని తప్పు—వసుంధర.
44. పగిలిన రమ్ బాటిల్—టెంపోరావ్.
71. బర్త్ డే గిఫ్టు—కె. బి. యస్ కుమార్.
116. అపరిచితుడి సలహా—మోదుకూరి జతీంద్రశర్మ.
175. అడుగు ముందుకు వేస్తే చస్తావ్.—వసుంధర.

ఇంకా—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, డిటెక్టివ్ పటాపట్, జోక్స్, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

కటకటాల వెనుక

వాణిశ్రీ

“అదిగో పులి అంటే ఇదిగో తోక' అంటుంది లోకం.

ఆ సంగతి సుబ్బారావుకి బాగా తెలుసు.

'ఛీ....ఛీ .. లోకులు పలు కాకులు' అని అసహ్యించుకున్న సందర్భాలు గూడా ఎన్నో వున్నాయి. నిప్పు లేని పొగ రేగుతూ వుంటుంది. కాని మనం వివేకంతో

ఆలోచించాలి' అని స్నేహితులకు సలహాలు ఇచ్చి సుబ్బారావు దూరాలోచన గలవాడు అని పేరు తెచ్చుకున్నాడు. అవన్నీ ఇతరుల విషయంలో.

కాని అదే సుబ్బారావు తనదాకా వచ్చేసరికి లోకుల పలుకులు విన్నాడు గాని అరుణ మాటలు నమ్మలేదు.

"ఛీ .. డబ్బు కోసం ఇంత నీచానికి దిగజారతావను కోలేదు. నీ పాడు ముఖం నాకు చూపించకు." అని నిష్ఠూరంగా మాట్లాడి వెళ్ళిపోయాడు.

తనను ఎంతో ప్రేమించిన అరుణ డబ్బు కోసం వ్యభిచారం చేసిందని లోకం కోడై కూస్తోంది. పాపం పండి పోలీస్ స్టేషన్‌లో ఒక రాత్రంతా వుంది. అంత కంటే నిదర్శనం ఏం కావాలి?

కాని తను నిర్దోషినని ఏడ్చింది అరుణ. జరిగిందంతా చెప్పింది.

'అంతా కట్టు కథ. సినిమాకెళ్ళి వస్తుంటే పోలీసులు పట్టుకున్నారట. అవ్వ! సిగ్గుచేటు చెప్పుకుంటే. సినిమాకి ఎంత మంది ఆడవాళ్ళు వంటరిగా వెళ్ళిరావడం లేదు. వాళ్ళందర్నీ పోలీసులు పట్టుకుంటున్నారా? వాళ్ళేమైనా గ్రుడ్డివాళ్ళా? ఆ కొంపలో వుండగా రెడ్ హేండెడ్‌గా పట్టుకున్నారు.

'రాక్షసి! ఎంత చాకచక్యంగా డబుల్ గేమ్ ఆడిందీ? తన బ్రతుకులో నిప్పులు పోసింది. నమ్మించి ద్రోహం చేసింది. ఛీ....దాన్ని తల్చుకుంటేనే పాపం.'

అరుణను తల్చుకుంటూ రాత్రిళ్ళు నిద్రకు దూరమై బాధపడుతున్నాడు సుబ్బారావు.

'టక్ ....టక్ ....'

సుబ్బారావుకి మెలకువ వచ్చింది.

ఎవరో తలుపు కొడుతున్నారు. టైమ్ చూసుకున్నాడు. పన్నెండు కావచ్చింది. ఇంత రాత్రి వేళలో ఎవరు వచ్చారు? అరుణగాని వచ్చిందా? తను నిర్దోషి నని నమ్మించడానికి వంతమైళ్ళుదాటి వస్తుందా? ఏమో?

సుబ్బారావు లేచి వెళ్ళి తలుపు తీశాడు. తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు.

ఎదురుగా పోలీసులు.

నివ్వెరపోయాడు సుబ్బారావు.

"జె. సుబ్బారావు మీరేనా?"

"అవును."

"మీరు స్టేషన్‌కి రావాలి."

"ఎందుకూ?" బావిలో నుంచి వచ్చినట్లుంది అతని కంఠధ్వని.

"ముందు బయల్దేరు. అన్నీ స్టేషన్‌లో చెప్తాం." కర్కశంగా వినిపించింది కంఠం. వెంటనే బయల్దేరక పోతే మక్కెలిరగతంతాం అనే బెదిరింపు గూడా వుంది.

బట్టలు మార్చుకుని వణుకుతున్న కాళ్ళతో వ్యాన్ ఎక్కి కూర్చున్నాడు. అతనికి ముచ్చెమటలు పోస్తున్నాయి. గుండెల మీద పోలీస్ వ్యాన్ పోతున్నట్లు ఉక్కిరి బిక్కిరైపోయాడు.

'ఇదేం ఖర్మ! పోలీసులకి తనతో ఏం పని? తనేం తప్పు చేశాడు? తనమీద రిపోర్టు చేసిందెవరు? తనమీద ఎవరికి కోపం వుంది?.' సుబ్బారావుకి తల బద్దలు కొట్టుకున్నా ఏమీ అర్థం కావడం లేదు.

స్టేషన్‌లో సర్కిల్, డియస్పీ వున్నారు. సుబ్బా

రావుని ఎగాదిగా చూసి "నువ్వేనా జె. సుబ్బారావు?" అన్నాడు సర్కిల్.

"అవును సార్."

"మోడరన్ స్ప్రింగ్ మాన్యుఫాక్చర్స్ నీదే గదూ!"

"చిన్న ఇండస్ట్రీసార్! ఈ మధ్యనే స్టార్టు చేశాను."

"అలాగా! ఈ అడ్రస్ నీదే గదూ!" అంటూ చిన్న కార్డు అందించాడు.

బ్లాక్ లెటర్స్‌లో సుబ్బారావు ఇంటి అడ్రస్ రాసి వుంది.

"యస్సార్!" అన్నాడు తడి ఆరిపోతున్న గొంతుతో.

"నిన్నెందుకు పిలిపించామో తెలుసా?"

"తెలియదు సార్! అసలు ఏమీ అర్థం కావడం లేదు. నేనేం తప్పు చేయలేదు." సుబ్బారావు ముఖం కళావిహీనమై పోతున్నది.

"తప్పు చేసిన వాళ్ళెవరూ అంత తేలిగ్గా ఒప్పుకోరు. ఆ సంగతి మాకు బాగా తెలుసు. అది సరే నీ పార్టనర్ పంపిన మనిషి చచ్చిపోయాడు తెలుసా?"

సుబ్బారావుకి మతి పోయినంత పనయింది.

"నా పార్టనరా? నాకెవరూ పార్టనర్స్ లేరు సార్. బ్యాంక్ లోన్ తీసుకుని ఇండస్ట్రీ స్టార్ట్ చేశాను."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్!" గాండ్రించాడు సర్కిల్.

సుబ్బారావు భయంతో బిగుసుకు పోయాడు. ఏం మాట్లాడితే ఏం తంటా వస్తుందోనని హడిలిపోయాడు. గొంతు పూడుకుపోయినట్లయింది. ఆ పార్టనర్ ఎవరో? వాడు పంపినవాడు చావడం ఏమిటో? అంతా

గందరగోళంగా వుంది.

ఇంతలో యస్. ఐ. ఒక సూట్ కేస్ తెచ్చి తెరిచాడు.

సుబ్బారావు కళ్ళు జిగేల్ మన్నాయి.

సూట్ కేస్ నిండా సరిక్రొత్త నోట్లు కట్టలు పేర్చి వున్నాయి.

''ఎవరివి సార్ ఇవ్వన్నీ!'' అమాయకంగా అడిగాడు సుబ్బారావు.

''నీవే!''

అంతా నవ్వారు.

సుబ్బారావు కాళ్ళు గడగడా వణుకుతున్నాయి. నిలబడే శక్తి నశించి పోతోంది. అదంతా కలా? వాస్తవమో తెలియడం లేదు.

''ఇవన్నీ నావి కాదుసార్!'' వణుకుతున్న కంఠంతో అన్నాడు.

''అన్నీ నీవి కాదని మాకు తెలుసు. కొన్ని నీవే గదా!''

''నో సార్: అసలు అందులో నావి ఏవీ లేవు. ఇవన్నీ ఎవరివో నాకు తెలియదు. ఈ నోట్లకూ నాకూ ఏం సంబంధం లేదు. నాకే పాపం తెలియదు. నేనంటే గిట్టని వాళ్ళెవరో రిపోర్టు చేసి వుంటారు....'' ఆక్రోశించాడు.

'వళ్ళు దగ్గిర పెట్టుకుని మాట్లాడు.'' హూంకరించాడు ఇనస్పెక్టర్ కళ్ళెర్రజేస్తూ.

పంజరంలో చిలకలా కొట్టుకున్నాడు సుబ్బారావు. ఏడుపు రాబోతుంటే బలవంతంగా ఆపుకున్నాడు.

"ఒరేయ్! రాస్కెల్. మర్యాదగా నిజం చెప్పు.

లేకపోతే ఎట్లా చెప్పించాలో మాకు తెలుసు." చేతిలోని లాఠీ ఝుళిపించాడు ఇనస్పెక్టర్. దాంతో తన నెత్తిన బాదినంత బాధపడిపోయాడు సుబ్బారావు.

"సార్!....సార్!...నిజమే చెప్తున్నాసార్! నాకేవీఁ తెలియదు సార్! వాడెవడో? ఈ నోట్లు ఎక్కడివో నేను ఎరుగను సార్! ఎక్కడా జాబ్ దొరక్క బాధపడుతూ వుంటే మా బావగారు ధైర్యం చెప్పి లోన్ ఇప్పించి ఇండస్ట్రి పెట్టించారు. నిజం సార్. నన్ను నమ్మండి."

"సరే. నమ్ముతాం. కాని ఆ చచ్చినవాడి జేబులోకి నీ అడ్రస్ కార్డు ఎలా వచ్చిందో చెప్పు!"

"ఆ దొంగ జేబులో నా అడ్రస్ కార్డు దొరికిందా?" సుబ్బారావు నివ్వెరపోతూ అన్నాడు.

"అవును. సిటీబస్ యాక్సిడెంట్‌లో చచ్చిపోయిన వాడి దగ్గర యీ సూట్‌కేస్ దొరికింది. వాడి చేతిలో యీ సూట్‌కేసుంది చచ్చిపోయినప్పుడు. వాడి జేబులో నీ అడ్రస్ దొరికింది. అంటే వాడు నీ దగ్గరికే వస్తు

న్నాడని అర్థంగదా? ఇప్పుడు నిజం చెప్పు?''

సుబ్బారావు తల గిరగిరా తిరిగిపోతూవుంది. నోటంట మాట రాలేదు.

"మాట్లాడవేరా రాస్కెల్!" లాఠీతో ఒక్కపోటు పొడిచాడు. ఆ దెబ్బకి పై ప్రాణం పైనే పోయినట్లయింది.

"ఇంకేం మాట్లాడతాడు? చిన్న ఇండస్ట్రీని నడుపుతూ దాన్ని అడ్డంపెట్టుకుని దొంగనోట్లు మార్చే బిజినెస్ చేస్తున్నాడు. వీడి వెనుక ఒక ముఠావుంది...." బూతులు తిట్టాడు ఇనస్పెక్టర్.

సుబ్బారావుకి ఏడుపు వచ్చింది. కంఠం బొంగురు పోయింది. "సార్!.... నాకేం తెలియదు సార్!"

"నోరెత్తావా చంపేస్తా. వీడిని లాకప్‌లో తొయ్యండి."

సుబ్బారావుని కటకటాల వెనకకు నెట్టి తాళం బిగించారు.

ప్రపంచమంతా చీకటైపోయినట్లయి నేలమీద కూలబడిపోయాడు సుబ్బారావు.

2

సుబ్బారావు అద్దెకుంటున్న రూమ్ ఓనరు సెల్వరాజు గారు వచ్చి బెయిల్‌మీద విడిపించడానికి ప్రయత్నించాడు. కాని వీల్లేకపోయింది. ఆయన చేసేదేంలేక సుబ్బారావు బావ జనార్థనరావుకి ట్రంకాల్ చేసి జరిగిందంతా చెప్పాడు.

ఏలూరు నుంచి హడావుడిగా వచ్చాడు జనార్థనరావు.

సెల్వరాజు, జనార్ధనరావు స్టేషన్‌కి వెళ్ళారు. వాళ్ళని

చూసి సుబ్బారావు భోరున ఏడ్చాడు. తనకే పాపం తెలియదని మొత్తుకున్నాడు.

జనార్ధనరావుకి ఏం అర్థంకాలేదు. ఆ చచ్చినవాడి దగ్గరే ఏదో పొరపాటు జరిగి వుంటుందని వూహించాడు. శవాన్ని చూపించమని అడిగాడు. హాస్పటల్లో కోల్డ్ స్టోరేజ్‌లో వున్న శవాన్ని చూపించారు పోలీసులు.

ఆ శవాన్ని చూసి ఆశ్చర్యపోయాడు జనార్ధనరావు.

ఆ శవంపేరు వినయ్. జనార్ధనరావు కొలీగ్ సీతారామయ్య మేనల్లుడు. ఏదో కంపెనీలో ఇంటర్వ్యూకి హైదరాబాద్ వస్తుంటే జాబ్ దొరికేవరకూ సుబ్బారావు రూమ్‌లో వుండమనీ, వేరే ఏదైనా ప్రయత్నం చెయ్యడానికి బాగుంటుందనీ జనార్ధనరావే సుబ్బారావు అడ్రస్ రాసిచ్చాడు.

అయితే వినయ్ సుబ్బారావుని కలుసుకోవడానికి సిటీ బస్‌లో వెళ్తూవుండగా ఈ ఘోరం జరిగి వుంటుంది. ఆ యాక్సిడెంట్‌లోనే ఎవరిదో సూట్‌కేస్ వినయ్ చేతిలో పడివుంటుంది అని జనార్ధనరావు చెప్పిందంతా పోలీసులు నమ్మలేదు.

సీతారామయ్యని వెంటనే పంపించమని వైర్లెస్ మెసేజ్ ఏలూరు వెళ్ళింది. రాత్రికి ఆయన వస్తే కేసు అనుకూలంగా తిరగవచ్చు అనే ఆశకలిగింది జనార్ధనరావుకి.

జనార్ధనరావు ఎన్ని ప్రయత్నాలు చేసినా బెయిల్‌మీద సుబ్బారావుని విడిపించలేకపోయాడు.

"మీరు చెప్పిందంతా నిజం కావచ్చు. కాని కొన్ని ఫ్యాక్టరీలలో దొంగనోట్లు చలామణీ అవుతున్నట్లుగా

మాకు రిపోర్టులు వచ్చాయి. ఆ ఇన్వెస్టిగేషన్‌లోనే వున్నాం. ఇంతలో ఇది జరిగింది. మాకు కొంత ఆధారం చిక్కిందనుకోండి. ఏమైనా మీ బామ్మర్దిని విడిచిపెట్టలేం. సారీ!" అన్నాడు డి.యస్పి.

3

లాకప్‌లో నిద్రపట్టని సుబ్బారావుకి ఆ రోజు అరుణ చెప్పిందంతా జ్ఞాపకం వచ్చింది.

ఫస్ట్ షో సినిమా చూసి ఇంటికి వస్తున్నారు అరుణ, ఆమె ఫ్రెండ్ కామేశ్వరి. అనుకోకుండా చినుకులు మొదలయ్యాయి. తలెత్తి చూస్తే చంద్రుణ్ణి, చుక్కలతో సహా మింగేసి వికటాట్టహాసం చేస్తున్న కారు మబ్బులు భయంకరంగా కన్పించాయి.

'అమ్మో పెద్దవాన వచ్చేట్లుంది' అనుకునే లోపలే వర్షం పెద్దదై జోరున కురవసాగింది. ఇంటి వరండాలో అరుగు మీద నిల్చున్నారు.

అరగంట దాటినా వర్షం పెద్దదవుతూ వుందే తప్ప తగ్గే సూచనలు కన్పించలేదు. నిల్చుని నిల్చుని కాళ్ళు తీపులు పుట్టి అరుగుమీద కూర్చున్నారు.

ఇంతలో తలుపులు తెరుచుకున్నాయి. ఎవడో తూలుకుంటూ వచ్చాడు. అతను వీళ్ళని గమనించలేదు. వానలోనే తడుస్తూ వెన్నెల్లో నడుస్తున్నంత హాయిగా వెళ్ళిపోతుంటే వాళ్ళకి నవ్వొచ్చింది.

అంతలో లోపలనుంచి ఎవరో యువతి వచ్చింది. లైట్ లేకపోవడం వల్ల అస్పష్టంగా కన్పిస్తోంది ఆమె.

"ఎవరు మీరు?" అంది.

"వర్షం వస్తుంటే నిల్చున్నాం" అంది అరుణ.

"అలాగా. వర్షం తగ్గేట్లు లేదు. లోపలికి రండి. ఫర్వాలేదు." అంది.

వీళ్ళు కదల్లేదు.

ఆమెగూడా వీళ్ళని వదల్లేదు. 'మీ పేరు, వూరు, ఇల్లెక్కడ? ఏం చేస్తుంటారు' వగైరా అడుగుతూ కూర్చుంది.

ఇంతలో సర్రున దూసుకుని వచ్చిన పోలీస్ వాన్ సరిగ్గా ఆ ఇంటిముందే ఆగింది అది చూసి ఆమె ఇంట్లోకి పారిపోయింది. బిల బిల మంటూ పోలీసులు దిగి ఆ ఇంటిని చుట్టుముట్టారు.

కాసేపటికి దాదాపు పదిమంది ఆడవాళ్ళని బూతులు తిడుతూ, నెట్టుకుంటూ వాన్ లోకి ఎక్కించారు పోలీసులు. వాళ్ళతోపాటే అరుణని, కామేశ్వరిని బలవంతంగా

లాక్కెళ్ళారు. వాళ్ళ గోడు వినే నాధుడే లేడు.

ఆ రాత్రంతా వాళ్ళు అక్కడే వుండాల్సొచ్చింది. ప్రొద్దున్న వాళ్ళు పనిచేస్తున్న స్కూల్ హెడ్ మిస్ట్రెస్‌కి ఫోన్ చేసి జరిగిందంతా చెప్తే ఆమె స్వయంగా వచ్చి విడిపించింది.

జరిగినదానికి మసి పూసి మారేడుకాయ చేశారు గిట్టనివాళ్ళు. 'అరుణ, కామేశ్వరి జాయింటుగా చాటుమాటుగా వ్యభిచారం చేస్తున్నారనీ, పాపం పండి పోలీసులకి చిక్కారనీ' అంతా అనుకుంటున్నారు.

అదంతా విని సుబ్బారావు నిజమేనని నమ్మాడు. దరిద్రం ఎంత నీచానికైనా దిగజారుస్తుందనుకున్నాడు.

కాని ఇప్పుడు తన విషయంలో జరిగిందంతా చూస్తుంటే అరుణ చెప్పిందంతా నిజమే అనిపించ సాగింది. పాపం తను గూడా అనుమానించినందుకు ఆమె ఎంత క్షోభ అనుభవించిందో అనుకొని బాధ పడసాగాడు.

'దేవుడా నన్నీ సాలెగూట్లోంచి బైట పడేయ్' అని ప్రార్థించాడు.

4

సిటీబస్ యాక్సిడెంట్‌లో దెబ్బలు తగిలినవాళ్ళని హాస్పటల్లో చేర్పించారు. అందులో ఎవరైనా ఒకడు నేరస్థుడు కావడానికి అవకాశం వుంది.

సిటీబస్‌లో ప్రయాణం చేసిన వాళ్ళలో నేరస్థుడు చచ్చిపోయినవాడైనా అయివుండాలి, లేదా యాక్సి డెంట్‌లో దెబ్బలు తిని హాస్పటల్లో అడ్మిట్ అయిన

వాళ్ళల్లోనయినా వుండి వుండాలి. లేకపోతే సూట్ కేస్ దొరికి వుండేది కాదుగదా!

అందుకని హాస్పటల్ కి వచ్చిపోయేవారిమీద నిఘా వేసివుంచారు పోలీసులు.

అర్ధరాత్రి దాటాక ఒక యువకుడు కాంపౌండ్ వాల్ దూకి వార్డులోకి ప్రవేశించి, జేమ్స్ అనేవాడితో ఘర్షణ పడుతున్నాడు. అంటే సూట్ కేస్ గురించి అడుగు తున్నాడన్నమాట.

జేమ్స్ కాలు విరిగి మూలుగుతున్నాడు బెడ్ మీద, సూట్ కేస్ పోయిందని చెప్పినట్లున్నాడు. ఆ వచ్చిన వాడు జేమ్స్ ని చంపడానికి కత్తి తీసే లోపల పోలీసులు అతన్ని పట్టుకున్నారు.

ఆ సూట్ కేస్ జేమ్స్ ద్వారా ఒక పెద్ద కంపెనీకి పంపిస్తున్నారు ముఠావాళ్ళు. ఆ కంపెనీ క్యాషియర్ తో లాలూచీ వుంది వాళ్ళకి.

ఫస్టున జీతాలివ్వడానికి బ్యాంకి నుంచి తెచ్చిన నోట్లు దాచి, ముఠావాళ్ళిచ్చిన దొంగనోట్లు పంచుతాడు క్యాషియర్. అలా ఒక్కరోజులోనే దొంగనోట్లు చలామణీ అయిపోతాయి. క్యాషియర్ కి కమిషన్ ముడుతుంది.

అదీ కథ.

* * *

బ్రతుకు జీవుడా అని సుబ్బారావు చిక్కులోనుంచి బైటపడ్డాడు.

అరుణని కలుసుకోవడానికి ఆరోజే బయల్దేరి వెళ్ళాడు. □

నేట ముక్కలు

రేవతి

వెంకట్రామయ్యకి పాత పుస్తకాలు అమ్మే దుకాణం వుంది. ఊరు మధ్యలో దుకాణం అద్దెకి తీసుకునేంత ఆర్థిక స్థోమత లేనికారణంగా సఫిల్ గూడా చివర ఓ చిన్న దుకాణం అద్దెకి తీసుకుని వ్యాపారం నడుపుతున్నాడు.

ముందుగది దుకాణంగా, వెనకాల రెండుగదులు వసతి కోసం వుపయోగిస్తున్నాడు. ఆ స్టేమంది రాకపోయినా

రెగ్యులర్‌గా అతని దుకాణానికి వచ్చే కస్టమర్స్‌వల్ల అతని వ్యాపారం బాగా సాగుతోందనే చెప్పాలి.

తరచు ఆయన దుకాణానికి నేను పుదయం వెళ్ళి, మధ్యాహ్నందాకా పాతపుస్తకాలు తిరగేస్తూ గడుపుతుంటాను. పుస్తకాలు కొనకుండా వెళ్ళినా వెంకట్రామయ్య కోపగించుకోడు.

నిజానికి వంటరి జీవితం గడిపే వెంకట్రామయ్య నేను వస్తే చాలనుకుంటాడు. ఒకోసారి టీ నావాక్కూడా ఇస్తాడు. అది తాగుతూ పుస్తకాల గురించి ముచ్చటిస్తూంటాం. అష్టే లాభాలు లేకపోయినా వచ్చినంతలో సంతృప్తిగా బ్రతుకుతున్నాడు వెంకట్రామయ్య.

వెంకట్రామయ్య ఇంటి వెనకాల చాలా ఖాళీస్థలం వుంది. అందులో మామిడిచెట్లు, పొదలు, ఏపుగా పెరిగి ఎండినగడ్డి కర్రతోచేయబడ్డ, నేలకి వాలిపోతున్న ఫెన్సింగ్ - ఆ ప్రదేశం చూడటానికి ఎంతో విచారం పుట్టపడేలా వుంటుంది. అప్పుడప్పుడు అనుకుంటూంటాను వెంకట్రామయ్య ఆ ప్రదేశాన్ని ఎందుకు శుభ్రంగా వుంచడా అని.

ఆరోజు దుకాణానికి వెళ్తే ఎప్పటిలా వెంకట్రామయ్య ముందు గదిలో లేడు. వెనక వంటగదిలోకి వెళ్ళాను. ఆ గది కిటికీదగ్గర నిలబడి ఇంటి వెనకవున్న పెరటి వంక చూస్తున్నాడు.

పలకరించబోయి ఎందుకో ఆగిపోయాను. ఆయన చూపులోని తీక్షణతని గుర్తించి అనుకుంటాను. ఆ పెరడులోని ఏ వస్తువునో, లీనమయి చూస్తున్నట్లుగా వుంది ఆయనచూపు. ఆ చూపులో ఏదో కొత్తఅందాన్ని

చూస్తున్న భావన, దాంతోపాటు భయం రెండూ కలసి వున్నాయి.

కొద్దిసేపయ్యాక నా వంకచూసి వులిక్కిపడ్డాడు వెంక ట్రామయ్య. నన్నువెంటనే గుర్తుపట్టలేదు. ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లుగా చూసాడు.

ఆయన మొహంమీద క్రమంగా చిరునవ్వు అలుము కుంది. ఓసారి తల విదిలించి చెప్పాడు.

"ఈ ఇంటి వెనకాలవున్న పెరడు ఒకసారి చాలా గమ్మత్తుగా కనిపిస్తూంటుంది నాకు. కొద్దిసేపు దీక్షగా చూస్తే కొన్ని మైళ్ళు పొడవున్నట్లుగా అనిపిస్తుంది."

అప్పుడాయన చెప్పింది అంతే. ఆ విషయం వెంటనే మర్చిపోయాను. కాని కొన్ని భయంకరమయిన సంఘ టనలకి అది మొదలు అని తెలుసుకోలేకపోయాను.

ఆ తర్వాత ఆయన దుకాణానికి ఎప్పుడు వెళ్ళినా వెంకట్రామయ్య ఆ వెనక గదిలో వుంటున్నాడు. ఆ కిటికీ దగ్గర నిలబడి ఇంటి వెనకవున్న పెరడు వంక చూస్తూ కనబడసాగాడు.

కొన్నిసార్లు నేను వచ్చిన సంగతే గుర్తించకుండా దీక్షగా ఆ పెరటివంక చూస్తుంటాడు. ఏం చూసేవాడో కాని అది అతన్ని పరిపూర్ణంగా ఆకర్షించేది. ఆ సమ యంలో ఆయన మొహంలో భయం మిళితమయిన వింత ఆనందం తాలూకు ఛాయలు కనబడేవి. గట్టిగా దగ్గే వాడిని అలాంటప్పుడు.

బయటకి వచ్చి పుస్తకాల గురించి మాట్లాడుతున్న ప్పటి వెంకట్రామయ్యలా అనిపించేవాడు కాదు నాకు. నాతో మాట్లాడటం కేవలం నటనేననీ, ఆయన ఆలోచ

నలు ఇంకా ఆ పెరడుమీదే వున్నాయని క్రమంగా గుర్తించాను.

అనేకసార్లు ఆ పెరడులో ఆయన్ని అంతగా ఆకర్షించే విశేషం ఏం వుంది? అని అడుగుదామను కున్నాను కాని, బావుండదని నోటిదాకా వచ్చిన మాటలని మింగేసేవాడిని.

ఆ తర్వాత ఆలా అడగనందుకు నిజంగా బాధపడ్డాను.

అంతంత మాత్రంగా వున్న ఆయన వ్యాపారం తగ్గిపోసాగింది. ఆయన కూడా శారీరకంగా దిగజారిపోతున్నట్లుగా అనిపించింది.

ఓ మధ్యాహ్నం ఆయన దుకాణానికి వెళ్తే నాకాయన ముందుగదిలో కన్పించలేదు. వెనక గదిలో కూడా లేదు. పెరడులో ఉన్నాడేమోనని ఆ కిటికీలోంచి వంగి బయటికి చూశాను.

వెంకట్రామయ్య కనబడలేదు కాని అలా పెరడు వంక చూస్తుంటే అకస్మాత్తుగా నాలో మాటలలో చెప్పలేని వంటరితనం, దుర్మార్గపు భావనలు చోటు చేసుకోసాగాయి. ఆ కిటికీలోంచి వెనక్కి జరగాలనిపించింది కాని నన్నేదో పట్టి ఆపినట్లుగా అలాగే పెరడువంక నిశ్శబ్దంగా చూస్తూండి పోయాను.

పెరిగిన గడ్డిని, పొదలని చూస్తుంటే ఏదో చెప్పలేని అశక్తి నాలో ప్రవేశించింది. గాలికి నెమ్మదిగ వూగుతున్న గడ్డిపరకలు. ఒక్క పిట్టగాని, పురుగుగాని ఎగరడంలేదు అక్కడ. చెట్లు కదలకుండా ఉన్నాయి. ఆ ఎండు గడ్డి, దుబ్బు పొదలు, చెట్లు తప్ప చూడటానికి అక్కడేంలేవు.

అయినా ఆసక్తిగా వుంది చూడటానికి ఆ పెరడు ఏదో మాయలా అనిపించింది నాకు. అదో చిక్కు ప్రశ్నలా. దానివంక అలాగే చూస్తుంటే ఆ చిక్కు ప్రశ్నకి సమాధానం దొరుకుతుంది అనిపించింది.

అకస్మాత్తుగా నాలో కొత్త భావన చోటు చేసుకుంది. ఆ పెరడు పొడవు పెరుగుతున్నట్టుగా అనిపించింది. మునుపు నేను అనుకున్నదానికన్నా ఆ పెరడు పొడవు పెద్దది అయివుంటుంది అనుకున్నాను. కాని ఒకసారి అందులోకి అడుగు పెడితే చివర కనుక్కోవడానికి కొన్ని మైళ్ళు నడవాలి అనిపించింది.

ఆ పెరడులోకి వెంటనే వెళ్ళి, దాని చివర ఎంత దూరంలో వుందో పరిగెత్తికెళ్ళి తెలుసుకోవాలనే కోరిక బలంగా కలిగింది నాలో.

ఇంతలో వెంకట్రామయ్య నా కంట పడ్డాడు. ఎక్కడనుంచో వూడిపడ్డట్టుగా ఆ గడ్డి దుబ్బుల మధ్య నుంచి బయటకి వచ్చాడు.

ఆయన మొహం, చూపు ఓ నిముషంపాటు ఆయన ఈ లోకంలో లేనట్టుగా అనిపించాయి. ఇంటివంక చూసాడు. అదే మొదటిసారి ఆ ఇంటిని చూస్తున్నట్టుగా చూసాడు. ఆయన పేంట్ కి. షర్ట్ కాలర్ కి, బూట్లకి గడ్డి పరకలు అంటుకుని వున్నాయి. ఆయన కళ్ళు ఎటో చూస్తున్నాయి.

వెనక్కి తిరిగాడు మళ్ళీ ఆ గడ్డి దుబ్బులలోకి పరిగెత్తే వాడిలా. నేను గట్టిగా పిలిచాను ఆయన్ని. సగం వెనక్కి తిరిగి నా వంక చూసాడు. క్రమంగా అశాంతిగా వున్న ఆయన మొహంలోకి ప్రశాంతత తిరిగి వచ్చింది.

గబ గబ నేను గుమ్మందగ్గరకివెళ్ళి తలుపు తెరిచాను. చాలా అలసిపోయినట్లుగా నడుస్తు ముందర గదికి చేరుకుని కుర్చీలో కూలబడ్డాడు వెంకట్రామయ్య.

''కొద్దిగా టీ కాస్తావా?" అడిగాడు నన్ను.

టీ తాగాం. ఏం జరిగిందో చెప్పడానికి కూడా మాట రానట్లుగా వగరుస్తున్నాడు వెంకట్రామయ్య.

"ఏం జరిగింది?" అనడిగాను.

తనకళ్ళజోడును తీసి గట్టిగా నిట్టూర్చాడు వెంకట్రామయ్య.

"ఆ పెరడులో ఏదో వుంది. ఏదో రహస్యం. అదేమిటో కనుక్కోవాలి నేను. నాకు స్పష్టంగా తెలియదు. దాని పొదవు, వెడల్పు, వైశాల్యం తాలూకు రహస్యం కనుక్కోవాలి. లేదా ఆ రహస్యం ఇంకేదయినా కావచ్చు. దాన్ని ఓ ఛాలెంజ్‌గా తీసుకున్నాను. దాని అంతుచూడాలి. నన్ను పిచ్చివాడనుకుంటే నేనేం చేయ లేను. కాని ఆ పెరటి రహస్యాన్ని చేధిస్తేకాని నాకు శాంతిలేదు."

కళ్ళ జోడు తుడిచి, మళ్ళీ పెట్టుకుని చెప్పసాగాడు.

"ఆ ఉదయం నాకు ఏదో కొత్త భయాన్ని కలిగించే ఓ అనుభవం కలిగింది. ఆ కిటికీ దగ్గర నుంచుని పెరటి వంక చూస్తున్నాను. చాలాసేపటికి ఆ పెరడులోకి వెళ్ళాలనే కోరిక....కోరికకాదు... ఏదో అయస్కాంత శక్తి నన్ను లాగినట్లుగా పెరడులోకి అడుగుపెట్టాను.

ఆ గడ్డి పొదల్లోకి దూకుతుంటే ఎంతో సంతోషం వేసింది. ఇంకా ఏదో ఆనందం కలుగుతుందనిపించింది. కాని కొంత దూరం వెళ్ళాక సంతోషం స్థానంలో

అకస్మాత్తుగా విపరీతమైన దుఃఖం కలిగింది నా ప్రయత్నం లేకుండానే.

ఇంట్లోకి వచ్చేద్దామని వెనక్కి తిరిగాను. కాని రాలేక పోయాను. నువు నమ్మవుకాని నేను దారి మరచి పోయాను. ఏ వైపు తిరగాలో దారి ఎటో అన్న సంగతి పూర్తిగా మరచిపోయాను. ఆ గడ్డి కనబడు తున్నదానికన్నా పొడవయినది. అందులోకి వెళ్తే ఇంకేమీ కనబడదు. నమ్మలేవు కాని నిజంగా గంట పైనే తిరిగాను అందులో.

గడ్డి పొదలలోకి వెళ్ళగానే ఆ పెరడు కొన్ని మైళ్ళ పొడవున్నట్లుగా అనిపించింది నాకు. ఎంత దూరం నడిచినా ఆ దూరం ఇంకా సాగుతున్నట్లుగానే అనిపించింది. నేను అందులో గుండ్రంగా నడిచి వుంటచ్చు. కాని కొన్ని మైళ్ళు నడిచాను."

తల విదిలించి అన్నాడు.

"నువు నమ్మకపోయినా పర్వాలేదు. కాని నిజంగా జరిగింది. అది నేను తిరిగి బయటకి దారికనుక్కున్నా నంటే అది కేవలం ఎంతో కాకతాళీయంగా జరిగింది. ఇంకో విచిత్రం. బయటకి వచ్చాక చుట్టూ గడ్డి లేక పోవడంతో ఎంతో భయం వేసింది నాకు. తిరిగి మళ్ళీ ఆ గడ్డిలోకి వెళ్ళాలనిపించింది

నేను మౌనంగా వుండిపోయాను.

"నేను మళ్ళీ వెళ్తాను అందులోకి ప్రకృతికి వ్యతి రేకమయిన, అసహజమయిన వింత, రహస్యం ఏదో వుందా గడ్డిపొదల్లో అదేమిటో కనుక్కోవాలి నేను. నాకో చక్కటి ఆలోచన వచ్చింది. దాన్ని అసలు

ఫరిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

కిటికీ దగ్గర విలబడి ఆ పెరటివంక చూస్తున్న ప్పుడు అలాంటి వింత అనుభవం నాకూ జరిగింది కాబట్టి వెంకట్రామయ్య మాటలు పూర్తిగా కొట్టి పారెయ్యలేదు నేను. ఆయన్ని మళ్ళీ ఆ పెరడులోకి వెళ్ళద్దని సలహా ఇచ్చాను. కాని ఆయన నా సలహా పాటించడని తెలుసు నాకు.

ఆయన దుకాణంలోంచి అన్యమనస్కంగా బయటకి వచ్చాను. ఏదో జరగరానిది జరగబోతోంది అవి పించింది నా మనస్సుకి.

నాలుగు రోజుల తర్వాత నేను మళ్ళా కొన్ని పాత పుస్తకాల కోసం వెంకట్రామయ్య దుకాణానికి వెళ్ళి నప్పుడు నా భయాలు నిజమయ్యాయి.

వెంకట్రామయ్య ముందుగదిలో లేడు. అసలు ఇంట్లోనే లేడు. చివరికి భయంగా పెరటి తలుపు తెరి చాను పెరడువంక చూసాను.

పక్షుల అరుపులు కాని, ఏశబ్దంగానిలేదు. ఎత్తుగా ఎది గిన గడ్డిపొదలు గాలికి అతి మెల్లగా కదులుతున్నాయి. ఆ పెరడే ఏదయినా శబ్దం విందాం' అన్నట్లుగా వుందని పించింది నాకు.

నా కాళ్ళకి ఏదో తగిలితే చూశాను ట్వయిన్ దారం అది. ఇంటిగుమ్మానికి కట్టబడ్డ ఆ దారం పెరడులోకి- ఆ గడ్డిపొదలలోకి సాగిపోయింది.

వెంకట్రామయ్య తనకు చక్కటి ఆలోచన వచ్చిందని చెప్పినసంగతి గుర్తుకు వచ్చింది నాకు. తనతో ఓ దారంచుట్ట తీసుకువెళ్ళి, పెరడుచివర కనుక్కొని, తిరిగి

ఆ దారం సహాయంతో వెనక్కి వద్దామనుకుని వుంటాడు. అది మంచి ఆలోచన కాబట్టి కొద్దిగా భయం తగ్గింది నాకు. వెంకట్రామయ్య తిరిగి వచ్చేదాకా ఆగుదా మను కున్నాను. లోపలికి వెళ్ళి కొన్ని పుస్తకాలు తిరగేయ సాగాను.

ఎంతసేపయింది ఆయన ఆ గడ్డి పొదల్లోకి వెళ్ళి? చాలా సేపయినా రాలేదు ఆయన.

పెరటిలోకి వచ్చాను మళ్ళీ. ఎక్కడా అతని జాడ లేదు. గట్టిగా పేరు పెట్టి పిలిచాను. ఎందుకో అనిపించింది నా పిలుపు గోడలా వున్న ఆ గడ్డిపొదలకి తగిలి అక్కడే ఆగిపోయిందనిపించింది నాకు. మళ్ళీ పిల్చాను కాని జవాబు లేదు

చివరికి చేతిలోకి ఆ ట్వయిన్ దారం తీసుకుని ఆయన్ని వెదుక్కుంటూ బయల్దేరాను పొదల్లోకి. ఆ ట్వయిన్ దారం వెంట వెళితే ఆయన తప్పక కనపడాలి.

ముందర తేలికగానే నడవగలిగాను. కొద్దిదూరం వెళ్ళాక పొదలు దగ్గిర దగ్గిరగా పెరగడం వల్ల వాటిని తప్పించుకుని వెళ్ళటం ఇబ్బందికరంగా అనిపించింది.

కొన్నిగజాల దూరం లోపలకి వెళ్ళగానే అకస్మాత్తుగా నాలో వంటరితనం, దుఃఖం ప్రవేశించాయి. ఆ చోటులో ఏదో మాయ తప్పకుండా వుంది. వినీ వినబడని గుస గుసలు వినిపించసాగాయి. ఎటుచూసినా గడ్డిపొదలే.

కొద్ది దూరం నడిచాక దారం చివరచేతికి తగిలింది. అది ముళ్ళపొదలో చిక్కుకునితెగిపోయివుంది. కొద్దిసేపు వెదికినా తెగిన ఆ రెండోదారం ముక్క నాక్కనబడలేదు.

వెంకట్రామయ్యకి దారంతెగిన సంగతి తెలియక

బహుశ తనచేతిలోని దారంముక్కతో ఇంకా నడుస్తూండి వుంటాడు. ఎంత దూరంలో వున్నాడు?

నేనురెండు చేతులూ నోటిముందు లౌడ్‌స్పీకర్‌లా వుంచుకుని గట్టిగా ఆయన్ని పేరుపెట్టి పిల్చాను. కాని పిలుపు గొంతులోనే ఆగిపోయింది. బావిలోంచి విన బడ్డట్లుగా వినిపించింది ఆ పిలుపు.

నాలో భయం పేరుకోసాగింది క్రమంగా. రెండు చేతులతో అడ్డంగావున్న పొదలని వెనక్కి నెట్టసాగాను. చెమటలు కారుతున్నాయి. తల పగిలిపోతోంది. నా దృష్టి మందగిస్తోందనిపిస్తోంది. పెరడులో ఏ భాగంలో ఉన్నానో, వెనక్కి తిరగాలంటే ఎటువైపు వెళ్ళాలో తెలియ లేదు నాకు.

అకస్మాత్తుగా ఆ ప్రపంచంలో నేను వంటరిగాడిననిపించింది. భయంతో వంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

ఎవరో.... లేదా.... ఏదో నా వెనకాల ఆ గడ్డిలో పాకుతున్నట్లుగా అనిపించింది నాకు. ఏదో నేలమీద పాకుతోంది. నన్ను గమనిస్తోందని, అలా గమనించే అది నాకు హాని తలపెడుతోందనిపించింది.

ముందర పరిగెత్తి పారిపోవాలి అనిపించింది. కాని అంతలో నాలో కోపం ప్రవేశించింది. వెంకట్రామయ్య మీద, ఆ పెరడుమీద, నామీద నాకే కోపంముంచుకు వచ్చింది.

వెంటనే దానిఅంతు చూడాలనుకుని, వెనక్కి తిరిగి, నన్ను వెంబడించే జీవి దాగివుండచ్చు అనుకున్నవైపు దూకాను.

అకస్మాత్తుగా ఆగాను.

క్షణాల్లో నాలోని రాక్షసకోపం విపరీతమయిన భయంగా మారిపోయింది.

సన్నగా పడేఎండలో, గడ్డి పొదల మొక్కళ్ళ దగ్గర వెంకట్రామయ్య కూర్చుని వున్నాడు. మనిషిలా కాదు! మీదకి దూకడానికి సిద్ధంగా వున్న మృగంలా కాళ్ళు, చేతులు నేలమీద వుంచి కూర్చొని వున్నాడు!

కళ్ళజోడు లేదు జారిపోయినట్లుంది బట్టలు చిరిగి పోయి వున్నాయి నోరు పిచ్చివాడి నోటిలా భయంకరంగా వుంది వంకర తిరిగి. గిర్ గిర్ మనే శబ్దం వస్తోంది నోటిలోంచి.

అయన్నె చూస్తూ అలాగే నిల్చుండిపోయాను. నన్ను గుర్తించలేదు. ఆయన కళ్ళలో, మొహంలో ద్వేషం కనబడింది నాకు. ఆయన తలమీద వున్న వెంట్రుకల మీద, వంటిమీద, చిరిగిన బట్టలమీద గడ్డి

పరకలు అంటుకుని వున్నాయి, చాలా సేపు ఆగడ్డిలో తిరిగినట్లుగా.

నెమ్మదిగా స్పృహలోకి వచ్చాడు.

"వెంకట్రామయ్యా. నన్ను గుర్తుపట్టలేదా?" అరిచాను గొంతు చించుకుని.

సమాధానంగా గుర్ గుర్ మన్నాడు. నా మీదకి ఆయన దూకడానికి సిద్ధమయినట్లుగా ఆయన కండరాలు కదిలాయి.

భయంతో పక్కకి జరిగి పరిగెత్తసాగాను. ఆ గడ్డి పొదలమధ్య వేగంగా వెంకట్రామయ్య వెనకపడ్డ గుర్తుగా వెనకాల అలికిడి. నేను నా ప్రాణాల కోసం పరిగెత్తుతున్నాను ఇప్పుడు.

గడ్డిపొదలు నామొహానికి తగిలి కొరడాతో కొట్టినట్లు చురుక్కుమంటున్నాయి. ముళ్ళు గిచ్చుకుంటున్నాయి. కాని నాకు ఎలాంటిబాధ అనిపించలేదు.

ఆక్షణంలో నా శారీరక, మానసిక శక్తులన్నీ ఒకే విషయంమీద కేంద్రీకరింపబడి వున్నాయి.

ఆగడ్డి పొదలలోంచి, ఆ భయంకరమయిన వాతావరణం లోంచి, నన్ను తరిమే ఆభయంకరమయిన మృగంలాంటి మనిషినుంచి బయటపడాలి.

నాకాళ్ళు నొప్పులు పుడుతున్నాయి. విపరీతమైన ఆయాసం. నావెనకాల వున్నది దగ్గరవుతోంది క్రమంగా. దాని అరుపు వినబడుతోంది. గాల్లోలేచే నాకాళ్ళకి కొన్ని అంగుళాల దూరంలోవుంది అది నిజానికి ఆగడ్డి పొదల్లో నేను గుండ్రంగా తిరుగుతున్నాననిపించింది. ఇక ఎన్నటికీ బయట పడలేననిపించింది.

ఇంకా క్షణంలో అలసటతో నేలమీదకి వాలిపోతానని

పించింది. ఆకస్మాత్తుగా పొదల్లోంచి బయటపడ్డాను. ఎదురుగా వెంకట్రామయ్య ఇల్లు కనబడగానే గట్టిగా వూపిరి పీల్చుకుని తలుపువైపు నడిచాను.

నన్ను వెంటాడే ఆ మృత్యువు ఆగడ్డి పొదలు దాటి బయటకి రాదనిపించింది ఎందుకో. నేను కనీసం ఆ సంగతి రూఢి చేసుకోడానికికూడా వెనక్కి తిరగలేదు. అలా ఎందుకనిపించిందో ఈనాటికీ చెప్పలేను.

ముందర గదిలో కుర్చీలో నీరసంగా కూలబడ్డాను. కొద్దిసేపట్లో ఆయాసం తగ్గి మామూలుగా వూపిరి పీల్చసాగాను.

వెంకట్రామయ్యకి పూర్తిగా పిచ్చెక్కింది. ఏదో భయంకరమయిన షాక్‌వల్ల ఆవిధంగామారి, తన దారి లోకి ఎవరొస్తేవాళ్ళని నాశనం చేసేలా తయారయాడు. నావంక చూసిన ఆచూపులో మృగాలకుండే క్రూరత్వం గుర్తొస్తోంది నాకు. బహుశ అతని మెదడు పనిచేస్తూండక పోవచ్చు. ఆపిచ్చి ఇకవదలదు బహుశ. పోలీసులకి, అంబులెన్స్‌కి ఫోన్‌చేసాను నేనాషాక్‌నించి తేరు కుని, టీ కలుపుకుని తాగాక.

పోలీసులు రాగానే జరిగింది వివరించాను. నావంక అనుమానంగా చూసారు, నాకు పిచ్చెక్కిందా అన్నట్లుగా. ఆరుగురు పోలీసులు ఓ గంటదాకా వెంకట్రామయ్య కోసం వెదికారు ఆ పెరడులో. ఆ గడ్డి పొదల్లోంచి బయటకు వచ్చి చెప్పారు. వెంకట్రామయ్య లేడక్కడ. దూరంగా మొరిగే ఓ కుక్కతప్ప మరేశబ్దం వినలేదు.

జరిగింది నేను ఇరవైసార్లయినా చెప్పాను. కాని వాళ్ళకి తృప్తి కలగలేదు. ఇంటి మొత్తాన్ని గాలించారు



నేను వెంకట్రామయ్యని చంపి ఎక్కడయినా శవాన్ని దాచానేమోనని. తర్వాత ఆయన ఫైళ్ళన్నీ తణిఖీ చేసారు.

చివరికి వెంకట్రామయ్య ఏదో భయంకరమయిన అనుభవంవల్ల జ్ఞాపకశక్తి పూర్తిగా కోల్పోయి, ఎటో వెళ్ళిపోయి వుంటాడని తీర్మానించారు.

తర్వాత నన్ను మళ్ళీ ప్రశ్నించాల్సి వస్తుందని, చిరునామా తీసుకుని నా వెంట నలుగురు పోలీసులని పంపించారు.

వాళ్ళ తర్వాత పరిశోధనల వల్ల కొత్త విషయాలేం తెలియలేదు. తప్పిపోయిన వ్యక్తుల జాబితాలో చేర్చారు వెంకట్రామయ్య పేరుని. ఆయన తరఫున ఎవరూ లేకపోవడం వల్ల అట్టే శ్రద్ధ చూపించలేదు పోలీసులు.

కాని నాకు అంతటితో తృప్తి కలగలేదు. మనసంతా అశాంతిగా వుంది. హైదరాబాద్ నవాబు లైబ్రరీలో అరు

నెలలపాటు ఎంతో ఓపికగా వెదికితే చిన్న ఆధారం దొరికింది. దానిలోని నిజానిజాల తాలూకు వివరణ ఇవ్వలేను నేను. అందుకే ఈ విషయం తప్పనిసరిగా నమ్మమని ఎవరికీ చెప్పను.

నవాబు లైబ్రరీలో పురాతన పుస్తకాలుంచే సెక్షన్ చూసే వుద్యోగి 1695 లో ముద్రింపబడ్డ పాత, నలిగిపోయిన కాగితం ఒకటి అందించాడు నాకు. రచయిత పేరు లేదు. శీర్షిక మాత్రం వుంది దానిమీద.

"అభయంకరి, మంత్రకత్తె మరణం"

కొన్ని సంవత్సరాల ముందు అభయంకరి అనే మంత్రకత్తెని, ఆమె ఇరుగు పొరుగు వారు, కనబడకుండాపోయిన ఓ చిన్న పిల్లని వేటకుక్కగా మార్చిందని నిందించారు. అందుకు ఆమెకి మరణ శిక్ష విధించారు. వురి తీయలేదు. అడవిలోని ఓ పొదలుండే ప్రాంతానికి తీసుకెళ్ళారు ఆమెని. పదిహేను రోజులు తిండి పెట్టకుండా మాడ్చబడ్డ ఏడు భయంకరమయిన వేటకుక్కలని ఆమె మీదకి వదిలారు.

ఆమెని దోషిగా నిందించిన వాళ్ళు ఇది ఆమెకి సరయిన శిక్షగా భావించి విధించారు.

ఆకలిగొన్న ఆ ఏడు కుక్కలు ఆమెని చుట్టుముట్టగా, ఆమె అరచిన అరుపులు వినబడ్డాయి ఆ గ్రామస్థులకి.

"నేను నేల మీద బడ్డ ఈ భూమి నరకానికి వెళ్ళే మార్గంగా వుండుగాక!

ఈ నేల మీదకి వచ్చిన మనిషి నన్ను చంపే

ఈ వేటకుక్కలాగా మారుగాక !!

ఇది నా మంత్రదండంతో నేను విధించే శాపం !!!"

హుంకరిస్తూ అరిచింది అభయంకరి.

పాత మేప్‌లు, భూమిపట్టాలు, ఇతర పత్రాలు తిరిగే సాక, అభయంకరి వేటకుక్కలచేత భుజింపబడ్డ అడవి లోని ఆనేల ప్రస్తుతం సఫిల్‌గూడాలోని వెంకట్రామయ్య ఇంటివెనక వున్న ఆ నరకప్రాయమైన పెరడే అన్న సంగతి రూఢి అయింది నాకు.

ఆ తర్వాత నేను మళ్ళీ ఒకే ఒకసారి ఆ పెరటి దగ్గరకు వెళ్ళాను. ఎందుకు వెళ్ళానంటే కారణం చెప్ప లేను. వెంకట్రామయ్య అంటే నాకు ఇదివరకు ఇష్టం, ఇప్పుడు జాలి వున్నాయి కాబట్టి అనుకుంటాను. గుమ్మం దాటి పెరటిలోకి ప్రవేశించి అక్కడ నిలబడి ఆ గడ్డి పొదలవంక చూడసాగాను.

అకస్మాత్తుగా ఆ గడ్డిపొదలు నన్ను పిలుస్తున్నట్లుగా అనిపించింది. అందులోకి వెళ్ళాలన్న కోరిక అధికం కాసాగింది నాలో క్షణక్షణానికీ బలంగా. ఆ పెరడు మైళ్ళ కొద్ది పొడవు పెరుగుతున్నట్లుగా అనిపించింది. ఆ గడ్డి పొదలలోకి ప్రవేశించడానికి నన్నేదో శక్తి బలంగా ప్రేరేపిస్తున్నట్లుగా అనిపించ సాగింది.

నా బట్టలు చింపేసుకుని, నేలమీదికి వాలి, కాళ్ళ

చేతుల మీద పాకుతూ, గట్టిగా మొరుగుతూ అందులోకి వెళ్ళాలన్న కోరిక క్రమక్రమంగా నరనరానికి పాక సాగింది నాలో.

వెంటనే వెనక్కి తిరిగి బలంగా పరిగెత్తసాగాను. రోడ్డు ఎక్కి సరాసరి నా గదిలోకి వెళ్ళి లోపల గడియ పెట్టుకున్నాక గాని ఆ భయం తగ్గలేదు నాలో.

మళ్ళీ అక్కడకు వెళ్ళలేదు నేను ఎన్నడూ.

ఇకముందు కూడా ఎప్పుడూ వెళ్ళను.

కాని ఆ శక్తి నన్ను రమ్మని పిలుస్తున్నట్లే అని పిస్తోంది ఇంకా.

(ఒక ఆంగ్లకథ ఆధారంగా) ■

ఏడుపు ?

గోపి :- మా నాన్న చచ్చిపోయినా, యిప్పటికీ ఆయన పేరు చెబితే వూళ్ళో వాళ్ళంతా ఘొల్లున ఏడుస్తారు !

రాజు :- అబ్బ ! ఎంత మంచి మనిషి !!

గోపి :- కాదు, వూళ్ళో అందరి దగ్గరా 'అప్పులు' చేసి సడన్‌గా పోయాడు !

- సి. హెచ్. రమేష్, హైద్రాబాదు.

ఇరవై ఏళ్ళు దాటిన మగవాళ్ళందరికీ సాధారణంగా ఉండే బలహీనతే నాకూ ఉంది. అందమైన అమ్మాయి కళ్ళబడితే ఆగిపోవడం!

పార్కులో చూశానామెను.

పసుపుపచ్చరంగు చీర కట్టింది. అదేరంగు జాకెట్ వేసుకుంది. ఆ రంగు ఆమె శరీరంలో ఎంతలా కలిసి పోయిందంటే అసలామె జాకెట్ వేసుకుందా అన్న భ్రమ కలుగుతుంది. ఆమె చేతికి ఉన్న వాచీకి కూడా బంగారు రంగు స్ట్రాప్ ఉంది. మొదట నేను స్ట్రాప్

లేకుండా వాచీ ఆమెచేతికి అతుక్కుని ఉన్నదని భ్రమ పడ్డాను.

ఆమె అందానికి ప్రత్యేకత ఆమె ముఖంలో చిరునవ్వు. ఆవిషయం ఆమెకు తెలుసునో తెలియదో కానీ ఆమె ముఖానికి చిరునవ్వు శాశ్వత అలంకారంలా కనపడుతోంది.

ఆమె పార్కుకు ఒంటరిగా వచ్చింది. నేనూ ఒంటరిగానే వచ్చాను. మాఇద్దరికీ దూరం ఎక్కువగానే ఉంది. కానీ నాకళ్ళు బైనాక్యులర్స్‌లా పనిచేసి ఆమెనాకు చాలా దగ్గరలో ఉన్న అనుభూతిని కలిగిస్తున్నాయి.

నేను ఆమెవైపే చూస్తున్నాను. కానీ ఆమె నా వైపు చూడడంలేదు. చాలాసేపు దూరాకాశాన్ని తిలకించింది. తర్వాత దగ్గర్లో చెట్లను చూసింది. అప్పుడప్పుడు వచ్చే పోయే మనుషుల్ని చూసింది. ఎటు చూసినా ఆమె ముఖంలో చెరగనిదల్లా చిరునవ్వు ఒక్కటే!

ఆమెచూపులు నాపై ప్రసరించి ఆచిరునవ్వు అలాగే నిలబడితే!

ఆసమయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాను చాలా సేపట్నించి.

ఆఖరుకు ఆసమయం వచ్చింది-అటూ యిటూ యథాలాపంగా చూసి అనుకోకుండా ఆమె నావైపు చూసింది. మాఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. ఆమె చూపులు వెంటనే మరల్చుకోకపోవడం నా అదృష్టం! ఆమె ముఖం మీది చిరునవ్వు ఇంకా అలాగే ఉండడం ఇంకా చాలా అదృష్టం!

అందమైన ఆ చిరునవ్వు నన్నుచూసి చెరిగిపోలేదు.

నా జన్మ చరితార్థమైన దనిపించింది. ఈ జన్మకీ అదృష్టం చాలుననిపించింది.

నేను గొప్పవాళ్ళబ్బాయిని. డబ్బు ఇబ్బందులు తెలియనివాణ్ణి. అందంగా ఉంటానని అందరూ అంటుంటారు. అద్దంలో చూసుకున్నప్పుడు నాకూ అనిపిస్తుంది నా ముఖంలో పసితనపు ఛాయలు పోలేదనీ. అమాయకంగా ఉంటానని అమ్మ అంటుంది. అన్ని విధాలా అదృష్టవంతుణ్ణి నేను.

ఆమె మళ్ళీ నానుంచి చూపులు మరల్చుకుంది.

అప్పుడనిపించింది. ఆమె ఎవరో ?

వెళ్ళి అడిగితే.... ? బాగుండదేమోననిపించింది.

నేను తటాపటాయిస్తూండగానే ఆమెలేచి నిలబడింది.

ఆమె పార్కులోంచి వెళ్ళిపోతుందనీ ఆతర్వాత మళ్ళీ ఆమె కనబడదనీ అసలామె ఎవరో తెలుసుకునే అవకాశం ఉండదనీ మనసు తొందరపెట్టింది. అయితే లేచి నిలబడడానికి కాళ్ళు సహకరించలేదు.

ఆమె ముందుకు కదులుతూ ఒక్కసారి వెనక్కి తిరిగి నన్ను చూసింది. ఆమె చూపులు సూటిగా నన్నే తాకాయి. కళ్ళలో అదే చిరునవ్వువుంది.

నేను చటుక్కున లేచి నిలబడ్డాను. రెండడుగల్లో ఆమెను సమీపించి-'ఏమండీ' ! అన్నాను.

ఆమె ఆగింది.. చెరగని చిరునవ్వుతో నన్నుచూసి-'నన్ను పిలిచిరా ?' అంది.

'అవును'

'ఎందుకు' ?-ఆమె చిరునవ్వు నవ్వుగా మారుతోంది.

'మీతో పరిచయం చేసుకోవాలనిపిస్తోంది-'

'ఎందుకు?' -ఇప్పుడామె నవ్వుతోంది.

'తెలియదు....' అంటూ నా వివరాలు చెప్పాను.

'మీకు కారుంది. నాకులేదు. మీకు డబ్బుంది. నాకు లేదు, అంతస్థుల్లో మనకు చాలా తేడాఉంది. స్నేహానికి సమఉజ్జీ ఉండాలి-' అందామె.

'కారు, డబ్బు, అంతస్థులు-ఇవి స్నేహానికి సంబంధించినవి కావు. మంచి హృదయం ఒక్కటే స్నేహానికి అవసరం. అది నాకూ ఉంది. నీకూ ఉంది-' అన్నాను.

'ఎలా తెలుసు మీకు?'

'ముఖంచూసి తెలుసుకున్నాను....'

'ముఖంచూసి హృదయాన్ని చదివే విద్య నాకు తెలియదు. అందువల్ల మీగురించి నేనేమీ ఊహించలేదు-' అన్నదామె.

'నేను చెడ్డవాడినయ్యుంటా వచ్చునంటారా?' అన్నాను కాస్త బాధగా.

'అలాగని నేననడంలేదు. నాతో పరిచయాన్ని కోరుతున్నానంటూ మీరు మీ.వివరాలు చెప్పారు. ఎందుకు మీడబ్బు గురించి నేను వినగానే ఎగిరిగంతులేసి నీ పరిచయాన్ని ఆశిస్తాననేగదా! ఈ రమాదేవికి అటువంటి అహంకారం నచ్చదు....' అందామె.

'నన్ను మన్నించండి మిస్ రమాదేవీ! నాకింకా మాట్లాడటం తెలియదు. నాగురించి చెప్పుకుంటున్నానను కున్నాను తప్పితే మీఅహాన్ని దెబ్బతీస్తున్నానని గ్రహించలేదు-'అన్నాను-ఆమె అభిమానానికి అబ్బురపడుతూ.

'ఇంతలో ఇంతలో మన్నించడానికెందుకులెండి-'

అంది రమాదేవి.

'నేను మీ పరిచయాన్ని కోరుతున్నాను గనుక....'

రమాదేవి నవ్వింది. ఎంత అందమైన నవ్వు అది! అనవ్వును విడిచి నేను బ్రతక గలనా? అతిస్వల్ప వ్యవ ధిలో ఆమె ఎంతగా నన్నాకట్టుకుంది?

'సరే పరిచయం అయిందిగా-నాపేరు మీకు తెలిసింది. మీపేరు నాకు తెలిసింది. చాలుగదా-మరినేను వెళ్ళ వచ్చా' అందామె.

'పరిచయమంటే పేర్లొక్కటేనా?' అన్నాను.

ఆమె తమాషాగా నావంకచూసి-' అయితే ఈవేళకి మా ఇంటికి రండి. మావాళ్ళను మీకు పరిచయం చేస్తాను. అతర్వాత అవసరమనుకుంటే నన్ను మీఇంటికి తీసుకు వెళ్ళి మీవాళ్ళకు పరిచయం చేయండి-' అంది.

ఆమె మాటల్లో అంత విసురు ఎందుకుంటుందో, తెలి యదు. బహుశా ఆమె చిరునవ్వుకు సమ్మోహితులై విశ్చేష్టులు కాకుండా ఉండడం కోసం భగవంతుడామె వాక్కులో కరుకుతనాన్ని ప్రవేశపెట్టిఉంటాడనుకున్నాను.

నేనామెను కారు దగ్గరకు తీసుకు వెళ్ళాను. తను బ్యాక్ సీట్లోనే కూర్చుంది.

ఆమె దారి చెబుతూంటే నేను కారు నడిపించాను. ఆఖ రికి కారు ఓ ఇరుకు సందు ముందు ఆగింది.

'చూశారా? వైభవానికీ నాకూ ఎంతదూరమో! కార్లో వచ్చినా ఇంటిముందు దిగడానికి వీల్లేకుండా నా ఇల్లు ఇరుకుసందులో పెట్టాడు భగవంతుడు-' అందామె.

నేనామె మాటలు పట్టించుకోకుండా ఆమె చిరునవ్వునే చూస్తున్నాను.

కారు సందు ముందు ఆపి ఇద్దరమూ ఆ ఇరుకు సందులో ప్రవేశించాం.

ఇల్లు ఆ ఇరుకు సందులో లేదు. నాలుగైదు చిన్న చిన్న సందులు తిరగాల్సి వచ్చింది. ఆమె వంక చూసి-"మీరు మళ్ళీ కారుదాకావచ్చి సాగనంపితేతప్ప నేను మళ్ళీ ఈ దారి తెలుసుకోలేను-" అన్నాను.

"విశాలమైన బాటల్లో విహరించే మీకు ఈ ఇరుకు సందులు గుర్తుంచుకోవడం చాలా కష్టం!" అందామె.

'మళ్ళీ విసురు'.... అనుకున్నాను.

ఆమె ఇల్లు చాలా దయనీయస్థితిలో ఉంది. ఏ క్షణంలోనైనా కూలవచ్చునన్నట్లుగా ఉన్నదాయిల్లు. ఇంట్లో ఒక ముసలామె ఉంది. ఆమె అదేపనిగా దగ్గుతోంది.

"మా ఇల్లు చూసి మేము మరీ బిచ్చగాళ్ళమని అనుకోకండి. ఇది మా స్వంత ఇల్లు. ఇక్కడే ఉండాలని మా అమ్మ పట్టుదల. మాకు కొద్దిగా భూములున్నాయి. వాటిమీద తిండికి లోటు లేకుండా గడిచిపోతుంది అయినకాడికి అమ్మేసి ఇక్కణ్ణించి వెళ్ళిపోదామని నేనంటాను. అమ్మ ఒప్పుకోదు. తన ప్రాణాలు ఇక్కడే పోవాలంటుంది.... అందామె.

నేను రమాదేవి వంక మరోసారి చూశాను. ఆమె కట్టిన చీర పెట్టిన వాచీ, ముఖంలోని కళ-చెరగని చిరునవ్వు-ఇవేవీకూడా ఆ ఇంటికి చెందిన మనిషిగా ఆమెను నిరూపించడం లేదు

"మీరు చదువుకున్నారా, ...?" అన్నాను

"ఉద్యోగం చేస్తున్నాను-" అందామె.



రమాదేవి తల్లి చూడ్డానికి చాలా అసహ్యంగా ఉంది. అటువంటి తల్లికి పుట్టిన బిడ్డ అని తెలిస్తే రమాదేవి అంటేకూడా అసహ్యం కలుగుతుంది

"నేను చూడ్డానికి డాబుగా కనపడుతున్నాను గదా అని తల్లిని నిర్లక్ష్యం చేస్తున్నానని అనుకోకండి. నేను చాలా పేరున్న కంపెనీలో పనిచేస్తున్నాను నేను కట్టుకోవలసిన బట్టలన్నీ వారే కొంటారు. జీతం ఎంతో ఇవ్వరు. ఆ జీతం డబ్బులు, పొలం మీద వచ్చే తిండి గింజలు కలిపి మాకు రోజులు వెళ్ళిపోతున్నాయి మా అమ్మకు వైద్యం చేయించడానికి రమారమి మూడు వేలు అవుతుంది. ఆ డబ్బు కూడబెట్టలేక నేను జాప్యం చేస్తూంటే జబ్బు ముదిరిపోతోంది_? అంది రమాదేవి.

మూడువేలకోసం జబ్బు ముదరబెట్టుకొంటున్నారంటే నాకుకలిగిన జాలి ఇంతా అంతా కాదు. ఒకోసారి నేను

మూడువేల రూపాయలను ఓ గంటలో ఖర్చు చేస్తుంటాను.

"మీరు మరోలా అనుకోనంటే మీ అమ్మగారి జబ్బుకు నేను సాయపడగలను... "

'జబ్బుకు సాయపడడమంటే?' అని నవ్విందామె.

అబ్బ - ఏమినవ్వు అది! శ్రీకృష్ణుడు ఇటువంటి నవ్వుతోనే ద్వాపర యుగంలో అందర్నీ తన వశం చేసుకున్నాడేమోననిపించింది.

"జబ్బుకుకాదు. వైద్యానికి!" అంటూ నాతప్పు నేను దిద్దుకున్నాను. ఆమె ముఖం గంభీరంగా అయిపో యింది_" 'మీరెప్పుడైనా పేదవారిని చూశారా?' అనడిగింది,

"చూశాను_"

"వాళ్ళ కష్టాలను గమనించారా?"

'గమనించాను....'

'వారికి సాయపడ్డారా?'

'సాయపడ్డాను....'

రమాదేవి ముఖంలో రవంత కోపం తొంగిచూసింది_

'పేదవాళ్ళకు సాయపడడమంటే అణా, బేడా ధర్మం చేయడం కాదు. అనాథశరణాలయాలో అయిదూ, పదీ చందాలివ్వడం కాదు. మా అమ్మకులా జబ్బులో ఉన్న వాళ్ళకు వేలకొద్దీ రూపాయలిచ్చి ఆదుకున్నారా?"

"లేదు. ఇదే ప్రథమం....!"

'అంటే ..మీ హృదయం మా అమ్మను చూసి కదల్లేదు ఆది నన్నుచూసి చలించింది. అవునా?

ఈ రమాదేవి చాలా వింత మనిషి అనిపించింది.

ఏదో విధంగా డబ్బు కలసివస్తే అందుకోక ఈ ఆంక్ష లేమిటి-ఈ ప్రశ్నలేమిటి! అభిమానానికైనా హద్దుండాలి కదా!

'మీరెలా అనుకున్నాసరే-ముందు మీ అమ్మగారికి వైద్యం జరిగే ఏర్పాటు చేద్దాం..." అన్నాను.

'చూడండి. నా కారణంగానే మీరిక్కడకు వచ్చారు. కానీ నా మీద ఆశతో మా అమ్మ వైద్యం చేయించ కూడదు. మీరు మా అమ్మను గురించి ఖర్చుపెట్టే డబ్బు గురించి ప్రతిఫలం నాద్వారా ఆశించకూడదు...."

ఈ పర్యాయం కోపగించుకోవడం నావంతయింది-

'మిస్ రమాదేవీ! బలహీనతలు చాలా మందికి ఉంటాయి. అది మానవసహజం. బలహీనత దుర్మార్గ నికి ప్రోత్సహించకుండా ఆపడానికి మనిషి ప్రయ త్నించాలి. ఏవో బలహీనతతోనే నేనిక్కడికి వచ్చా ననుకోండి. ఏవో ఆశలు నాలో ఉన్నాయనుకోండి. అవన్నీ సమాజం నిర్ణయించే విధులకు కట్టుబడేనాలో ఉంటాయి. ఆ విధంగానే నాచే ప్రకటించబడతాయి. మీ అభిమానాన్ని కాపాడుకోవడం కోసం నా అభిమా నాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు మీరు..." అన్నాను.

'మీరు ఏమనుకున్నాసరే-మనదేశంలో ఆడదానికి, అందులోనూ అందంగా ఉన్నదానికి, అందులోనూ మంచి వయసులో ఉన్నదానికి అతి జాగ్రత్త అవసరం. ఇది పురుష ప్రపంచం. కాబట్టి చిన్నమనవి. నేను మీ సచ్ఛీలాన్ని శంకించడంలేదు. అలాగే మీరూ నన్ను అపార్థం చేసుకోకూడదు. ఈ క్షణంనుంచీ మా

అమ్మ వైద్యం బాధ్యత మీది. ఆమె వైద్యం సక్రమంగా ముగిసే వరకూ నేను మీ కళ్ళ పడను..." అంది రమాదేవి.

'మీకెలా ఇష్టమైతే అలాగే!" అన్నాను నేను.

రమాదేవి వెళ్ళి తన తల్లితో కాసేపు ఏదో మాట్లాడింది. తర్వాత నాతో-'ఈ ఇరుకు సందులు మీకు గుర్తుండవేమో-నేను మళ్ళీ మీకు కనబడను కాబట్టి ఏమైనా కొండ గుర్తులు పెట్టుకోండి-అ'నిచెప్పి-కారుదాకా తీసుకు వెళ్ళింది.

2

మనిషి మనసుకు రకరకాల దారులుంటాయి. ఆ దారుల్లో ఒకటి నన్ను రమాదేవిని అనుమానించేలా చేసింది: ఆమె నన్ను మోసగిస్తున్నదన్న అనుమానం నాకు బాగా కలిగింది.

అయితే రమాదేవి తల్లిని హాస్పిటల్లో జేర్పించాక ఆమె జబ్బు సంగతి నిజమేనని రూఢీఅయింది. మూడు నెలల్లో ఆమె మామూలు మనిషి అయింది.

ఈ మూడునెలలూ రమాదేవి నాకు కనబడలేదు ఆమె కన్నా, ఆమె అందమైన చిరునవ్వుపై నే కు మోజు. ఒక రోజున ఉండబట్టలేక రమాదేవి ఉనికి సంగతి ఆమె తల్లిని అడిగేశాను.

"రమాదేవిని గురించినన్నేమి అడుగొద్దుబాబూ! నువ్వు దేవుడిలాంటి వాడివి. నీకు చేతులెత్తి మొక్కుతాను ..." అందామె ఆమెతో ఎక్కువ మాట్లాడలేదు.

ఆమెవి ఎత్తు ళ్ళు అవి కూడా కొద్దిగా గారపట్టాయి.

ఆమె రమాదేవి తల్లి అనీ– చిన్నతనంలోనైనా అమ్మె రమాదేవి బుగ్గలపై ముద్దులాడి ఉంటుందనీ అనిపించి నపుడల్లా నాకు వళ్ళు కంపరమెక్కినట్లుంటుంది. అంచేత ఆమెతో ఎక్కువ మాట్లాడను.

రమాదేవి తన ఇంట్లో ఉండడంలేదు. తల్లినిచూడ్డానికి రావడంలేదు. ఆపార్కుకి కూడా వెళ్ళిచూశాను. అక్కడా కనబడ్డంలేదు. ఆమెను ఎక్కడ ఎలా కలుసుకోవాలో తెలియడంలేదు. ఆమె ఆచూకీ తెలుసుకోవడానికి కనీసం ఒక ఫోటో అన్నా లేదునాకు.

ఒకరోజున బజార్లో తిరుగుతుండగా పేవ్‌మెంట్ మీద రమాదేవి కనబడింది. అదే పచ్చరంగు చీర, రవిక. చటుక్కున పరుగెట్టాను. ఆమెను సమీపిస్తూనే "హలో రమాదేవీ– ఎలాగున్నారూ?" అన్నాను.

ఆమె వెనక్కి తిరిగింది. ఉలిక్కిపడ్డాను. ఆమె రమాదేవికాదు.

"సారీ! రమాదేవి అని మా స్నేహితురాలుంది. వెనక నుంచి చూసి పొరబడ్డాను"– అన్నాను.

ఆమెను రమాదేవి అని ఎలా అనుకున్నానో తెలియదు బట్టలైతే అవేకానీ ఈమెకు ఆమె ఛాయలేదు. రమాదేవికి అయితే జాకెట్ శరీరఛాయలో కలిసిపోయింది. ఈమెకు అలాకాదు.

'నా పేరు రమాదేవి'– అందామె

నేనింకా ఆశ్చర్యపడ్డాను. ఆమెకు మరీ మరీ క్షమార్పణలు చెప్పుకున్నాను కానీ అనవసరం. ఆమెకసలు నాపై కోపమేలాలేదు.

రమాదేవి ఆజాకెట్ వేసుకున్నప్పుడు వెనకాల ఒక

చిన్న నల్లనిమచ్చ ఉంది. బహుశా చాకలిగుర్తు రంగు పొరపాటున గుడ్డపైన పడిఉండవచ్చు. ఇప్పుడు కూడా ఆ మచ్చఉంది. ఈమె తనపేరు రమాదేవి అంటోంది. కొంపదీసి ఆరమాదేవీ, ఈ రమాదేవీ ఒకే ఇంట్లోఉండడం లేదుగదా:

ఒకరోజల్లా ఈ కొత్త రమాదేవిని గురించి ఆచూకీ తీసి నిరుత్సాహపడ్డాను. ఈమె తలిదండ్రులకు ఒక్కతే కూతురు. జాకెట్ మీది ఆ మచ్చ శాకతాళీయమై ఉంటుంది.

. నాచెల్లెల్ని రంగంలోకి దించి కొత్త రమాదేవితో పరిచయం చేసుకోమన్నాను. నేనడిగిన చాలా ప్రశ్నలకు సమాధానాలు వచ్చాయి.

రమాదేవి స్నేహితురాళ్ళ అల్బం తీసుకు వచ్చింది చెల్లెలు. అందులో నాకుతెలిసిన రమాదేవి ఎక్కడా లేదు. ఈ రమాదేవి తన బట్టలను ఎప్పుడూ ఎవ్వరికీ ఎరువిచ్చి ఉండలేదు. అసలు రమాదేవిని గురించి కొట్టుకుచస్తూంటే ఈ బట్టల విషయం ఓ కొత్తమిస్టరీలా తోచింది నాకు.

రమాదేవిగురించి నేనింకా ప్రయత్నిస్తూండగానే ఒక రోజు ఇంకోచిత్రం జరిగింది. నా స్నేహితుడొకడు ప్రైవేట్ నర్సింగ్‌హోం నుంచి వస్తూకనబడ్డాడు.

'జబ్బు ఎవరికి?' అన్నాను ఆశ్చర్యంగా.

వాడు కాస్త కంగారుగా– 'ఎవరో తెలిసినవాళ్ళకు–లే' అన్నాడు. వాడు కాస్త తడబడినట్లు కూడా అనిపించింది. నేనింకేమడిగినా వాడు మాట తప్పించటానికి ప్రయత్నించాడు.

నాకేదో అనుమానం వచ్చింది. వాడింత రహస్యంగా

అక్కడ ఎవర్ని కలుసుకుంటున్నాడో తెలుసుకోవాలని పించింది. వాడు వెళ్ళిపోయాక నేను మళ్ళీ ఆ ప్రైవేట్ నర్సింగ్‌హోంకు వెళ్ళి నా స్నేహితుడి పేరు చెప్పి అతడి తాలూకు మనిషిని చూడాలనుకుంటున్నట్లు చెప్పాను.

వాడి బంధువు దర్శనమయింది. ఆ మనిషి చాలా అనింప్రెసెవ్‌గా ఉన్నాడు. చూడగానే బాగా క్రింద తరగతి మనిషి అని తెలిసిపోతుంది. ఇటువంటివాడితో మా వాడికి పరిచయమెలాగయిందో అనుకొంటూనే ఆ రోగిని కొన్ని ప్రశ్నలు వేశాను.

నాకూ నా స్నేహితుడికీ ఉన్న అనుబంధం గురించి వింటూనే ఆ రోగి లేచికూర్చొని నాకు నమస్కారం చేశాడు. తను చాలా పేదవాడిననీ నా స్నేహితుడి దయ వల్ల తనకు వైద్యసహాయం లభించి ఇప్పుడు బాగా కోలుకుంటున్నాననీ అన్నాడు.

'నీకు నా స్నేహితుడి పరిచయ మెలాగయింది?'

'మా అన్నగారితురు ఉమాదేవికీ తెలుసునట. ధర్మ ప్రభువులు. వెంటనే నన్నిక్కడ చేర్పించారు -" అన్నాడారోగి.

నేను రోగి అడ్రస్ కనుక్కున్నాను. ఉమాదేవి వివరాలడిగితే మాత్రం ఆవేవీ తన నడగవద్దన్నాడతను.

నా బుర్ర చాలా చురుగ్గా పనిచేస్తోంది. రమాదేవి, ఉమాదేవి ఒక్కతేనని నాకు తోస్తోంది. ఆమెలో ఏదో పెద్ద మోసముంది.

ప్రయివేట్ నర్సింగ్‌హోంలో సుఖభోగాలనుభవిస్తున్న ఉమాదేవి బాబాయిని చూస్తూంటే నా వళ్ళు మండిపోయింది. ఈ జన్మలో వీడికిలాంటి భోగాలనుభ

వించే యోగం ఉందా ? ఉమాదేవి నా స్నేహితుణ్ని చవటను చేసింది. రమాదేవి నన్ను చవటను చేసింది.

నేను ఆ రాత్రికే నా సేహితుణ్ణి కలుసుకుని ఉమాదేవి గురించి అడిగాను. వాడు ముందు తినకేమీ తెలియదని బుకాయించాడు కానీ తర్వాత నా కథ విని విషయము చెప్పాడు. వాడు చెప్పింది వింటూనే వాడు నాకులాగే బోల్తాపడ్డాడనిపించింది.

ఇద్దరమూ కాసేపు ఆవేశపడ్డాం. నా స్నేహితుడైతే ఉమాదేవిని బూతులు తిట్టాడు. వాడు ఆమెపైన చాలా ఆశలు పెట్టుకున్నాడుట.

"పెళ్ళి చేసుకుందామనుకున్నావా ?'' అన్నాను.

'ఛా-ఇలాంటి వాళ్ళను పెళ్ళెవడు చేసుకుంటాడ్రా - ఏదైనా ఒకటి రెండు ఛాన్సులు దొరక్కపోతాయా అని ఆశపడ్డాను-" అన్నాడువాడు.

'అయితే నేను తిన్నదెబ్బ ఇంకా పెద్దది. నేనైతే ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను...."అన్నాను.

"నీలాంటి అమాయకుల్నీ, నా లాంటి తెలివైన వాళ్ళను కూడా మోసం చేసింది''- అంటూ నిట్టూర్చాడు నా స్నేహితుడు. ఇద్దరమూ కలసి ఆమెనెలాగో అలా పట్టుకోవాలని అనుకున్నాం.

3

పార్కులోకి వెడుతున్న నా చెల్లెల్ని చూసి ఆశ్చర్యపోయాను. అదెప్పుడూ ఒంటరిగా పార్కులకు వెళ్ళదు. ఏదో విషయముండే ఉండాలి-అనుకుంటూ నేను పార్కులో ప్రవేశించాను.



చెల్లెలు తిన్నగా వెళ్ళి క్రోటన్స్ మొక్కల గుబురు వద్ద కూర్చుంది. దాన్ని కలుసుకుందుకు ఎవరైనా స్నేహితులు వస్తారేమోనని చూసిచూసి ఓ పావుగంటయ్యాక నేను దాన్ని సమీపించి ఎదురుగా నిలిచి ఏదో అనబోయి ఆగిపోయాను. ఆమె నా చెల్లెలు కాదు. అయితే నే నెంతో కాలంగా ఎదురు చూస్తున్న రమాదేవి ఆమె!

"మీరా?" అన్నాను అప్రయత్నంగా. ఆమె ముఖంలోని చిరునవ్వు నన్ను సమ్మోహితుణ్ణి చేస్తోంది. ఆమెపై నాకు గల కోపభావం అంతా పోతోంది.

ఆమె అట్టే చలించకుండా_'ఎవరనుకున్నారు? అంది.

మీరు కట్టిన బట్టలు చూసి వెనుకనుంచి మా చెల్లెలని అనుకున్నాను. మా చెల్లికి అచ్చం ఇలాంటి చీరే ఉంది. అది నేనే స్వయంగా బొంబాయిలో కొన్నాను. అందుకని బాగా గుర్తుండిపోయింది. దాని స్నేహితురాండ్రు చాలామంది ఆ చీర చూసి అసూయపడి వివరాలడిగేరు.

కానీ మళ్ళీ అలాంటిది దొరకలేదు. మీకు దొరకడం ఆశ్చర్యమే అన్నాను.

'బహుశా ఇది మీ చెల్లెలి చీరే అయుండవచ్చు.ఎందుకంటే ఇది నా స్వంతం కాదు. ఒక లాండ్రీ దుకాణం నుంచి అద్దెకు తీసుకున్నాను...." అంది రమాదేవి.

ఉలిక్కి పడ్డాను. హఠాత్తుగా నా మైకం విడి పోయింది. ఆమె మోసగత్తె అని గుర్తుకు వచ్చింది. జరిగినదంతా ఆమెకు ఏకరువు పెట్టాను. ఆమెను నానా మాటలూ అని దులిపేశాను. అడ్డెబట్టలు వేసుకుని షోకు చేసే ఆడది అభిమానం గురించి మాట్లాడ్డం సిగ్గులేని తనమని చెప్పాను.

రమాదేవి అన్నీ వింది. నేను మాట్లాడుతున్నంత సేపూ ఆమె మౌనాన్ని వహించింది. ఆమె పెదవుల చిరునవ్వు చెక్కు చెదరలేదు. నేను మాట్లాడ్డం ముగిపేక 'మీరు చెప్పధం అయింది. నేను చెప్పేది వింటారా ?' అంది.

ఆమె అంత తాపీగా అడిగేసరికి నాకు ఏం మాట్లాడాలో తోచలేదు. మౌనంగా తలూపాను.

'నా కెవ్వరూ లేరు. నేనొక అనాథను. వారి, వీరి ఆశ్రయంపై బ్రతుకుతూ ఇంటర్ పూర్తి చేశాను. నాకు వయసు వచ్చేసరికి నా అందం నాకు శత్రువయేలా అనిపించింది. అదృష్టవశాత్తూ ఓ కరుణామయుడి ద్వారా చిన్న ఉద్యోగం దొరికింది. అప్పట్నుంచీ స్వతంత్ర జీవనం ఆరంభించాను.

ఎవరూ లేని నాకు మగవాడి ఆలంబన వివాహ రూపేణా లభించడం కష్టమని తెలుసు. నా అందం నాకు

శత్రువు కాకుండా వీలైనంత అసహ్యంగా తయారై బయట తిరుగుతుంటాను. అందుకే మీరు నన్ను పలు మార్లు చూసి కూడా గుర్తు పట్టలేదు. తళుకు బెళుకుల మనిషిని తప్ప చూడని మీరు నన్ను నా అసలు వేషంలో గుర్తించనేలేదు.

ఎప్పుడో ఒక పర్యాయం నీటుగా ముస్తాబై పార్కుకు వెళ్ళాను. నన్ను చూసి చాలామంది మగవాళ్ళు ఆక ర్షించబడతారని గుర్తించాను. నాకోసం ఏమైనా చెయ్యా డానికి సిద్ధపడేవాళ్ళు చాలామంది ఉన్నారని గ్రహించాను. అలాంటప్పుడు నన్ను సాకుగా ఉంచి కొంతమంది ధని కుల చేత పేదవారికి ఆర్థిక సహాయం చేయించాలని పించింది.

అందుకే అప్పుడప్పుడు అద్దెబట్టలు వేసుకొని పార్కుల్లో కూర్చుని ఎవరైనా నా వెంట బడితే వారి ద్వారా నాకు తెలిసిన కొందరు అభాగ్యులకు సాయపడు తున్నాను. దీన్ని మీరు మోసం అంటే అనవచ్చు. కానీ ఈ రకం జీవితం నాకెంతో తృప్తినిస్తోంది. నిజాని కిందులో నేను చేస్తున్న మోసం ఏమీ లేదు. ఎదుటి మనిషిలోని దుర్బుద్ధి అతడి కటువంటి భావాన్ని కలుగ జేస్తోంది.

ఇదీ నా కథ. నేను డ్రస్సు ఎరువు తీసుకున్నప్పుడు దాని స్వంతదారు పేరు తెలుసుకుని ఆ రోజుకు ఆ పేరే ఉంచుకుంటాను. ఈ రోజు నా పేరు కళ్యాణి. అది మీ చెల్లెలి పేరేమో నాకు తెలియదు....'

కళ్యాణి నా చెల్లెలి పేరే !

"మరి మీ అసలు పేరు ?"

'శశిరేఖ !' అందామె. ఆమె పెదవులపై మందహాసం తాత్కాలికంగా మాయమైంది. ఆమె కన్నుల్లోకి విషాదం కొద్ది కొద్దిగా చేరుతోంది.

'మిస్ శశిరేఖా !' మీది ఉదాత్త హృదయం. మీ చిరునవ్వులో అసమ్మోహనశక్తి ఎక్కడనించి వచ్చిందో ఇప్పుడర్థమైంది. జీసస్, బుద్ధుడు, గాంధీ-తమతోటి మానవులపైన అసమాన ప్రేమ భావం కలిగి ఉండేవారు. అందువల్లనే వారి చిరునవ్వుకు పరమ కిరాతకులు కూడా ప్రభావితులై పోయేవారు. మీ ప్రేమ భావాన్ని నేను మొదట్లో అర్థం చేసుకోలేకపోయాను. పరిచయానికి అంతస్థులగురించి మీరు మొదట్లో ప్రస్తావించారు. నిజం గానే మన ఇరువురకీ ఈ విషయంలో అంత స్థుల తేడా ఉంది. నేను మీస్థాయిక ఎప్పుడు చేరుకో గలనో తెలియదుకానీ మీపెదవుల పైని ఆ చిరునవ్వు నిలబెట్టడం కోసం మీరేం కోరితే అది చేస్తాను. దయతో రోజుకొక్కసారైనా ఆ చిరునవ్వు చూసే భాగ్యం నాకు కలిగించండి-' అన్నాను.

శశిరేఖ నావంక ఆశ్చర్యంగా చూస్తోంది. ఆశ్చర్యం మాయమై ఆమె పెదవులపై చిరునవ్వు ఎప్పుడు వెలు స్తుందా అని ఆత్రతగా ఎదురు చూస్తున్నాను నేను. ०

చౌరస్తాలో నిల్చున్న జగన్‌గాడికి దూరంనుండి వస్తున్న ఎడ్డి యెంకటస్వామి కనిపించాడు.

ఎడ్డి యెంకటస్వామంటే మూగవాడనుకునేరు. అదేమీ కాదు. హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామిని జగన్

గాడిలాంటి కేడీలు పిలిచే ముద్దుపేరు. కాని నిజంగానే వాడిలో ఓ పిసరంత మూగతనమున్న మాట మాత్రం నిజం. అదీ కొన్ని సమయాల్లో మాత్రమే.

ఓ అమాయకుని దోషిగా ఠాణాలోకి తీసుకొచ్చిన తరుణంలో అమాంతం మూగతనం ఆవరించి అతడి గుండెను ఓ క్షణం నొక్కేసేది.

కాని తరువాత మామూలుగా మారిపోయి 'పాపం! ఉత్తి పుణ్యానికి పోరగాన్ని లోపల పడేస్తిమి.' అని పరితపించిపోయేవాడు.

ఇప్పుడా యెంకటస్వామి తనవేపే రావడం గమనించిన జగ్గూ (జగన్) గాడు మాత్రం పారిపోయేందుకు ప్రయత్నించ లేదు, సరికదా, "ఏంరా ఘామా: గిటొచ్చినవ్" అని రిసీవ్ చేసుకున్నాడు.

అతడిలోని పోలీసు పైకొచ్చి, "ఈ సత్రాల్ ఏం నడవవ్. ముందు టేషన్‌కు నడువ్" హుకుం జారీ చేశాడు ఇదే మరోమారయితె "ఏంరా అల్లుడా, బాగున్నావా" అని అడిగే హెడ్ వెంకటస్వామి.

"ఏంది నేను రావాలా? పోయిన నెలల్నె వొచ్చినగద. ఇప్పుడు రానోపో" కసిరాడు జగ్గూదాదా.

"అరే, ఎసై కొత్తోడొచ్చిండు రా—"

"వొస్తె నాకేంది:"

"కేసుల్దొరకుత లేవేమయిందని మా పాణాలు దీస్తుండు.'

"తీస్తె నాకేందిరా మామా!"

'ఒక్కసారి ఒచ్చిపోరా టేషన్‌కు'

స్టేషన్లో కొడితె జరిగేదేమిటో జగ్గూగాడికి బాగా

తెలుసు.

పులిలాటోడు కూడా టొన్నో కెడితె పిల్లికావాల్షిందే.

'అమ్మ! ఇగొస్తాను. మొన్నొచ్చినపుడే బొక్క లిరగ్గొట్టింగ్రు, ఏదో చిన్నకేసుల ఇరికిస్తంచె వొచ్చినందుకు.'

'చిన్న కేసులేంరా, నీవుచేసిన పెద్ద పెద్ద కథలన్ని మాకు తెలియదను కున్నావా?'

'తెలిస్తేందిరా మామా! మామూల్ ఏమయిన మాను కున్నారా?'

ఖంగుతిన్న హెడ్ కానిస్టేబుల్ అటు ఇటూ చూసి, ఎవరూ వినలేదని తెలుసుకొని 'అమ్మయ్యా!' అంటూ గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు.

'ఇప్పుడట్ల గాదురా' మళ్ళీ బ్రతిమిలాడ్డం మొదలయింది.

'కాదని గ్యారంటీ ఏంది?'

'నా అమ్మతోడురా! ఒక్కసారి రారా, నీ ఒంటిమీద ఏ గాడ్దికొడుకన్న చెయ్యేస్తె నేనున్నగ, సూసుకుంట. నీకేం గానియ్యను.'

'అయితే నడువ్ మల్ల'

జగన్ గాడొప్పు కున్నందుకు యెంకటస్వామి సంతోషంగా అడుగు ముందుకేసాడు.

'ఆ, ఆ, అంత ఖుశీగా ఉరుకుతున్నవ్. ఆగు. పది రోజులకన్న ఎక్కువ అత్తగారింటికి పంపితె (జైలుకి పంపితె) నీ ప్రాణం దీస్త. ఏదో మామవు గదాని నీ తోటివాస్తున్న.' ఆగిపోయాడు జగన్.

నిజానికి జగ్గూగాడికి యెంకటస్వామి మామ మాత్రం

కాదు. ఒకే ఊరివాళ్ళవడం, వాళ్ళ వృత్తులు మాగ్నెటిక్ సౌత్‌పోల్, నార్త్‌పోల్‌ల వలె కలిసిపోవడం ఈ అనుబంధానికి దారితీసింది. దానికి తోడు జగ్గూగాడు చిన్నకేడీ కూడా కాదు. వాడికా ఊర్లో పెద్ద శిష్యగణమూ, కావలసినంత (దొంగ) పేరు ప్రతిష్ఠలూ ఉన్నాయి.

అసలు జగ్గూగాడికోసం యెంకటస్వామి వొచ్చేవాడే కాదు. అసలీ ఎస్సైలు, సర్కిలుల ట్రాన్ఫర్లప్పుడు యెంకటస్వామిలాంటి వాళ్ళకు ప్రాణాంతకంగా మారిపోతాయి.

వొచ్చిన వారంరోజులకే యస్సైకు జగ్గూగాడి గురించి ఎలాగో తెలిసిపోయింది, పోలీసులు ఎవరూ చెప్పకపోయినా. అందుకే వాన్ని పట్టి తీసుకరమ్మని హెడ్‌ను పంపాడు.

పట్టుకుపోతే జగ్గూగాడితో తన్నులు. లేకపోతే యస్సై తో బూతులు.

'నేను చెప్తున్న గదరా! అదిగూడ పడదు గాని నడువ్–'

'ఊ! నడువ్ వొస్తున్న'

ఇద్దరూ ఓ అడుగు ముందుకేశారు.

'ఏంరా మామా! నీకు మర్యాదతెలవద్రా'

'ఏమయింది?'

'పోయి సిగరెట్లు తీస్కరాపో–'

తీసుకు రాకపోతే వీడు మళ్ళీ రానంటే.........భయంతో యెంకటస్వామి పాన్‌షాప్‌వేపు నడచాడు.

ఇప్పుడు యెంకటస్వామికి తనగత వైభవకీర్తి గుర్తుకు రాసాగింది. తన దుస్థితికి తానే మనసులో తిట్టుకుంటున్నాడు.



హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ దొరకకపోయినా బాగుండేది, దొంగనాగాడ్డి కొడుకులంత "ఏంరా ఎద్ది మామా ! పిల్లనెప్పుడిస్తవ్' అని అడుగుతరు. బాడ్కావ్ గాళకు భయం లేకుండ పొయ్యింది. ఈళ్ళనందరిని అరుసుకుంటుంటిగని ఎప్పుడో పారి ఒక్కన్ని సూసి నా పని పడ్తరు. అయినా భయపడకపోదునుగని నా పెళ్లాం పిల్లలు దిక్కులేనోళ్ళు అయిపోతరని ఊరుకుంట, అనుకున్నాడు మనసులో.

లేకపోతే, ఈ దొంగ సాలేగాడు నా అల్లుడా ?

ఖర్మ గాకపోతె ఇంకేంది? అని బామ్మర్ది లాగ సిగరెట్లు తీస్కపోవాలొచ్చింది.

నా జవాబీల ఏముంటిని :

ఆ రోజుల్లో —

ఛంచోత్ ! యూనిఫారంల లాఠీ పట్కొని ఊర్లో కొస్తె చాలు, ఊరు ఊరంత గజగజలాడేది. ఊరి పొలిమేరలల్ల అడుగుపెడ్తె సాలు కావలోన్ని పిలిచి కల్లు కుండలతోటి కాళ్ల కడుగుతుండ్రి. కోళ్ళ, పోతులు (మేకలు) గోసి జల్సా చేయిస్తుండ్రి. ఇగ మా ఎడ్డుగాడొకడుండే—అన్ని 'జమేదార్ సాబ్' అని పిలుచుక పోయి పటేల్, పట్వారీలు, దేశ్‌ముఖ్‌లు ఆళ్ళ ఇండ్లల్లకు తీసుకపోయి మజా చేయిస్తుండ్రి. అడొస్తుంటె సాలు, పొలిమేర దాక మస్కూరోన్ని పంపి రాజులాగ తోల్కపోతుండ్రి.

ఊర్ల మన మాటకు ఎదురు లేకుండేడిది, పటేల్ పట్వారీలు గూడ తప్పులు జేస్తె ముఖద్దామా నడిపిస్తమని బెదిరిస్తే గజ్జున వానికేటోళ్ళ.

మరిగిప్పుదేమయింది. ప్రమోషనిచ్చి ఊర్ల నుంచి టౌన్లకు ట్రాన్స్‌ఫర్ చేసిండ్రు. ఈడ ప్రజలు తెలివి మీరిపోయిండ్రు. నా ఇజ్జత్ పోయింది. అయినా అదెప్పటి మాట ఇరవై ఏండ్లయిందొచ్చు. నేను కొత్తలో కొలువుల చేరి, యూనిఫారంల ఇంటికొస్తె మా అయ్య మురిసిపోయిండు, ఇగ రాజ్యమంతా నా చేతుల మీదనే నడుస్తదన్నట్లు.

కాని కొడకు చిన్నోడు యూనిఫారంల నన్ను జూస్తె సాలు తిట్టుకుంట దూరం పోతడు. ఏం జేస్తం. జమానా బదలాయించిపోయింది.

జగ్గూకని సిగరెట్లు తన డబ్బుతోటే కొన్న

యెంకటస్వామి తిరిగి "ఈ న్యమ్మ, ఏదేదో గుర్తు కొచ్చి ఆలశమయింది, ఆదెక్కడ పోలేదుగద" అని చూసి, వాడున్నందుకు షంతోషించి, వాడికి సిగరెట్లిచ్చి, వాడు విలాసంగా సిగరెట్లు ఊదుతూ నడుస్తుంటె—"గవర్నరు లాగ నడుస్తుండు" అని మనసులోనే అనుకుండు యెంకటస్వామి.

జగ్గూగాడికి ఎవడి మనసులో ఏముందో తెలవకపోతె ఎవడి జేబులో ఎంతుందో ఎట్ల తెలుస్తుంది? యెంకటస్వామి మొహాన్ని చూసి వాడి భావాల్ని పసిగట్టి "ఏంరా మామా! ఏమో తిట్తున్నవ్ ?" అడిగాడు జగన్.

"ఏం తిట్టలేదు"

"అరె ఎడ్డిమామ! నీకేగన్క బిడ్డుంటె నేనే ఎత్కపోయెటోన్ని-"

"ఈ గూండగాడే అల్లుడు.గావాలి. అసలు బిడ్డలు లేందే మంచిదయింది" మనసులోనే అనుకుని, స్టేషన్ వైపు నడిచ్చాడు జగన్‌గాన్ని తీసుకొని.

వాళ్లు స్టేషన్ చేరుకొనేటప్పటికి యస్సై లేడు.

"ఏంరా మామా! అబద్ధం జెప్పి తోలుకొచ్చినవ్ గద!" అని యెంకటస్వామిగాన్ని కసిరి, ఇతర పోలీసులతో పరిహాసాలాడుకోసాగాడు జగన్. జగన్‌గాన్ని పిల్చుకురమ్మని ఎటో వెళ్ళిపోయిన యస్సైమీద హెడ్డుకి కోపమొచ్చింది.

2

యస్సై వచ్చేసరికి రాత్రి పదిగంటలు దాటింది. అంత వరకూ ఏగొడవా చేయకుండా జగన్ వేరే పోలీసుతో

పులిమేక ఆట ఆడుకుంటూ కూర్చున్నందుకు యెంకట స్వామి సంతోషించాడు.

జగన్ని "ఇగ లోపలకి పోరా ! మా మొగుడొచ్చిండు" అని లాకప్‌రూమ్‌లోకి తోసాడు యెంకటస్వామి.

యస్సై వెళ్ళి తన గదిలో కూర్చున్నంతలోనే యెంకట స్వామి వెళ్ళి అటెన్షన్‌లో సాల్యూట్ కొట్టి, జగన్‌గాడు ఊదిపారేసిన సిగరెటుడబ్బీ గుర్తుకొచ్చి తను జగన్‌గాన్ని పట్టుకురావడానికి పడరాని పాట్లన్ని పడ్డట్లు చెప్పాడు.

వాడెంత మొగాడో చూద్దాం నడవమన్నట్లు, లాకప్ రూమ్‌కేసి నడిచాడు యస్సై.

జగన్‌గాన్ని చూసిన యస్సైకు పిన్నెం లక్ష్యపెట్టాల్సిన పని లేదనిపించింది. నాలుగంటించమని హెడ్‌కు హుకుం జారీ చేశాడు యస్సై.

జగన్ గాడి కళ్ళు ధర్మోగన్‌లా నిప్పులు చిమ్మింది. హెడ్డుకి పైప్రాణాలు పైనేపోయాయి. అయినా తమాయించుకొని, తను, తప్పుకోవాలని "అరే థీనాట్ సిక్స్" అని కేకేసాడు.

"అయా సాబ్ !" అంటూ లోనికో కానిస్టేబుల్ వచ్చాడు.

"ఓ గదెకు మారో !" హెడ్ హుకుం జారీ చేశాడు.

"నేను కొట్టను సార్ ! ఈ ఇలాకాల నేను బతికి ఉండాలంటె అని మీద చెయ్యేయొద్దు. ఇప్పుడాన్ని గొడ్తె రేపొద్దు నా చమ్డాలూడగొడ్తడు" కానిస్టేబుల్ భయంతో పూర్తిగా నిరాకరించాడు.

మరి, జగన్‌గాడంటె మాటలా అ ఏరియాలో జరిగే ప్రతి చిన్నదొంగతనం, పోట్లాటలు వాడికి తెలియాల్సిందే.

అసలు అవన్నీ చేసేవాళ్ళంతా అవి శిష్యులే.

ఏదో కొత్త యస్సైకు చూబెడ్దామని తీసుకొస్తె కొట్ట మంటడేంది? మనసులోనే బెంబేలు పడిపోయాడు యెంకటస్వామి.

"చూస్తవేంరా!" మళ్ళీ గర్జించాడు యస్సై.

" నేను కావాలంటే కొలువిడిసిపెడ్త. బదికుంటె ఎట్ల నన్న బతకొచ్చు" తను కొట్టలేనన్న సంగతి గంట కొట్టి మరీ చెప్పాడా కానిస్టేబుల్.

"ఏం హెడ్డూ!"

"నేను గూడ గొట్టను సార్! ముసలోన్ని, పిల్లలు గలోన్ని, కొన్నాళ్ళు బ్రతకనీయుండ్రి" బ్రతిమాలు కున్నాడు.

"ధూత్ నీ యమ్మ!" మనసులోనే యస్సై పోలీసు లందరినీ తిట్టుకున్నాడు.

"తుమ్ సబ్ చలే జావ్" అన్నాడు.

అందరూ వెళ్ళిపోయాక జగన్ మీద యస్సై చేయి చేసుకుంటాడేమోననుకుని, గోడ చాటు నుండి యెంకట స్వామి గమనించసాగాడు.

యస్సై ఏవో రెండు బండ బూతులు తిట్టి, మొన్న జరిగిన ఓ దొంగతనంలో జగన్‌గాడున్నాడని విట్నెస్ ఉందని, జైల్లో తోయిస్తానని బెదిరించి వెళ్ళాడు.

జగన్‌గాన్ని యస్సై కొట్టనందుకు యెంకటస్వామి బ్రహ్మానందపడిపోయాడు, తని మాట నిలబడినందుకు.

అసలు యస్సై ఈ రాత్రిపూట స్టేషన్ కొచ్చేవాడే కాదు. కాని ఇంట్లో పెళ్ళాం పిల్లలు పుట్టింటి కెళ్ళిపో

నందుకు, ఒంటరిగాడయి నిద్రపట్టక కాలక్షేపం కోసమని ఇలా వచ్చాడు. ఈ లోపున సిగరెట్లు తెచ్చుకుంటానని యెంకటస్వామితో చెప్పి జగన్ బయటకొచ్చాడు, మళ్ళీ వస్తానని నమ్మించి.

3

రాత్రి ఒంటిగంట కావస్తుండగా, ఓ కానిస్టేబుల్ ఎవరో ఇద్దర్ని వెంటబెట్టుకొచ్చాడు. ఓ ఆడ, ఓ మగ.

వాళ్ళు లోపలికి రాగానే పరీక్షగా చూసాడు యస్సై. ఏదో కిరాయ మనిషిలా ఉందీ ఆడది. కాని భలే అందంగా ఉంది. వాడు బ్రోకరా! బ్రోకరే కావచ్చు. లేదా, లేపుకొచ్చినోడు కావచ్చు. కేసులో ఇరికించి అర్నెల్లు లోపలకి తోస్తేసరి, ఆలోచిస్తూ యస్సై ముందు మగాన్ని బయటకు పొమ్మన్నాడు.

అప్పుడు ఆడదాన్తో పాటు హెడ్డూ తనూ మిగిలారు గదిలో.

ఎంతకూ యెంకటస్వామి గది విడిచి బయటకు పోవడం లేదు.

ఆడవాసన తగిలి చాలా రోజులయిందేమో యస్సై మనసు మారిపోయి ఆమె అందాన్ని చెరకును క్రష్ చేస్తున్నంత కసిగా చూస్తున్నాడు. మగువ నిషా అతడి మెదడునిండా నిండిపోయింది.

ఒకే కనుసైగతో హెడ్డును బయటకు పంపడం, యస్సై ఆమెను గట్టిగా అదుముకోవడం క్షణంలో జరిగి పోయింది.

బయట ఆమెవెంట వచ్చిన వ్యక్తి గింజుకుంటున్నాడు.

"ఎందుకట్ల దాన్ని లోపల ఉంచి నన్ను బయటకు **పంపిండ్రు" అని.**

"ఎవతెరా అది -" యెంకటస్వామి గద్దించాడు.

"నా పెళ్ళాం"

"నీ పెళ్ళామా ? ఎప్పటి నుంచిరా నీ పెళ్ళాం. ప్రాస్టిట్యూషన్ కేసు పెట్టి జేల్కానాల పడేస్త."

"అది నిజంగా నా భార్యే -"

"చుప్. దాన్ని ఎంతమందితో సూడలేదు మేం, ఎక్కువ నఖ్రాల్ జేస్తె ముస్సల్ మీద గూకోపెడ్త."

"ఏమంటడురా వాడు" బయటకొచ్చాడు యస్సై.

"ఈన్ని దీస్కపోయి లాకప్‌ల పడేయాల్సార్ !" అని మెల్లగా లోనికి జారుకున్నాడు.

ఒకడి తర్వాత ఒకడే వాళ్ళంతా కలసి అబల మీదికి ఎగబడ్డారు గండుచీమల్లా.

నాలుగోవాడు పైకి రాగానే ఆమె ఓ చావుకేక పెట్టింది.

లాకప్ గదిలో ఉన్న అతడికి ఏదో కేక నూతిలోంచి వినబడినట్లుంది. అది ఆమె చావుకేక అని నిర్ధారణగా తెలిసిపోయింది.

అతడి ఒంట్లోని రక్తం మరిగిపోయింది. అమాంతం ఆ గదిలోంచి బయటకురికొచ్చాడు అతను, పోలీసుల మతిమరుపు వల్ల గొళ్ళెం వేయనందున.

అతడి చేతులు పదును కత్తుల్లా విచ్చుకున్నాయి. అమాంతంగా విరుచుకుపడ్డ అతడి చేతులు పోలీసుల బాహువుల్ని విరిచేయసాగాయి.

అంగబలం ముందు ఓడిపోయిన పోలీసులు, ఒంటరి గాడిమీద విరుచుకుపడ్డారు తమ పోలీసురక్తం గుర్తుకొచ్చి.

ఓ సామాన్య మానవుడు రక్షకభటుల పైన చేయి చేసుకోవడమా ?

ఊహూ ! లా అండ్ ఆర్డర్ ఊరుకోదు. అందునా పోలీసు స్టేషన్లో, తమ స్థావరంలో తామే ఖూనీ అవడమా!

పోలీసు రక్తం పొంగిపొరలింది. వెంటనే లాఠీలు లేచాయి.

పెళపెళా విరుచుకుపడ్డాయా ఒంటరిగాడిపై.

చిమ్మిన ఎర్రటి రక్తంతో లాఠీలు అరుణ కాంతులు అరువు తెచ్చుకున్నాయి.

ఎర్ర టోపీలు గర్వంగా గాలిలో ఎగిరాయి.

ఉన్మాదావస్థలో నిద్రపోయిన అధికారం ఉద్రేకం కట్టలు తెంచ్చుకుంది.

కాని, నిర్జీవంగా కూలిపోయినఆ మానవ కళేబరం వాళ్ళ ఉద్రేకాన్ని కరెంటు పోయిన బల్బులా దించేసింది.

ఇప్పుడు వాళ్ళ గుండెల్లో ఆవేశానికి బదులు ఆత్మ రక్షణ కోసం త్రోవలు వెదుక్కోసాగారు.

అప్పటి వరకూ అచేతనంగా పడి ఉన్న అబల గుండెల్లోచేతనత్వం, మస్తిష్కంలో కర్తవ్యపరాయణత్వం ప్రజ్వరిల్లాయి.

ఇంతవరకూ చీకట్లో ఉండిపోయిన గాథలన్నీ వీధుల్లోకి పరచినట్లు, అరుణోదయ కాంతుల్లోకి రక్త సిక్త గుడ్డల్లో ఉన్న శవాన్ని లాక్కొచ్చింది ఆమె.

తెల్లారే లేచిన జనానికి చీకటి కృత్యాలు దర్శనమిచ్చాయి పోలీసు స్టేషన్ ప్రాంగణంలో.

జనం నివ్వెరపోయారు.

ఆమె రోదనస్వరం మరింత కర్కశంగా కటిక విషాన్ని జనం గుండెల్లోకి ఇంజక్ట్ చేసింది.

కొందరి అకృత్యాలకు బలైన అబలను నేనే అంటూ శవాన్ని తనచీరెమీదనెత్తుటిమరకల్ని చూపిందిజనానికిఆమె.

శవం మీద దెబ్బల గుర్తులు, రక్తపు మరకలు జనం గుండెల్లోకి దూసుకుపోయి తమ గుండెకాయ నెవరో మొండి సూదుల్తో గుచ్చినట్టు ఫీలయ్యారు జనం.

అంతే! ఒకరి వెనుక మరొకరు పదులు, వందలు, వేల సంఖ్యల్లో జనం స్టేషన్ని ముట్టడించారు.

ఆ జనంలో జగన్‌గాడూ కలసిపోయాడు.

ఇదేం దౌర్జన్యం?

చట్టాన్ని ధిక్కరించడం నేరం, అని చట్టాన్ని న్యాయాన్ని మరచిపోయిన అధికారం గర్జించింది.

అయినా జనం భయపడలేదు.

తప్పులు చేసి నీతులు చెప్పే అధికారాన్ని చూసి ఉమ్మేసింది. మరింత ధైర్యంతో జనం ముందుకుసాగారు.

ఇప్పుడాపోలీస్‌స్టేషన్, అబద్ధాలకోట, అకృత్యాలమూట సూర్యుడి ఎరుపెక్కినమంటల్లోతగలబడిపోసాగింది.

కార్బన్ షీటు - గ్లాస్కో పంచె

ఎమ్.వి.వి.సత్యనారాయణ



శంకరానికి పరిస్థితి అసహ్యకరంగా తయారయినట్లు తోచింది.

తన పట్టులోంచి ఈ తగాదా చేజారి పోయేలాగా పరిణమిస్తుందని శంకరం మొదట వూహించలేదు.

వూహించ గలిగి వుంటే రామావతారంతో అనవసరంగా నలుగురితో ఘర్షణ పడేవాడు కాదు.

శంకరం తన తమ్ముడికి వుద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్ నుండి కాల్ లెటర్ రప్పించి పెడతానన్నాడు రామావతారం. ప్రతిఫలంగా రెండు వందల రూపాయలు అడిగాడు రామావతారం. పండగ ఎడ్వాన్స్ పెట్టి మరీ యిచ్చాడు శంకరం.

రామావతారం కాల్‌లెటర్ తెప్పించగలగడం మాట ఎలావున్నా డబ్బు పుచ్చుకొని నాలుగు నెలలయింది. శంకరానికి మాత్రం జీతంలో నెలకి పాతిక రూపాయలు మినహాయించుకుంటున్నారు.

రామావతారం కాల్ లెటర్ రప్పించవలసిన వుద్యోగానికి ఇంటర్వ్యూలు జరిగిపోయాయి. శంకరం తమ్ముడికి ఇంటర్వ్యూ రాలేదు.

శంకరం రామావతారాన్ని రెండు వందల రూపాయలు తిరిగి యివ్వమని అడిగాడు.

"ఎంప్లాయ్‌మెంట్ గుమస్తాకి యిచ్చాను. పని కాక పోతే తిరిగి యిస్తానన్నాడు. అడిగాను త్వరలో ఇస్తాడు" అన్నాడు రామావతారం.

మరో రెండునెలలు గడిచినప్పటికీ రామావతారం సమాధానంలో మార్పులేదు. శంకరంలో సహనం చచ్చిపోయింది. చివరకు రామావతారం పనిచేస్తోన్న ఆఫీసుకి వెళ్ళి అతడితో లడాయి వేసుకున్నాడు.

"నేను ఇస్తానన్నప్పుడు ఇచ్చే వరకూ ఆగాలి. పని జరిగితే వుండే మాటలు యిప్పుడు వుండవు. ఛీ...ఛీ.... ఏం మనుషులు!" అన్నాడు రామావతారం.

"అంతే నంటావా? అలా అయితే ఎంత వరకూ ఆగా లిట?" అడిగాడు శంకరం.

"ఎంతకాలమయినా ఆగాలి"

' నేను ఆగను. నాకు డబ్బు రేపటికి కావాలి!"

"రేపు సెలవయినా మేము ఓవర్ టైము చేస్తాం. ఎంప్లాయ్‌మెంట్ గుమస్తాను కలుసుకోలేను."

"గుమస్తా ఎవడూ లేడు. నువ్వే ఆ రెండు వందలూ తినేశావు."

"మాటలు జాగ్రత్తగా రానియ్!"

"ఏం? ఏం చేస్తావేం?"

అప్పటికే రామావతారం సహోద్యోగులూ వాళ్ళిద్దరి చుట్టూ చేరి చోద్యం చూడసాగారు.

"ఏం చేస్తాను? లచం యివ్వ చూపిన నేరానికి అరెస్టు చేయిస్తాను."

"పిచ్చి వేషాలు వేశావంటే గుండెల్లో పొడుస్తాను. నాసంగతి నీకింకా తెలియదు."

"ఏడిశావ్ లేవోయ్!"

"మాటలు జాగ్రత్తగా రానియ్! అన్నంత పనీ చేసె య్యగలను?"

"రా! అంత ఖలేజా వుంటే పొడవ్వోయ్! చవటా!"

శంకరం యిక అపుకోలేకపోయాడు. ఉద్రేకం కట్టలు తెంచుకుని పొంగిపరవళ్ళు త్రొక్కుతోంది. ఎగిరి రామావతారం పీకను పెనవేసుకున్నాడు.

"ఆఁ! ఆఁ!" అన్నారు చుట్టూ వున్న ప్రేక్షకులు.

ఒక సాహసవంతుడు చొరవగా ఇద్దరినీ విడదీసి "బయటకు పోయి కొట్టుకు చావండయ్యా! ఆఫీసు అవ

రణలో తన్నుకు చస్తారేం?'' అన్నాడు.

శంకరానికి ఇంగితం తిరిగి వచ్చింది.

ఇది రామావతారం ఆఫీసు. అతడు యింకా డ్యూటీలో వుండగానే అందరి ఎదుటా తాను అతడి మీద కలియబడ్డాడు. రామావతారం కంప్లయింట్ యిస్తే తనను కటకటాల వెనక్కి నెట్టడానికి ఈ నేరం చాలు.

శంకరం రామావతారం కేసి చూశాడు.

అతడి కళ్ళు విజయగర్వంతో మెరుస్తున్నాయి.

తన డబ్బు దిగమింగింది అతడే అయినా తాను తప్పుకు దొరికాడు.

''అయితే రేపూ యివ్వనంటావు?'' అడిగాడు శంకరం

''వందో యాభయ్యో చూచి పారేస్తాను-రేపు రా!''

''ఎన్ని గంటలకు?''

''ఆఫీసుకే రా! నేను ఒక్కడినే పనిచేసుకుంటాను. నాపని పెండింగ్‌లో వుంది. నా మొహానికి దిక్కుమాలిన సీటు దొరికింది. సాయంత్రం ఆరింటికి రా.''

''ఫోన్ చేసి మరీ వస్తాను.''

రామావతారం తలెగరేశాడు.

శంకరం వెళ్ళిపోయాడు.

''ఆదివారం కూడా సాయంత్రం ఆరింటివరకూ ఎందుకోయ్?'' సహోద్యోగి అడిగాడు.

రామావతారం నవ్వి, ''వచ్చేదె సాయంత్రంనాలుగ్గంటలకు కాస్త టైపింగ్ వర్క్ వుంది'' అన్నాడు.

ప్యూన్‌ని పిలిచి ఆఫీసు తాళాలు వేరొక తాళం చెవులు తనకు యివ్వమని హుకుం జారీ చేశాడు రామావతారం.

2

"మీ కోసం క్లయింటు వచ్చారు. కన్సల్టింగ్ రూంలో కూర్చోబెట్టాను." అన్నది సునీత.

డిటెక్టివ్ శిరీష్ వాచీ చూసుకున్నాడు. రాత్రి తొమ్మిది కావస్తోంది. బద్ధకంగా ఆవులించి, నైట్ గౌన్ సర్దుకుని, కన్సల్టింగ్ రూంలో అడుగు పెట్టాడు డిటెక్టివ్ శిరీష్.

సోఫాలో ఎదురుగా కూర్చున్న స్త్రీ లేచి నిలబడి చేతులు జోడించింది. ఏడ్చి కాబోలు ఆమె కళ్లు ఎర్రగా వుబ్బి వున్నాయి.

"కూర్చోండి" అంటూ ఆమెకేసి చూచి కుర్చీలో కూర్చున్నాడు డిటెక్టివ్ శిరీష్. ఆమె మెల్లగా కూర్చుంది.

"క్షమించండి. మీకు నిద్రాభంగం కలిగించినట్టున్నాను" అన్నదామె.

"ఫరవాలేదు. మీరెవరు? ఏం పనిమీద వచ్చారో చెప్పండి".

ఆమె గొంతు సవరించుకొని, "నాపేరు సీత. మావారు శంకరంగారు. యూనివర్శిటిలో గుమస్తాగాపనిచేస్తున్నారు. ఇప్పుడే అరగంట క్రితం పోలీసులు మావారిని అరెస్టు చేసి తీసుకు వెళ్ళారు" అంది.

అలా అంటూనే ఆమె దుఃఖంతో తల మునకలయింది. గొంతు బొంగురుపోయింది. కళ్ళల్లో నీళ్ళు వుబుకుతున్నాయి. సీత ఏడుస్తోంది. రెండు నిమిషాలు సీతను చూస్తూ మౌనంగా వుండిపోయాడు డిటెక్టివ్ శిరీష్.

సీత కొంతసేపటికి సంబాళించుకుని, "వారు ఎవరికీ అపకారం చేసే వ్యక్తికాదు. రామావతారాన్ని కత్తితో

పొడిచి చంపారని పోలీసులు అరెస్టు చేసి తీసుకు పోయారు" అన్నది.

డిటెక్టివ్ శిరీష్ ఆమెను చురుకుగా చూచి, "రామావ తారం ఎవరు ?" అని అడిగాడు.

"ఫారెస్ట్ డిపార్ట్మెంటులో పనిచేస్తాడురామావతారం"

"రామావతారంతో మీ వారికి తగాదాలేమైనా వున్నాయా"?

"మా మరది వుద్యోగ ప్రయత్నంలో రామావతారం రెండు వందలు అడిగినట్టు మావారు చెప్పారు. అంతకు మించి నాకు ఏమీ తెలియదు."

"మీవారు నేరస్తులు కాకపోతే ఎటూ పోలీసులు వది లేస్తారు కదా! నేరస్తులయితే నేను చేయగలిగేది మాత్రం ఏం వుంటుంది?"

"ఆయన అ రకమైన ఘాతుకాలు చేయరు. నేను బలంగా నమ్ముతున్నాను. మీ పరిశోధనలో హత్యను ఆయనే చేసినట్టు నిరూపణ అయితే చేసిన పనికి శిక్ష అనుభవిస్తారు అంతే!"

"అల్ రైట్. రేపు వుదయం శంకరం గారిని కలుసు కుంటాను. మీరు నిశ్చింతగా వుండండి." అంటూ డిటె క్టివ్ శిరీష్ కుర్చీలోంచి లేచాడు.

సీత చేతులు జోడించింది.

"అన్నట్టు మీ యింటి ఎడ్రసు చెప్పండి."

"4-33-6, అఫీషియల్ కాలనీ."

3

"నేను ఏపాపం ఎరగనండి. రామావతారాన్ని హత్య



చేయవలసిన అవసరం నాకులేదు. పైగా హత్య చేయడం వలన నాకు రావలసిన రెండు వందల రూపాయలు పోగొట్టుకున్నట్టవుతుంది."

"శంకరంగారూ! ఒక పైసా కోసం పంపకం జరగక బొంబాయిలో ఇద్దరు బిచ్చగాళ్లు ఒకరి కొకరు చంపు కున్నట్టు నాకు తెలుసు రెండు వందల రూపాయలకోసం హత్య జరుగుతుందా? జరగదా? చెయ్యవచ్చునా? చెయ్య కూడదా? అన్నది సమస్యకాదు. హత్య జరిగిన ప్రాంతంలో మీరు హత్య సమయానికే ఎందుకు వెళ్ళారు?"

శంకరం విస్పృహగా కటకటాల మీద తలవాల్చాడు.

"ఆదివారం జరిగినదంతా చెబుతున్నాను. నన్ను నమ్మండిసార్!" అన్నాడు శంకరం.

డిటెక్టివ్ శిరీష్ తల పంకించాడు

"రామావతారం నాకు ఆదివారం సాయంత్రం కొంత డబ్బు జమకడతానని చెప్పాడు." నేను ఆఫీసుకు సాయంత్రం 5-30 ని॥లకు ఫోన్ చేశాను. రామావతారం ఫోన్‌లో దొరికాడు.

'వస్తున్నాను. ఎటూ వెళ్ళక." అన్నాను ఫోన్‌లో.

'డబ్బుకా?' రామావతారం గొంతు వింతగా వుంది. నోటికి జేబురుమాలు అడ్డం పెట్టుకున్నాడల్లే వుంది అనుకున్నాను.

'అవును. ఎంత సమకూడింది ?'

'రా.... మొత్తం ఇచ్చేస్తాను.'

"నువ్వొక్కడివే వున్నావా?" అడిగానుఅనుమానంగా.

"అవును."

నా అనుమానం ధృవపడింది. రామావతారం అబద్ధ మాడుతున్నాడు. నాకు టెలిఫోన్‌లో టైప్ చేస్తోన్న శబ్దం వినిపిస్తోంది. అంటే ఎవరో టైప్ చేస్తున్నారన్నమాట. రామావతారం ఆ విషయాన్ని దాచడానికి దేనికి ప్రయ త్నిస్తున్నాడు? అయితే నాకు యివ్వడానికి డబ్బు సమ కూర్చిన సంగతి కూడా అబద్ధమై వుండాలి. ఏమైతే అయింది! ఈరోజు రామావతారం సంగతి తేల్చవలసిందే! ఇంట్లో అవసరాలకు డబ్బు అందక చాల ఇబ్బందిగా వుంది.

టెలిఫోన్ బూత్ అద్దాల్లోంచి - వచ్చే సిటీబస్సును చూసి, "వస్తున్నాను" అనేసి రిసీవర్ క్రెడిల్ చేసి బయ టకు పరుగెత్తాను.

పది నిముషాల్లో రామావతారం ఆఫీసు ముందు సిటీ బస్సు దిగాను. శీతాకాలం ప్రొద్దుకావడంతో అప్పటికే చీకటి పడిపోయింది. రామావతారం కూర్చుండే రూములో

లైటు వెలుగుతోంది. నేను చకచక అటు నడిచాను.నాకు యిప్పుడనిపిస్తోంది. గేటు నుండి రామావతారం రూమ్ వరకూ దారి బురదగావుంది. రెండు మూడుసార్లు స్లిప్పర్ జారబోయింది కూడా.

రామావతారం గదిలో చాల నిశ్శబ్దంగా వుంది. టైప్ మిషన్ మీద పనిచేసిన వ్యక్తిని ఎక్కడో దాచివుంటాడు రామావతారం. గదిలోకి అడుగుపెట్టాను. ఆ గది తప్ప ఆఫీసు అంతా చీకటి. రామావతారం టేబులు మీద తల పెట్టి కూర్చున్నాడు.

నేను వస్తున్నట్టు తెలిసి అతడికి నవనాడులూ స్తంభించి వుంటాయి. నేను అతడి కుర్చీ వద్దకు నడిచాడు.

రామావతారం వీపు ఎర్రగా రక్తంతో తడిచిపోతోంది. రక్తం ప్రవాహంలాగా కారి కుర్చీలోంచి క్రిందకు జారి చుట్టూ మడుగు కట్టింది. వీపు మీద రక్తంలో ఎర్రగా తడిసిన కత్తి పిడి మిలమిల మెరుస్తోంది. నాకు ఠారెత్తి పోయింది. గదిలోంచి ఎలా బయట పడ్డానో గేటు దగ్గరకు ఎలా పరుగెత్తుకు వచ్చానో, గేటుదాటి రోడ్డుమీదకు ఎలా వచ్చి పడ్డానో నాకే తెలియదు.

గ్రుడ్డిలో మెల్లగా సరిగ్గా అప్పుడే సిటీబస్ వస్తోంది. బస్సు పట్టుకుని ఇల్లు చేరుకున్నాను. 8.30 కల్లా పోలీసు జీపు మా యింటిముందాగింది. నేను చెప్పిందంతా నిజం. నన్ను నమ్మండి ''

శంకరం చెప్పడం ఆపి, వూపిరి పీల్చుకున్నాడు.

''మీకు ఫోన్‌లో వినిపించిన శబ్దం టైప్ మిషన్ మీద టైప్ చేస్తోన్న శబ్దమేనా?''

''అవునండి. కచ్చితంగా అది ఎవరో టైప్ చేస్తోన్న

శద్దిమే!"

"రామావతారానికి శత్రువులెవరైనా వున్నట్లు మీకు తెలుసా?"

"ఆ విషయం నాకు తెలియదు కాని, అతడు చాల మంది వద్ద ఈ రకంగా పనులు చేయిస్తానని పెద్ద మొత్తాలు తీసుకున్నాడట. నేను రెండు వందలతోనే బయటపడినందుకు వాళ్ళ యు.డి. క్లర్కు నన్ను అభి నందించాడు."

"అతడికి రామావతారం విషయం ఎలా తెలుసు?"

"నేను అడగలేదు."

"అన్ని విషయాలు దాచకుండా చెప్పారా?"

"నాకు గుర్తున్నవన్నీ చెప్పినట్టే సార్! మీ వద్ద విషయాలు దాచి నేను చేయగలిగిందేమిటి?"

డిటెక్టివ్ శిరీష్ లేచాడు. శంకరం వద్ద సెలవు తీసుకుని క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ వున్న గదిలోకి వచ్చాడు.

"ఏమంటాడు మీ నిర్దోషి?" చమత్కరించాడు కుమార్.

"మీ పోలీసులు నిర్దోషులనే అరెస్టు చేస్తారా?"

"కాదు. అరెస్టు చేసినప్పుడే వాళ్ళు నిర్దోషులు. బోను ఎక్కి మాట్లాడేటప్పటికి అంతా బయటపడుతుంది."

"ఈ మధ్యలో మీ ట్రీట్‌మెంటు వుంటుందిగదా!"

కుమార్ మొహం ఎర్రగా అయింది.

"పోలీసులంతా అంతే అనక!"

"నేను మిమ్మల్ని అనడం లేదు. మీ పోలీసు వ్యవస్థ అలాంటిది. మానవత్వం ఛాయలు సోకకుండా పోలీసుల

రాజ్యం సృష్టించారు తెల్లవాడు. మీ వ్యవస్థను ఏ ప్రభుత్వమూ సంస్కరించడానికి పూనుకోదు. ప్రభుత్వాలకు దమనకాండలో సహకరిస్తారు కాబట్టి!"

"ఇంతకూ శంకరం నిర్దోషి అనడానికే కదా మా పోలీసుల మీద పడ్డావు!"

"నా క్లయింట్ అయినంత మాత్రాన నిర్దోషి అని కాదు. అతడు దోషి అనడానికి మీ వద్ద వున్న ఆధారాలు ఏమిటి?"

"ఫారెస్టు ఆఫీసులో శంకరం అడుగుజాడలు స్పష్టంగా వున్నాయి."

"అవి ఎలా ఏర్పడ్డాయో చెప్పగలవా?"

"నేల తడిసివుంది. స్లిప్పర్ల ముద్రలు స్పష్టంగా పడ్డాయి."

'నేల ఎందుకు తడిసింది. నిన్న సాయంత్రం వర్షం గానీ, మంచుగానీ కురిసిన జాడలేదు.'

'తోట తడిపి వుంటారు.'

'ఒక ప్రక్కగా పూలకుండీలున్నాయి. వాటికి నీరు పోయడానికి గేటు నుండి రామావతారం గది వరకూ తడపవలసిన అవసరంలేదు."

'.................'

'శంకరం ఆ సమయానికి రామావతారాన్ని కలుసుకుంటాడని తెలిసిన వాళ్ళెవరో నేల తడిపి వుంచారు. నా వుద్దేశ్యంలో హంతకుడే చేసివుంటాడు.'

'శంకరమే అలాచేసి అమాయకత్వంనటిస్తున్నాడేమో!'

'ఫారెస్టు డిపార్టుమెంటుకి వెళ్దాం పద!'

ఇన్‌స్పెక్టర్ కుమార్ లేచాడు.

డిటెక్టివ్ శిరీష్ రాజ్‌దూత్ మీదా, ఇన్‌స్పెక్టర్ కుమార్ బులెట్ మీదా బయలుదేరారు. ఉదయం 8 గంటలయింది. గేటు ముందు కాపలా వున్న కానిస్టేబులు ఇద్దరికీ విష్ చేశాడు.

ఫారెస్టు డిపార్టుమెంటు నిర్జనంగా వుంది. కాంపౌండుకి ఒక మూలగా వాటర్ పైపు వుంది. దానికి హోస్ పైపు తగిలించి వుంది. ఇద్దరూ గేటు తెరచుకుని లోపల అడుగుపెట్టారు. రాత్రి బురదగా అయిన ప్రాంతం నిండా బూట్స్ ముద్రలున్నాయి. పోలీసుల ముద్రలు అవి.

'రామావతారం హత్య చేయబడినట్టు మీకు ఎలా తెలిసింది?' అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

'రామావతారం కొడుకు ఫ్లాస్కులో టీ పోసుకుని తండ్రికి ఇవ్వడానికి ఆఫీసుకి వచ్చాడట. తండ్రి శవం చూచి పిచ్చిగా అరచుకుంటూ బీచ్ వద్ద వున్న బీటు కానిస్టేబులుకి కనిపించాడట.'

ఇద్దరూ వాటర్ పైపు వున్నచోట పరిశీలనగా చూశారు. డిటెక్టివ్ శిరీష్ జేబులోంచి పౌడర్ తీసి హోస్‌పైపు మీద చల్లి చూశాడు. ఎలాంటి వ్రేలి ముద్రలూ లేవు.

'చూశావా? హంతకుడు అన్ని కోణాల్లో జాగ్రత్త పడుతున్నాడు.'

'అవును' ఒప్పుకున్నాడు కుమార్.

రామావతారం హత్య చేయబడిన గదికేసి నడిచారు ఇద్దరూ. గదికి తాళం పెట్టి వుంది. నేలమీద బురదతో కూడిన అడుగుజాడలు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ తాళం తెరిచాడు. ఇద్దరూ గదిలో ప్రవేశించారు. డిటెక్టివ్ శిరీష్‌ను మొదట ఆక

రిషించింది ఆ గదిలో వున్న టైప్ మిషన్. కీ బోర్డుమీద పౌడర్ చల్లి చూశాడు. వ్రేలిముద్రలు లేవు. అంటే ఎవరో టైప్‌చేసి కావాలనే వ్రేలి ముద్రలు చెరిపేశారన్న మాట.

టైప్ మిషన్ ప్రక్కనే చెత్తబుట్ట వుంది. డిటెక్టివ్ శిరీష్ జాగ్రత్తగా పైనున్న కాగితాలు తీసి చూశాడు. అవన్నీ చెత్త కాగితాలు. ఒక ప్రక్కగా వాడిన కార్బన్ షీటువుంది. వెలుతురుకు అడ్డంగా కార్బన్ షీటు పెట్టి చదవాలని ప్రయత్నించాడు డిటెక్టివ్ శిరీష్.

రెండు మూడుసార్లు వుపయోగించిన కార్బన్ షీటు అది! అయినా కొంత మేర స్పష్టంగా అర్థమవుతోన్నట్టు తోచింది.

"ఐ యామ్ సోల్ రెస్పాన్సిబుల్ ఫర్ ఆల్ ఆఫ్ ది మేటర్స్ రిలేటింగ్ టూ...." అంత వరకూ అర్థమవు తోంది. ఆ కార్బన్ షీటును జాగ్రత్తగా మడిచి కాగితంలో చుట్టి కుమార్ చేతికిచ్చాడు డిటెక్టివ్ శిరీష్. గది అంతా వెతికారు. అనుమానించతగిన వస్తువులేవి కని పించలేదు.

"హత్యాయుధం గురించి దర్యాప్తు చేశారా? అడి" గాడు డిటెక్టివ్ శిరీష్.

"లేదు. అయితే అది బాగా త్రుప్పు పట్టిన కత్తి. ఎక్కడో పనికిమాలినదిగా పారవేసిన కత్తి గురించి ఏం తెలుస్తుంది?"

"మార్చ్యురీకి వెళ్దామా?"

కుమార్ తలూపాడు. గదికి తాళం పెట్టి వాహనాల మీద యిద్దరూ బయలుదేరారు.

కాపలా వున్న కానిస్టేబులు నిట్టూర్చాడు.

4

"శవం మొహంలో ఆశ్చర్యం గమనించావా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"అవును. రామావతారం తాను వూహించని వాళ్ళ చేతిలో హత్య చేయబడ్డాడు. అన్నట్టు రామావతారం లంచాలు పుచ్చుకున్న వారి లిస్టు తయారు చేయిస్తే బావుంటుంది."

"అవును కుమార్! ఆ పనిమీద నేను వుంటాను. ఈ లోపుగా నువు హత్యాయుధం గురించి ఆచూకీతీయ్య."

"ఆల్ రైట్...."

"రామావతారం యింటి అడ్రసు చెప్పు."

"స్టేట్ బ్యాంక్ ప్రక్క మూడో యిల్లు."

"వస్తాను." అంటూ డిటెక్టివ్ శిరీష్ లేచి బయలు దేరాడు. రాజ్‌దూత్ స్టేట్ బ్యాంక్ ముందాగింది. రాజ్‌దూత్‌కి స్టాండు వేసి చకచక మెట్లెక్కి స్టేట్ బ్యాంక్‌లో అడుగుపెట్టాడు డిటెక్టివ్ శిరీష్.

క్లర్కులు అప్పుడే సీట్లలో సర్దుకుంటున్నారు.

డిటెక్టివ్ శిరీష్ ఒక క్లర్కు ముందుకు వెళ్ళి, "రామావతారం అని ఈ ప్రక్కనే వుంటున్నాడు. అతడికి యిక్కడ అకవుంట్ వున్నదట. మీకు గుర్తుందా!" అన్నాడు.

క్లర్కు శిరీష్ మొహంలోకి చూస్తూ, "దేనికండి?" అన్నాడు.

"పోలీసు వ్యవహారంలో అవసరం వచ్చింది."

"ఆయన అకౌంట్ నెంబర్ నాకు తెలుసు. అయినా కస్టమర్‌కి తెలియకుండా అతడి వివరాలు ఇవ్వకూడదని మా బ్యాంక్ నియమం!"

"అఫ్‌కోర్స్! కస్టమర్ బ్రతికివుంటే!"

"రామావతారం చచ్చిపోయాడా!"

"అవును. హత్య చేయబడ్డాడు."

క్లర్క్ నిర్విణ్ణుడయాడు. నిముషంలో తేరుకుని చకచక లెడ్జర్ తెరచి రామావతారం జమ చేసిన మొత్తాలూ, డ్రా చేసిన మొత్తాలూ వివరాలు యిచ్చాడు. నెలకు ఏడు ఎనిమిది వేలు జమకట్టి తీస్తూ వచ్చాడు రామావతారం. అంటే రామావతారం అక్రమ సంపాదన విపరీతంగా చేస్తూ వచ్చాడన్నమాట!

శిరీష్‌కి మరీ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమంటే ప్రస్తుతం రామావతారం అకౌంట్‌లో అయిదు రూపాయిలు మాత్రం వుంది. శనివారంనాడు అంటే హత్య చేయబడే ముందురోజు అరవై వేల రూపాయిలు విత్‌డ్రా చేయబడ్డాయి.

శిరీష్ తలలో మెరుపు మెరిసింది.

"శనివారంనాడు రామావతారం మొత్తం తానే విత్‌డ్రా చేశాడా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"అవును సార్! ఇంత సొమ్ము ఒక్కసారే ఎందుకు విత్‌డ్రా చేస్తున్నాడో అడిగాను. 'అవసరమొచ్చింది' అన్నాడు."

"అతడి కూడా ఎవరైనా వున్నారా?"

క్లర్క్ గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాడు.

"అవును సార్. అతడి కూడా నలభై పైబడిన వ్యక్తి

ఎవరో వున్నాడు."

"కూడా వున్న వ్యక్తిని కాస్త వర్ణించండి."

"కాస్త లావుగా ఎత్తుగా వున్నాడు. గ్లాస్కో పంచె వేసుకున్నట్టు గుర్తు."

"రామావతరం భయపడుతున్నట్టు కనిపించాడా?"

"లేదు."

"థాంక్యూ సోమచ్. నా పరిశోధనకి పనికి వచ్చే చాలవిలువైన సమాచారం యిచ్చారు." అంటూ అతడితో కరచాలనం చేసి బ్యాంక్ భవనంలోంచి బయటకు నడిచి మూడో యింటికేసి వెళ్ళాడు.

ఇంటి బయట రామావతారం పేరున్న బోర్డ్ వుంది. డిటెక్టివ్ శిరీష్ గుమ్మం ముందు నిలబడి తలుపుతట్టాడు. కొన్ని క్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి. శోక దేవత లాగా జుత్తు విరబోసుకున్న స్త్రీ ఒకామె తలుపులకి అవతల నిలుచుంది.

ఆమెను రామావతారం భార్యగా వూహించాడు శిరీష్. తనని తాను పరిచయం చేసుకుని, "మీరు రామావతారం గారి భార్య అనుకుంటాను." అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

"ఆమె తలాడించింది."

"క్షమించండి. మీ వారిని చంపిన వారిని పట్టుకునే ప్రయత్నంలో వున్న మాకు మీరు పూర్తిగా మీకు తెలిసిందంతా చెప్పి సహకరించితే బావుంటుంది."

ఆమె తలూపింది. లోపలికి నడిచింది. శిరీష్‌కి కుర్చీ చూపించి, స్తంభానికి చేరగిలబడి నిలబడింది.

"మీ వారు లంచాలు తీసుకుంటున్నట్టు మీకు తెలుసా?"

"ఒకరిద్దరు ఇంటికి వచ్చి గొడవపెట్టి వెళ్ళారు.

నాకూ అప్పుడే తెలిసింది."

"వాళ్లెవరో మీకు తెలుసా ?"

"తెలియదు."

"తరువాత ఎప్పుడయినా చూశారా ?"

"లేదు."

"మీ వారిని ఆ విషయమై ప్రశ్నించారా ?"

"అడిగి చూశాను. 'ఆడముండవి ! మగాళ్ళ వ్యవహారాలు నీకేం తెలుస్తాయి ?' అని తిట్టారు."

"మీవారు తన స్నేహితులను ఎవరినయినా యింటికి తీసుకువచ్చేవారా ?"

"అప్పుడప్పుడూ ఒకతను మాత్రం వచ్చేవాడు."

"అతడు ఎవరో మీకు ఎప్పుడైనా మీవారు చెప్పారా?"

"స్నేహితుడని మాత్రం చెప్పారు ఒకసారి."

"అతడి గుర్తులు చెప్పగలరా ?"

"ఎప్పుడూ గ్లాస్కో పంచె వేసుకునే వచ్చేవాడు. భారీ మనిషి."

డిటెక్టివ్ శిరీష్ తల పంకించాడు. స్టేట్ బ్యాంక్ క్లర్క్ వర్ణించిన వ్యక్తి పోలికలతో ఈ పోలికలు సరిపోతున్నాయి.

"మీ వారికి శత్రువులెవరైనా వున్నట్టు మీకు తెలుసా ?"

"తెలియదు."

"మీ అబ్బాయి భయంలోంచి తేరుకున్నాడా ?"

"మా బంధువుల పిల్లలతో బయటికి పంపేశాను. ఫరవాలేదు. కాస్త తేరుకున్నట్టేననుకుంటున్నాను."

డిటెక్టివ్ శిరీష్ లేచి ఆమె వద్ద సెలవు పుచ్చుకుని బయలుదేరాడు.



5

"శంకరం గారూ! రామావతారం హత్య చేయబడిన విషయంలో మీకు ఎవరి మీదనయినా అనుమానం వుందా?" అడిగాడు డిటెక్టివ్ శశీష్.

"నాకు అనుమానం లేదండి."

"వాళ్ళ ఆఫీసులో రామావతారం విషయం తెలిసిన యు. డి. క్లర్క్ ఎవరో మిమ్మల్ని పలకరించినట్టు చెప్పారు కదా! అతడు ఎవరు!"

"రామావతారం ప్రక్క సీటులోకూర్చుంటాడు. అంతే తెలుసు."

డిటెక్టివ్ శిరీష్ సెల్ వద్దనుండి కదిలి ఇన్‌స్పెక్టరు కుమార్ గదిలో అడుగుపెట్టాడు.

"హత్య చేయబడిన కత్తి గురించి ఏమీ తెలియలేదు. అన్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్."

"కార్బన్ షీటూ అలాగే తగల బడింది. అయితే a అక్షరంమీద పడిన ముద్ర స్పష్టంగాలేదు. అంటే టైప్ చేసిన వ్యక్తి చిటికెన వ్రేలితో a ను సరిగా ఒత్త లేక పోయాడన్నమాట."

"చిటికెన వ్రేలు గాయమై వుండాలనా నీవుద్దేశ్యం"

"అవును"

"కీ బోర్డులో లోపం ఏమైనా వుందేమో !"

"లేదు చూశాను. చిటికెన వ్రేలితో – అదీ ఎడమ వ్రేలితోనే కొట్ట వలసిన p కూడా సరిగా ముద్రపడలేదు. అందుకే టైప్ చేసిన వ్యక్తి చిటికెన వ్రేలు సరైన స్థితిలో లేదని తోచింది."

"కేసు ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదని ఎస్. పి. గొడవ పెడుతున్నాడు. ఏం చేయాలో అర్థం కావటంలేదు.

"నువు మాత్రం కంగారు పడక !"

"రామావతారం సీటుప్రక్క వుండే యు.డి. క్లర్కుకి రామావతారం గురించి బాగా తెలిసే అవకాశం వుంటుం దేమో !"

"అవును. నా వుద్దేశ్యంలో కూడా అతడిని కలుసు కోవాలని వుంది,"

"నేను అతడిని కలుసుకుంటాను. నువు యిక్కడే నాకోసం కనిపెట్టుకు చూడు. కేసు విషయం ఆలోచించు."

"ఆల్ రైట్ !"

క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ లేచి బులెట్ మీద బయల్దేరాడు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో యు. డి. క్లర్కు సులువుగా దొరికాడు.

"రామావతారం గురించి ఏమైనా చెప్పగలరా?" అడిగాడు కుమార్.

యు.డి. క్లర్క్ గంభీరంగా చూస్తూ, "రామావతారం స్నేహశీలి. చాల మంచివాడు." అన్నాడు.

కుమార్ ఆశ్చర్యం అణుచుకున్నాడు. శంకరంతో మాట్లాడినట్టు తనతో మాట్లాడటం లేదు. కుమార్ చటుక్కున క్లర్క్ ఎడమ చేతికేసి చూశాడు. చిటికెన వ్రేలు మీద ఎర్రగా కంది వుంది.

కుమార్‌లో అనుమానం దృవపడింది. ఆఫీసులో వాళ్ళ సహకారం లేనిదే ఆఫీసులో హత్య జరగడం కాస్త అసాధ్యమైన పనే!

"లంచాలు తీసుకునేవాడని పుకారు వుంది."

"ఈ రోజుల్లో ఎవరు తీసుకోవడం లేదు సార్ లంచాలు! అమాయకుడు కాబట్టి రామావతారం బయట పడ్డాడు. అంతే!"

"నిజమే!" లేచాడు కుమార్. ఆ క్లర్క్ రామావతారాన్ని ఆకాశానికెత్తి తనతో చెబుతాడు తప్పితే నిజం బయటపెట్టడు. అతడి వద్ద సెలవు తీసుకుని తన వాహనం దగ్గరకు నడిచాడు.

6

మధ్య మధ్య వెనక్కి చూసుకుంటూ చక చక నడవ సాగాడు అతడు.

అతడి వెనక సామాన్యమైన రైతులాగా గూడకట్టు పంచెలో, మోచేతులు దాటిన చొక్కాతో డిటెక్టివ్ శిరీష్ వెంబడించసాగాడు. కటింగ్ మీసం మీద గుబురుమీసాలు

అంటించుకున్నాడు. తలపైకి దువ్వుకుని ఫేస్ పౌడర్ చెంపలకు రాసుకున్నాడు.

ముందు వెళ్లే వ్యక్తి మలుపు తిరిగి అయిదో భవంతి ముందు చటుక్కున ఆగి అటూ యిటూ చూచి, తనని ఎవరూ వెంబడించడంలేనట్టు నిర్ధారణ చేసుకుని గేటు తెరుచుకుని భవంతిలోకి వెళ్ళిపోయాడు.

డిటెక్టివ్ శిరీష్ ఆ భవంతికి యివతల ప్రక్కనే ఆగిపోయి భవంతికేసి చూచాడు. పైనున్న గదుల్లో ఎవరూ వున్నట్టు జాడలేదు. గదుల తలుపులన్నీ మూసి వున్నాయి.

డిటెక్టివ్ శిరీష్ చటుక్కున ప్రహరీ గోడ దూకి భవంతి వెనకే ప్రక్కకి నడిచాడు. ఒక గదిలోంచి మాటలు వినపడుతున్నాయి.

డిటెక్టివ్ శిరీష్ గుమ్మం వైపు గాక కిటికీలకేసి నడిచి పంచెలో బొడ్డున కట్టిన టేప్ రికార్డర్ ఆన్ చేసి చిన్న మైకును కిటికీలోంచి లోపలకి జారవిడిచాడు. రెండో చేత్తో పిస్తోలు పట్టుకున్నాడు.

"ఇన్స్పెక్టర్‌తో ఏం చెప్పావు ?"

"రామావతారం చాల మంచివాడని చెప్పాను"

"నమ్మాడా !"

డిటెక్టివ్ శిరీష్ లోపలికి చూశాడు. ఇద్దరూ కిటికీ వైపు వీపులు పెట్టి కూర్చున్నారు. రెండో వ్యక్తి భారీ మనిషి.

"లేనట్టుంది !"

"అయితే నిన్ను వెంబడిస్తూంటారు. చాల జాగ్రత్తగా వుండు."

"నువ్వు కూడా బయటికి వెళ్ళేటట్టుంటే ఈ బట్టలు తప్పించి మరేవైనా వేసుకుంటే బావుంటుందేమో !"

"నేను బయటికే రాను కదా !"

"అనవసరంగా చంపావు."

"వాడు నన్ను ఇరికించాలని చూశాడు."

"వస్తాను."

"జాగ్రత్త !"

యు. డి. క్లర్క్ లేచాడు. డిటెక్టివ్ శిరీష్ చటుక్కున మైక్ లాగి సర్దుకుని ప్రహరీ గోడ దూకి రోడ్డు మీదకు వచ్చాడు. ఒక నిముషంలో యు. డి. క్లర్క్ కూడా రోడ్డుమీద అడుగు పెట్టి వచ్చిన దారినే మెల్లగా నడవ సాగాడు.

డిటెక్టివ్ శిరీష్ అతడు తనని దాటిపోనిచ్చి వెనకనే నడవసాగాడు.

"బాబూ ! అగ్గిపెట్టె వుంటే యిస్తారా ?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

యు. డి. క్లర్క్ అతడిని తేరిపార చూచి, "వుంది" అంటూ జేబులోంచి తీస్తోన్నట్టు నటించి డిటెక్టివ్ శిరీష్ మీదకు దూకాడు.

యు. డి. క్లర్క్ పైకి మామూలుగానే కనిపించినా కసరత్తు చేసిన శరీరం.

"ఎవరు నువ్వు ?" అడిగాడు యు. డి. క్లర్క్ బలంగా చెయ్యి విసురుతూ.

డిటెక్టివ్ శిరీష్ అతడి దెబ్బ కాచుకుని, చెయ్యి ఒడిసి పట్టి గుంజి కాలితో డొక్కలో తన్ని చేతితో బలంగా అతడి గూబ గుయ్యిమనిపించాడు. యు. డి. క్లర్క్

రోడ్డుమీద పడిపోయాడు. డొక్క పట్టుకు మూలుగుతూ దీనంగా చూశాడు.

"మీ యిద్దరూ కలసి రామావతారాన్ని ఎందుకు హత్య చేశారు ?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"నేను చేయలేదు. వాడే పార్వతీశంగాడు....వద్దని నేను వాడిని బ్రతిమాలినా రామావతారాన్ని పొడిచి చంపేశాడు."

"నువు హామీ పత్రాలు టైప్‌చేస్తూ కూర్చున్నావా !"

యు. డి. క్లర్క్ అవాక్కయిపోయాడు.

"నేను టైప్ చేయడం ఏమిటి ?" అడిగాడు యు. డి. క్లర్క్.

"నువు రామావతారం చేత సంతకాలు పెట్టించడానికి టైప్ చేసిన హామీ పత్రాలు దొరికాయి. హత్య జరిగి నప్పుడు నువు అక్కడే వున్నావు. ఎలిబీ సంపాదించ గలము. హోస్ పైపుల మీదా, హత్యాయుధం మీదా, టైప్‌రైటర్ మీదా వ్రేలిముద్రలు చెరిపింది నువ్వే."

యు. డి. క్లర్క్ మొహం తెల్లబడింది.

"నేల మీద నీళ్ళు చిలకరించింది ఎవరు ?"

"పార్వతీశమే నా చేత చేయించాడు."

"మీ ముగ్గురూ అంటే పార్వతీశం, రామావతారం, నువ్వూ లంచాలు పుచ్చుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో వుద్యోగాలు వేయించడం, పనులు చూచి పెట్టడంలో భాగస్వాములు. రామావతారాన్ని దేనికి చంపినట్టు ?"

"మా యిద్దరిలో ఎవరో ఒకరు తోడున్నప్పుడు మాత్రమే రామావతారం బ్యాంకులో డబ్బు వేయడంగాని తీయడం గానీ చెయ్యాలి. పని అయినా కాకపోయినా

పుచ్చుకున్న లంచాలను తిరిగి యివ్వం. అలాంటి పరిస్థితిలో శంకరం మాకు మేకులాగా తయారయాడు. పైగా రామావతారం డబ్బు విత్ డ్రా చేయసాగాడు. పార్టీని వల వేసి పట్టడంలో తనదే భారం హెచ్చు అని అడ్డంగా వాదించుతూ వచ్చాడు."

"ఒకే దెబ్బకు రెండు పిట్టలు పడగొట్టాలని చూశారు!" వ్యంగ్యంగా నవ్వి డిటెక్టివ్ శిరీష్ అతడిని లేవనెత్తి పోలీసు స్టేషన్ వైపు ఈడ్చుకు వెళ్ళాడు.

ఇన్ స్టాల్ మెంట్ చదువు!!

"మరో వారం రోజుల్లో పరీక్షలటగా బాగా చదువుతున్నావా?" ఎదురైన మిత్రున్ని అడిగాడొకతను.

"రెండు సబ్జెక్టులేగా. బాగానే ప్రిపేరయ్యాను."

"రెండేనా? ఇంత క్రితం నువ్వసలు పరీక్షే రాయలేదుగా రెండు సబ్జెక్టులెలా ఇస్తావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అబ్బే ఫీజు కట్టడం అన్ని సబ్జెక్టులకీ కట్టాను. కానీ రెండుమాత్రమే ప్రిపేరయ్యాను. ఏమిటో ఈ ఉద్యోగం దొరికినప్పటి నుండీ అన్నీ ఇన్స్టాల్ మెంట్ బేసిస్ పై తీసుకోవడం అలవాటయింది. మిగతా సబ్జెక్టులు తర్వాత ఇస్తాను." చల్లగా అన్నాడు.

—సుంచు కృష్ణస్వామి,
నిజామాబాద్.

రివాల్వర్ దొంగ

— అందవరపు మల్లిబాబు

పాఠకుల పరిశోధన పోటీ-88

(బహుమతి రు. 50/- లు నగదు)

అసహనంగా హాల్లో ప్రచార్లు చేయసాగింది మిస్ మణి మాల. ఆమె మనస్సు అల్లకల్లోలంగా వుంది. మొహం గంభీరంగా మారిపోయింది.

రివాల్వర్ ఎలా మాయమైంది?

ఎవరు తీసేరు దాన్ని?

పోలీసులకు తను ఫోన్ చేసింది. యింకా రాలేదేమిటి చెప్మా?" నిమిష నిమిషానికి వాచీచూసుకుంటు అనుకుంది.

మణిమాల వయసు నలభై పైన వుంటుంది. అయినా అవివాహితే। పెద్దలు మిగిల్చిన సిరిసంపదలకు ఒక్కతే వారసురాలు. ఆమెకు పెళ్ళిమీద గాలి మళ్ళలేదెన్నడూ, కారణమడిగినా జవాబు చెప్పలేదెవరికీ. ప్రేమించి దెబ్బ తినివుండవచ్చునని చాలా మంది అభిప్రాయం. కాని ఎవరికీ తెలియదు నిజమేమిటో?

ఇంటి ముందు పోలీస్ జీపు ఆగింది.

జీపులోంచి యిన్‌స్పెక్టర్ జలంధర్, యిద్దరు కానిస్టేబుల్సు, పోలీసు వేలిముద్రల నిపుణుడు దిగేరు.

"మిస్ మణిమాల మీరేనా?" హాల్లోకి ప్రవేశిస్తు అడిగేడు యిన్‌స్పెక్టర్.

"యస్। మీకు ఫోన్ చేసింది నేనే రండి" అంటూ అందర్నీ లోనికి ఆహ్వానించింది మిస్ మణిమాల.

జలంధర్, వేలిముద్రల నిపుణుడు కుర్చీల్లో ఆసీనులయ్యారు. కాస్తంత దూరములో పోలీసులు నిలుచుని వున్నారు,

"ఎటువంటి హత్య జరగక ముందే రివాల్వర్ మాయమైందని కంప్లెయింటు రావడం నా సర్వీసులో యిదే ప్రథమం. మీరేదైనా ప్రమాదాన్ని శంకిస్తున్నారా?" అనడిగేడు జలంధర్.

"రివాల్వర్ మాయమైన విషయం మీ దృష్టిలో చిన్న విషయంకావచ్చును. కాని నా దృష్టిలో చాలా ప్రమాదకరమైన విషయము" అందామె ఇన్‌స్పెక్టర్ వేపు నిశితంగా చూస్తూ.

'ఎలా?'

"నా రివాల్వర్‌తో ఎవరో ఎవర్నో హత్య చేసి ఆ నేరాన్ని నా మీదకు నెట్టే ప్రయత్నము చేయవచ్చు. రెండవది—ఆ రివాల్వర్‌తో నన్నే హత్య చేసి, అది ఆత్మ హత్యగా నిరూపించే ప్రయత్నం కూడ జరుగవచ్చు. గనుక ఇటీజ్ వెరీ డేంజరస్ మేటర్" అంది మిస్ మణి మాల.

ఆమెకు క్రైమ్‌నాలెడ్జి బాగావుంది వుండవచ్చనుకు న్నాడు జలంధర్. ఆమె చెప్పిన రెండు పాయింట్లు చాలా గొప్పవే!

"ఆల్‌రైట్! రివల్వార్ ఎప్పుడు, ఎలా మాయమైనదీ చెప్తారా?" అనడిగేడు.

మిస్ మణిమాల గొంతు సవరించుకుని చెప్పడం ప్రారంభించింది.

"ఒక వ్యక్తిగతమైన పనిమీద రెండ్రోజుల క్రితం హౌరావెళ్ళి, ఈ రోజే తిరిగిరావటం జరిగింది. నేను వచ్చే సరికి యింటి తలుపులు తెరిచివున్నాయి. నౌకర్ని పిలిచి అడిగేను. తనకా విషయమే తెలీదనీ, తనూ యిప్పుడే వచ్చేనని చెప్పేడు. ఆందోళనగా లోని కెళ్ళి చూడగా రివాల్వర్ మాత్రమే దొంగిలించ బడినదని తేలింది. వెంటనే మీకు ఫోన్‌చేసాను. అంతే!" క్లుప్తంగా చెప్పింది మణిమాల.

"మీ యింట్లో మీరొక్కరే వుంటున్నారా?"

"నాకు నేను తప్ప మరెవ్వరూ లేరు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కరువయ్యేరు. ఉన్న అన్నయ్య యీమధ్య కారు ప్రమాదములో మరణించేడు. అప్పట్నుంచి ఒంటరి

గానే బ్రతుకుతున్నాను." ఈ మాటలంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో నీరు తిరగడం గమనించేడు జలంధర్.

యింటి ముందు గార్డెన్‌లో అడుగుజాడలేవైనా కనిపిస్తాయేమో చూడమని కానిస్టేబుల్స్‌ని పిలిచి చెప్పేడు.

"మీ యింటి తాళం చెవులు మీదగ్గరే ఉంచుకుంటారా? యింకెవరికైన యిచ్చి వెళుతుంటారా?"

"ఉహుఁ నా దగ్గరే వుంటాయెప్పుడు'

"రివాల్వర్ గాకుండా యింకేమైన పోయాయా?"

"తలుపులు తెరచి వుండటంతో అనుమానం కలిగి, వెంటనే వెళ్ళి బీరువా తెరచి చూసేను. అందులో కొద్ది పాటి నగదు మాత్రమె ఉంటుంది. నౌకరు నమ్మకమైన వాడు గనుక తాళం వేయనెప్పుడూ. నా నగలు డబ్బు చాలా వరకు బ్యాంకు లాకరులో వుంచేను. బీరువాలో ఉంచిన రివాల్వర్ ఒక్కటేకనిపించలేదు"

"అప్పుడు టైమెమంతయింది ?"

"నా గదిలో అడుగుపెడుతుండగా టేబుల్ వాచ్ చూసేను పది నలభై నిమిషాలయింది" అని చెప్పింది.

"మీ రెన్ని గంటలకు వచ్చేరు ?"

"సరిగ్గా పది నలబైకి రెండు నిమిషాల ముందు"

"ఒకసారి మీ రూమ్ చూద్దాం పదండి" అని లేచాడు జలంధర్.

తలుపు తెరచి మణిమాల లోనికి నడవగా, జలంధర్ వేలిముద్రల నిపుణుడు అనుసరించేరు.

ఆ గదిలో ఒకమూలగా గాద్రేజి బీరువా వుంది. దాని తలుపు తెరిచిఉంది. గదిలో మరో ప్రక్కగా టేబిల్ వుంది. దానిమీద టేబుల్‌వాచ్ వుంది. వద

కొండు గంటల యిర వై నిమిషాలు చూపిస్తోంది వాచీ.

"మీరు గదిలోని వస్తువులను తాకేరా మిస్ మణిమాలా?"

"నో, నో! అది ఎంత పొరపాటో నాకు తెలుసు. నా వేలిముద్రలు పడతాయేమోనని ఏ వస్తువూ ముట్టుకోలేదు, బీరువా తప్ప" అంది నవ్వుతూ.

వేలి ముద్రల నిపుణుడు పరీక్షించగా బీరువా మీద మిస్ మణిమాల వేలిముద్రలు తప్ప మరొకరివిలేవు. దొంగ తెలివైనవాడు కావచ్చు, చేతులకి గ్లౌజు తొడుక్కొని యీ పని చేస్తే వేలిముద్రలు పడే అవకాశం లేదు. కానిస్టేబుల్ తోటలో దొరికిందని చెప్పి, పగలకొట్టబడిన తాళం కప్ప తీసుకొచ్చి యిచ్చేరు.

"మీకు శత్రువులెవరేనా వున్నారా?"

"తెలిసీ ఎవరూ లేరు. తెలియకుండా వున్నవారి సంగతి నాకు తెలియదు"

"మీ దగ్గర రివాల్వర్ వున్న సంగతి ఎంతమందికి తెలుసు?"

"నౌకరికి, జితేంద్రకి తెలుసు"

"జితేంద్ర ఎవరు?"

"ఫేమిలీ ఫ్రెండ్"

"అతని మీద మీ అభిప్రాయం?"

"ఏమో! ఎవర్నీ నమ్మలేని గడ్డురోజులివి. జరగకూడనివి జరిగినా ఆశ్చర్యంలేదు."

"సరే! మీ నౌకర్ని ఒకసారి పిలిపించండి. ప్రత్యేకంగా అతనితో మాట్లాడాలి."

టేబుల్ గడియారంలోని పెద్దముల్లు మరో పది నిమి
షాలు ముందుకు పోయింది.

2

"నీ పేరు ?" నౌకర్ని ప్రశ్నించేడు జలంధర్.

"ముసలయ్య" అని చెప్పేడు.

"చూడు ముసలయ్యా ! యీ మధ్య మీ అమ్మగారితో ఎవరేనా ఘర్షణ పడ్డారా ? బాగా ఆలోచించి చెప్పు."

"జితేంద్రబాబుతో ఘర్షణ పడటం నాకు తెలుసండి"

"జితేంద్రబాబెవరు ?"

"అమ్మగారికి మురళి అనే అన్నయ్య వుండేవారు. పాపం ఈ మధ్య ఓ ఏక్సిడెంట్‌లో చనిపోయేరు. మురళిబాబు, జితేంద్రబాబు మంచి స్నేహితులు. తరచు యింటికి వస్తుండేవాడు. మురళిబాబుకి భయపడి, అమ్మాయిగారు, అతనూ ఉత్తరాల్లోనే ఎక్కువగా కలుసుకునేవారు. వారిద్దరూ ప్రేమించుకున్న సంగతి నాకు మాత్రం తెలుసు. కాని ఏం జరిగిందో కాని, ఘర్షణ పడ్డారిద్దరూ."

"ఘర్షణ ఎందుకు జరిగిందో తెలుసా ?"

"కొన్ని ముక్కలు నా చెవిలోపడ్డాయి. అమ్మగారు తనని పెళ్ళి చేసుకోమన్నారు. తనకలాంటి ఉద్దేశం ఎప్పుడూ లేదన్నాడతను. అతను రాసిన ఉత్తరాలు తన దగ్గరున్నాయనీ, వాటితో అతని పరువు తీస్తానని బెదిరించేరు అమ్మగారు. అదే జరిగితే నీ ప్రాణం తీయడం ఖాయమని హెచ్చరించేడతను"

"ఐ. సి" అంటూ జలంధర్ తల పంకించి "మరి మీ అమ్మగారి గదిలో నీ వేలిముద్రలు దొరికేయి. నువ్వు రివాల్వర్ దొంగిలించి జితేంద్రకి యిచ్చేవు. ఆ పని

చేసినందుకుగాను కొంత డబ్బు యిస్తానని ఆశ చూపించి వుంటాడు. అవునా ?'' బుకాయించేడు జలంధర్.

ఖంగుతిన్నాడు ముసలయ్య. ''నేను గదిలోకి వెళ్ళిన మాట అబద్ధం సార్ ! అమ్మగారు వూరికెళ్తానని చెప్పేక నాకూ వేరే పని వుండి వేరే వూరు వెళ్ళేను. తిరిగివచ్చే సరికి, యింటి తలుపులు తెరిచివున్నాయి. ఆశ్చర్య పోయాను. ఎవరూ కనిపించలేదు. అంతలో అమ్మగారు వచ్చేరు. అంతే।"

''యిట్సాల్ రైట్ । నువ్వింక వెళ్ళు" అన్నాడు.

టేబుల్ గడియారంలోని నిమిషాల ముల్లు చక చక పరుగులెడుతోంది.

3

''మీ పేరు జితేంద్ర. చనిపోయిన మురళి స్నేహితులు. అవునా ?"

కానిస్టేబుల్స్ని పంపి జితేంద్రని పిలిపించి ప్రశ్నించేడు జలంధర్.

జితేంద్రకి పాతికేళ్ళుంటాయి. తెల్లటి దేహచ్ఛాయ, కోల మొహం, ఉంగరాల జుట్టు, తొలి చూపులోనే ఆడవాళ్ళ గుండెల్లో గుబులురేపే గొప్ప పర్సనాలిటీ అతని ప్రత్యేకతలు.

తలూపేడు జితేంద్ర.

'మిస్ మణిమాలకీ, మీకూ ఏదో గొడవ జరిగింది.మీ గుట్టు బయట పెడతానని బెదిరించగా, అదే జరిగితే ఆమెను చంపుతానని హెచ్చరించేరు. అందుకే ఆమె లేని సమయంలో యింటి తాళం మారుతాళం చెవులతో

తెరచి రివాల్వర్ దొంగిలించి, ఆమె రివాల్వర్ తో ఆమెను హత్య చేయాలనుకున్నారు. కాని, దురదృష్ట వశాత్తూ రివాల్వర్ పోయిన విషయం వెంటనే బయట పడి పోయింది. ఏమంటారు ?'

'హెచ్చరించిన మాట వాస్తవమే. కాని, నా కటువంటి ఉద్దేశం లేదు. కేవలం భయపెట్టాలని అలా అన్నాను. రివాల్వర్ నేను దొంగిలించలేదు.

'మరి మీ కాలిముద్రలు యింటి ముందు గార్డెన్ లో కనిపించేయి. నిన్న వర్షం పడి నేల అంతా తడిగా ఉండడం వలన యిప్పటికీ మీ పాదముద్రలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.'

'మణిమాల వూరి నుండి తిరిగి వచ్చిందేమో అనుకున్నాను, తలుపుకి తాళం లేకపోవడంతో। కాని ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వెంటనే వెళ్ళిపోయాను. అప్పుడు నా పాదముద్రలు గార్డెన్ లో పడితే పడి ఉండవచ్చు' అన్నాడు జితేంద్ర.

'మిస్టర్ జితేంద్రా ! ఏదైనప్పటికీ రివాల్వర్ దొంగిలించాల్సిన అవసరం, అవకాశం మీకున్నాయి. నిజం చెప్పండి.'

జితేంద్ర మొహం ఎర్రబడింది:

'యిన్ స్పెక్టర్! యింతవరకు మీ హోదాకు గౌరవం యిచ్చేను. నన్ను దొంగను చేసి మాట్లాడి అవమానించకండి. నేనే రివాల్వర్ దొంగిలించినట్టు మీకేవేనా ఆధారాలు దొరికితే, చూపించి, ఏదైనా చేసుకోవచ్చు' అని చెప్పి గిర్రున తిరిగి వెళ్ళిపోయేడు.

జలంధర్ ఆలోచిస్తున్నాడు. ఈ కేసు అంతుతేల్చడం

ఎలాగో ఒక పట్టాన తెలియడం లేదతనికి.

టేబుల్ గడియారంలోని టైము మరోగంట ముందుకు పోయింది.

వ్యక్తిగతమైన పనిమీద హౌరా వెళ్ళి, మణిమాల తిరిగొచ్చేసరికి రివాల్వర్ మాయమైంది. ఎవరు తీసేరు? జితేంద్ర రివాల్వర్ దొంగిలించి, ఆరివాల్వర్‌తో ఆమెను చంపి తప్పించుకోవాలనుకున్నాడా? డబ్బుకి ఆశపడి ముసలయ్యే రివాల్వర్ దొంగిలించి జితేంద్రకి యిచ్చేడా?

ఇన్‌స్పెక్టర్ జలంధర్‌కు బుర్ర వేడెక్క సాగింది.

♦ ♦ ♦ ♦ ♦

[ఇదీ కథ. దీనిలోని రివాల్వర్ దొంగ ఎవరో మీరు కని పెట్టి వ్రాయండి. మీ సమాధానం ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి 7-9-79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం. డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు స్టాంపులు జతపరచాలి. మాకువచ్చిన జవాబులలో అత్యుత్తమ పరిశోధన చేసి ఇద్దరు పాఠకులకు చెరొక రు 25/- లు బహుమతిగా పంపుతాము. ఫలితాలు నవంబరు79నెల సంచికలో చూడండి. ఎడిటర్]

భూస్థాపితం

యస్. గీతారాణి

బాబుగారూ! మేస్త్రీ పిలుపుకు ఇన్‌స్పెక్టర్ రాజశేఖరం వులిక్కిపడ్డవాడిలా, తలతిప్పి చూసాడు.

నేలతవ్వుతుంటే గునపాలకి ఖంగ్‌మని ఏదో తగులుతున్నది బాబూ- నా అనుమానం నేల అడుగున

ఏదైనా....? మేస్త్రీ అనుమానంగా చూశాడు.

ఇన్‌స్పెక్టర్ భృకుటి ముడిపడింది. అతను తన ఇరవైఐదో ఏట క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా చేరాడు. ఇప్పుడతని వయస్సు నలభై. పదిహేను ఏళ్ళ సర్వీస్‌లో అతనెందరో హంతకుల్ని చట్టానికి అప్పగించాడు.

రాజశేఖరం అంటే దొంగలకి హంతకులకి సింహస్వప్నం. అలాంటి అతను ఒకేఒక్క కేసులో....

"బాబుగారూ!" మేస్త్రీ పిలుపుకు రాజశేఖరం కూర్చున్న చోటునుంచి నిలబడి "పద" అన్నాడు.

కూలీలు నేలని గునపాలతో పొడుస్తున్నారు. గునపం భూమిలోకి దిగగానే లోపల ఖంగ్‌మని ధ్వని చేస్తోంది.

"చూసారా!" అన్నాడు మేస్త్రి.

"ఆ శబ్దం వస్తున్న చోటగాక, కొంచెం ప్రక్కగా తవ్వండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కూలీలతో.

అంతా ఇన్‌స్పెక్టర్ చెప్పినట్టే తవ్వటం మొదలెట్టారు.

పది నిముషాలు.... పదిహేను నిమిషాలు గడిచాయి. కూలీలు తవ్వుతున్నారు.

వాళ్ళ శ్రమ ఫలించింది.

బయల్పడిందో చెవర్‌లెట్ కారు. బాగా తుప్పు పట్టివుంది.

స్థాణువైనాడిన్‌స్పెక్టర్ రాజశేఖరం.

తను కొనుక్కున్న ఇంటి జాగాలో కారు పాతిపెట్టబడి వుందా! ఈ నేల మట్టంలోకి కారుఎలా వచ్చింది? ఎవరు గుప్త పరచారు దీన్ని!

"ఎంత సిత్రంగావుంది: మణులు మసిబొగ్గులు

ఇంకా ఏవో ధొరుకుతాయి మట్టిలో. కాని కారు దొర కటం.... మేస్త్రీ నోరు తెరుచుకొంది ఆశ్చర్యంతో.

రాజశేఖరం కారు దగ్గరకి నడిచాడు. దాని రంగు ఆకాశరంగు. అక్కడక్కడ గాఢంగా కన్పిస్తుంది రంగు.

అతను కారు డోరుపై చెయ్యివేసి తెరవటానికి ప్రయత్నించాడు. తెరుచుకోలేదు. మరికాస్త గట్టిగా లాగాడు. బాగా తుప్పుపట్టి ఉండటంతో తలుపు రావడం లేదు.

"ఓ నలుగురిలా రండి. తలుపుతీద్దాం!" అని కూలీలని పిల్చాడు.

ఆరుగురు కూలీలువచ్చి, కష్టంమీద డోర్ తెరిచారు.

సీటుమీద మట్టిలో అస్తి పంజరం.

కూలీలు భయంగా బిగుసుకుపోయారు.

ఇద్దరు ముగ్గురు కెవ్వుమన్నారు.

రాజశేఖరం కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

భూమిలోంచి కారు బయటపడటం, కారులో అస్తి పంజరం హారిబుల్. అతను డోరుదగ్గరగా వెళ్ళి అస్తి పంజరాన్ని పరీక్షించాడు.

అస్తిపంజరం మెడలో పొడవాటి బంగారు గొలుసు వేల్లాడుతున్నది. దానికి అతుక్కొని పెద్ద పెద్ద మంగళ సూత్రాలు. అది ఒక స్త్రీ అస్తిపంజరం అని అర్థమయింది రాజశేఖరానికి.

ఈ కారు ఎవరిది? కారులో అస్తిపంజరం దేనికి వుంది?

రాజశేఖరం కారు వెనక్కి వెళ్ళి నెంబర్ చూసాడు.

ఏ. పి. కె. 4534.

నిశ్చేష్టుడైనాడు రాజశేఖరం.

మళ్ళీ మరోసారి ఆ నెంబర్‌ని చూసాడు.

సందేహం లేదు. అదే నెంబర్. ఆ నెంబర్‌ని తను ఎప్పటికి మరచిపోలేడు. ఆ నెంబరే తన అసమర్థతని పేపర్లలోకి ఎక్కించింది. ఆ నెంబరే తను ఒక కేసులో అపజయం పొందేలా చేసింది. ఆ నెంబరే ఒక హంతకుణ్ని పదిహేను ఏళ్లుగా తన కడుపులో దాచుకొంది.

ఇనస్పెక్టర్ రాజశేఖరానికి గతం స్ఫురణకి వచ్చింది.

2

,,నమస్తే!''

ఇనస్పెక్టర్ రాజశేఖరం చూస్తున్న ఫైల్ మూసేసి ఆ అపరిచిత వ్యక్తిని చూసాడు.

నల్లటి టెరీకాటన్ ఫాంటు, దానిమీద నల్లని షర్ట్ టక్ చేసాడు. గెడ్డం ఇంచుమించు మూడంగుళాల పొడవుంది. వెడల్పయిన సైడ్‌లాక్స్ గెడ్డంతో పాటే కలిసిపోయాయి. వత్తయిన కనుబొమలు, దుబ్బుమీసం. మనిషి రంగుకూడా నలుపే.

,,కూర్చోండి'' కుర్చీ చూపించాడు.

,,నా పేరు మహేందర్'' అతను కూర్చుంటూ అన్నాడు.

,,ఆఁహాఁ'' తలూపాడు.

,,నేను ఎల్ ఐ సి ఆఫీసులో వర్క్ చేస్తున్నాను. నేనూ, జయా ప్రేమించుకొన్నాం. జయ ఎంతో మంచి

పిల్ల. తన్ని ప్రాణంగా ప్రేమించాను నేను. కాని వుద్యోగం పనిమీద హైదరాబాద్ వెళ్ళాల్సి వచ్చింది. రెండు నెలలున్నాను. ఈ రెండు నెలల్లో నెల్లాళ్ళే నాకు, జయకి మధ్య లెటర్స్ జరిగాయి. ఆతరువాత హఠాత్తుగా జయ దగ్గరనుంచి నాకు లెటర్స్ రావటం మానేశాయి. ఎన్నో లెటర్స్ వ్రాసాను. వాటికి ఆమె వద్దనుండి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. నా పని కాగానే విజయవాడ వచ్చేసాను. జయ ఇంటికి వెళ్లాను. ఆమె ఇంటికి తాళం పెట్టి వుంది.

జయ ఏమైందో ఎవరికి తెలియదనేశారు. నాకు పిచ్చెక్కినట్లయింది. వుద్యోగం వదిలేసి నెలల తరబడి వూళ్ల తిరగటం మొదలెట్టాను, నా జయ కన్పిస్తుందేమో ననే ఆశతో. ఇక్కడ నేను తిరగని రోడ్డు లేదు. నిన్న నా అదృష్టవశాత్తు జయ ఫ్రెండ్ ఒకామె కన్పించింది. ఆవిణ్ని జయతో ఒకటి, రెండుసార్లు చూసాను. ఆవిడని జయ గురించి అడిగాను.

జయని గురించి వివరాలేవి తనకి తెలియవంది. కాని, జయ ఇప్పుడుంటున్న ఇల్లు పోలీస్‌స్టేషన్ రోడ్‌కి దగ్గర్లో వుండొచ్చని చెప్పింది." అని మహేందర్ ఫాంట్ జేబు లోంచి కర్చీఫ్ తీసి, నుదుటిని పట్టిన చెమటలు సునిశితంగా తుడుచుకొని, దాన్ని తిరిగి యధాస్థానంలో పెట్టేసి ఇనస్పెక్టర్ ముఖంలోకి చూసాడు.

"ప్లీజ్! ఈ చుట్టుపట్ల జయ అనే యువతి వుంటే మీకు తెలిస్తే చెప్పగలరా!" అతని ఆతృత చూస్తుంటే ఇనస్పెక్టర్‌కి నవ్వొచ్చింది.

క్షణం ఆలోచించాడు.

ఇక్కడున్నది ఒకే ఒక్క జయ. ఆమె అర్జునరావు భార్య. అతను వుంటున్నది పోలీస్ స్టేషన్ రోడ్డులో కాదు. ఈ రోడ్ కవతలి రోడ్ లో.

అయినా జయ పెళ్ళికానిదని అంటున్నాడీ మహేందర్.

"మిస్టర్ మహేందర్! ఇక్కడ మీరు చెప్పే జయా అనే అమ్మాయి లేదు. ఈ ప్రక్క రోడ్‌లో జయ అనే ఆవిడ వుంది. కానీ ఆవిడ మేరీడ్" చెప్పాడినస్పెక్టర్.

మహేందర్ కనుబొమలు ముడిపడ్డాయి;

జేబులోంచి ఓ మనీపర్స్ తీసి, దానిలోంచి ఫోటోతీసి ఇనస్పెక్టర్‌కి చూపించి. "ఈ అమ్మాయి జయ అన్నాడు.

'యస్. ఈవిడే మిసెస్ అర్జున్" అన్నా డినస్పెక్టర్. మహేందర్ కళ్ళు చింత నిప్పుల్లా మెరిశాయి.

'నో నేను నమ్మను. జయ పుట్టింది నా కోసం. ఆమె నన్ను తప్పించి మరో వ్యక్తిని పెళ్ళాడనని మాటిచ్చింది

'ఇవ్వవచ్చు. కాని పరిస్థితులు!'

'ఇనస్పెక్టర్! మీరు కచ్చితంగా ఈమె మిసెస్ అర్జున్ అని చెప్పగలరా!' అతను సందేహంగా అన్నాడు.

'పరిశోధకుల కళ్ళు పొరపాటుపడవు మిష్టర్ మహేందర్. ఈమెను అర్జునరావుతో ఒకటి రెండు పర్యాయాలు చూసాను.'

మహేందర్ పిడికిలి బిగుసుకొంది.

'దర్టీ వుమెన్, నన్ను ప్రేమించి మరొకణ్ని పెళ్ళాడు తుందా! దాన్ని..........దాన్ని బ్రతక నియ్యను. చంపేస్తాను.' ఆవేశంతో అతని దవడ ఎముక బిగుసుకొంది.

'ఆవేశ పడొద్దు. ఏ కారణాంతరాల వల్ల ఆమె అతన్ని పెళ్ళాడిందో !'

చురుగ్గా చూసాడు.

'నాకుండకూడదా కారణాలు. నే నెలా ఆమె కోసమే జీవించి వున్నాను. ఆమె అలా వుండ గలిగిందా! ప్రేమ ఒకరితో పెళ్ళి ఒకరితోనా !' అతను ఆవేశంగా లేచి నిల్చున్నాడు.

'మిస్టర్ మహేందర్ ! తొందర పడకండి. ఆమెని కల్సి కారణాలు తెల్సుకోండి. ఆమెది ఏ పొరపాటు లేకపోతే ఒక సోదరిగా ఆరాధించండి. ఈ రోడ్ కవ తల రోడ్‌లో ఆఖరి ఇల్లే ఆవిడది,' అన్నాడినస్పెక్టర్.

మహేందర్ అతని మాటలు వినిపించు కొన్నాడో లేదో గాని, వడి వడిగా వెళ్ళి పోయాడు.

'చిత్రమైన వ్యక్తి' అనుకొన్నాడినస్పెక్టర్ రాజ శేఖరం భుజా లెగరవేసి.

* * *

ఇంటికి బయలు దేర బోతున్నాడినస్పెక్టర్ రాజ శేఖరం. అంతలో టెలిఫోన్ మ్రోగింది.

విసుగ్గా ఫోన్ తీసాడు.

'హలో, ఇనస్పెక్టర్ రాజశేఖరం స్పీకింగ్ !' అన్నాడు.

'సార్ ! ఈ రోడ్ కవతల రోడ్‌లో ఆఖరి యింట్లో ఒక హత్య జరిగిందని నా అనుమానం. నమ్మకం కూడా-'

'వ్వాట్ ?' అదరి పడ్డాడు.

'మీ రెవరు ? ఎక్కడ నుంచి మాట్లాడు తున్నారు.' అడిగాడు.

'నా పేరు కరుణాకరం. కరుణా ఫ్యాన్సీషాపు ప్రొప్రయిటర్ని. మీరు అర్జెంటుగా రావాలి' అతని గొంతు చాలా గాబరాగా వుంది.

'ఇప్పుడే వస్తాను' ఇనస్పెక్టర్ ఫోన్ పెట్టేసి, సార్జెంట్ని కేకవేసి పిల్చాడు. జీప్ రెడీ చెయ్యమన్నాడు.

జీప్ పది నిముషాలలో అర్జునరావు ఇంటి ముందర ఆగింది. ఇంటిచూట్టూ జనం పోగై వున్నారు. ఇనస్పెక్టర్ని చూడగానే అంతా అటూ యిటూ చెదరి అతనికి దారి ఇచ్చారు.

తలుపులు బార్లా తెరచి వున్నాయి. ఇన్స్పెక్టర్ లోపలికి అడుగు పెట్టాడు. పెద్ద హాలది. హాలుకి ఎడం వైపు, కుడివైపు గదులున్నాయి. అతను అంతా పరీక్షగా చూస్తుండగా ఓ యువకుడు ఇనస్పెక్టర్ ముందుకు వచ్చాడు.

'నమస్తె ! నా పేరే కరుణాకరం' అన్నాడు.

పరీక్షగా చూసాడినస్పెక్టర్.

వైట్ఫాంట్, వైట్షర్టు ధరించాడు. వెనక్కిదువ్విన జుత్తు, కళ్ళకి చత్వారపు జోడు. పెద్దతరహాగా కన్పిస్తున్నాడు.

'చెప్పండి' అన్నాడినస్పెక్టర్.

'అరగంటక్రితం నేను షాపు మూసేసి, బయటకొచ్చి సిగరెట్ వెల్గించాను. అంతలో ఓ చెవర్లైట్ కారు అర్జునరావు ఇంటిముందర ఆగింది. నా చేతిలో లైటర్ వెలుగు తుండగా ఆ కారు నెంబర్ చూసాను. ఏ.పి. కె

4534 కారులోంచి ఓ యువకుడు దిగాడు.'

'అతనెలా వున్నాడో చెప్పగలరా?' ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

పొడవైన విగ్రహం. నల్లటి డ్రెస్. సైడ్‌లాక్స్, గెడ్డం కల్సిపోయివుంది.

ఆ పోలికలు మహేందర్‌కి వున్నాయి.

"తరువాత జరిగింది చెప్పండి!" అన్నాడు.

"ఆ యువకుడు అటూ, ఇటూ చూసి జయ ఇంటి వైపు నడక సాగించాడు"

"మీ కతని ప్రవర్తన మీద అనుమానం రాలేదా?" కరుణాకరం తమాషాగా నవ్వాడు.

"ఆవిడ అంత మంచిదికాదు పాపం ఆ భర్త వట్టి అమాయకుడు. ఎప్పుడూ క్యాంప్‌లకి పోతుంటాడు. ఆయన అటు వెళ్ళగానే ఆవిడ తన కిష్టమైనవార్ని...." అర్థోక్తిగా నవ్వాడు.

"తరవాత!"

"అతను తలుపు కొట్టాడు. రెండు నిముషాలకి తలుపు తెరుచుకొంది. అతను మరీ పొడగరి కావటంతో ఆమె నాకు కన్పించలేదు. అతను చొరవగా లోపలికి వెళ్ళాడు. తలుపు మూసుకొంది.

ఎప్పటి బాగోతమే అనుకొని, నేను ఇంటికి బయలుదేరబోయాను. కాని జయ అరుపు కెవ్వున విన్పించింది. నాలో క్యూరియాసిటీ బయలుదేరింది. ఆ వచ్చిన వ్యక్తి ఆమె ప్రియుడు కాదేమో అనే అనుమానం మొలకెత్తింది. ఆమె అతన్ని లోపలికి ఆహ్వానించిందా? అతనే లోపలికి వెళ్ళాడా? ఇలా ఆలోచించాను. మరో



మూడు నిమిషాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి.

వున్నట్లుండి జయ కేకవేసింది. ఆ కేక సామాన్యంగా లేదు. హృదయ విదారకంగా, పిడిపాకు దెబ్బతిన్నట్లుగా వుంది. భయపడ్డాను. అతను జయని ఏమైనా చేస్తున్నాడా! ఓసారి వెళ్తే! అనుకొన్నా. ధైర్యం చాలలేదు. నా షాపు తెరచి మీకు ఫోన్ చేసి- బయట నిల్చున్నాను.

యీలోగా ఆ ఇంటి తలుపులు తెరుచుకొన్నాయి అతను బయటికి వచ్చాడు అతని చేతులు రక్తసిక్తమై వున్నాయి. గజగజ వణికిపోయాను.

అతను జేబులోంచి సిగరేట్ తీసి వెలిగించి, క్షణం సేపు దీర్ఘంగా ఆలోచించి, కారుని ఇంటివెనక్కి నడిపాడు.

నేను గబగబ వెనక్కి వెళ్ళి, ఓ పొద చాటున నక్కి గమనించాను. అప్పటికే అతను పెరటి తలుపులు దగ్గరగా వేస్తున్నాడు. పెద్ద పెద్ద అంగలేస్తూ కారు దగ్గరకి వెళ్ళి ఓ సారి డోర్ తెరిచాడు. పైన పుచ్చ పువ్వ

లాంటి వెన్నల కార్లో జయ రూపాన్ని చూపించింది. నిద్ర పోతోందామె. అతను విషపూరిత దరహాసం చేసి, కారు ఎక్కి స్టార్ట్ చేసాడు.

ఆ కారు వెళ్ళిపోయాక చుట్టుపట్ల వార్ని లేపి. జరిగిందంతా చెప్పాను. అంతా పెరటిలోంచి లోపలికి వెళ్ళి చూసాం. వీధి తలుపు గడియ పెట్టి ఉంది. జయ గదిలో నేల మీద, పరుపు మీద రక్తపు మరకలు కన్పించాయి' మాలో మేం చర్చించుకొంటుండగా మీరు వచ్చారు'. చెప్పటం ముగించాడు కరుణాకరం.

ఇన్స్పెక్టర్ లోపలికి వెళ్ళాడు. జయ గదిలోకి నడిచాడు. గదిలో చాలా సామానులు చిందర వందరగా నేలపై పడి వున్నాయి. నేల మీద, పరుపు మీద చిక్కటి రక్తపు మరకలున్నాయి.

హంతకుడికి, జయకి మధ్య యుద్ధం జ రి గి ం ద ని వూహించా డినస్పెక్టర్. మరోసారి గది నంతటిని పరీక్షించి, హాల్లోకి వచ్చాడు, బల్లపై వున్న టె లి ఫో న్ దగ్గరకి వెళ్ళి, ఫింగర్ ప్రింట్ ఎక్స్ పర్టకి. ఫోటో గ్రాఫరుకి ఫోన్ చేసాడు.

* * *

ఆ యింట్లో హంతకుని పట్టిచ్చేందుకు సాక్ష్యాలేవి లభించలేదు. జయని చంపేటప్పుడు హంతకుడు గ్లోవ్స్ వుపయోగించి వుండొచ్చు. క్రిందపడిన వస్తువుల మీద కూడా వ్రేలి ముద్రలు దొరకలేదు.

హంతకుడు మహేందర్ అనేది స్పష్టమైంది.

మహేందర్ అనే వ్యక్తి ఎల్ ఐ సి ఆఫీసులో పన్చేస్తాడు. అతను ఏకారణాంతరాల వల్లనో ఆర్నెల్ల క్రితమే వుద్యోగానికి రాజీనామా ఇచ్చేసి వెళ్ళిపోయాడట

అతని ఇల్లు గాంధీనగరం రోడ్డులో. అతనికి స్నేహితులు లేరు. బంధువులంతకన్నా లేరు. చుట్టుపట్ల వారికి అతన్ని గురించి వినమంతైనా తెలియదనేశారట. అసలు అతను ఇంటికి నెలకోసారి, రెండునెల్లకోసారి వచ్చేవాడట. అదీ రాత్రివేళలో. పోనీ ఇంటిగల వ్యక్తుల ద్వారా ఏమైనా తెలుస్తుందా అంటే .వాళ్ళు మలేషియా వాస్తవ్యులు.

ఇనస్పెక్టర్ రాజశేఖరానికి చాలా కలపరంగా అన్పించిందా కేసు.

ఓ నాలుగురోజులకి జయ భర్త అర్జునరావు కేంపు నుంచి ఇంటికి వచ్చాడు. భార్య హత్య గావించ బడిందని తెల్సి, అతను గుండెలు బాదుకొంటూ ఇనస్పెక్టరు దగ్గరకు వచ్చాడు.

రాజశేఖరం అతన్ని ఓదార్చి మహేందర్ గూర్చి వివరాలు బయట పెట్టాడు.

అర్జునరావు నమ్మలేదు. నా భార్యకి మరో యువకునితో సంబంధ ముందంటే నమ్మలేకపోతున్నా ఇనెస్పెక్టర్. ఆమె నాతో తప్పించి, మరో పురుషునితో మాట్లాడటం చూళ్ళేదు నేను' అన్నాడు అమాయకంగా.

జాలేసింది ఇనస్పెక్టర్కి భార్యమీద అతని నమ్మకం చూస్తుంటే.

"మీ భార్యని హత్య చేసిన హంతకుణ్ని ఉరికంబం ఎక్కించి తీరుతాను," అన్నాడిస్పెక్టర్.

సార్జెంట్ని పంపి ఏ. పి. కె. 4534 నెంబర్గల కారు గురించి ఎంక్వయరీ చెయ్యమన్నాడు.

అది కరెక్టు నంబర్ కాదు. హంతకుడు అపూర్వమైన మేథ గలవాడు. దొంగ నంబర్ ప్లేటు వుపయోగించాడు. జయశవం ఏ ప్రాంతంలోనైనా దొరికితే దాని ద్వారా ఏదైనా క్లూ లభిస్తుందని, ఆమె శవంకోసం ఎదురు చూసాడు.

రోజులు గడిచిపోయాయి, నెలలు... సంవత్సరాలు దొర్లిపోయాయి. జయశవం దొరకలేదు. ఆమె హత్యకేసు-ఫైలులోకి ఎక్కి ఓ మూల పడింది పేపర్స్ ఇనస్పెక్టర్ చేతకాని తనాన్ని చాటిచెప్పాయి. పై ఆఫీసర్లు అతనికి పదునైన బుర్రలేదని. అతన్ని స్థానంలోనే వుంచేసారు.

చాలా కృంగిపోయాడతను. మహేందర్ ఎక్కడైనా కన్పిస్తే కాల్చిపారేద్దామన్నంత కసిగా వుండేది. తన్ని అసమర్థుడిగా అందరిముందు నిలబెట్టిన జయహత్యకేసు ఏనాటికైనా చట్టం ముందర నిలబెట్టి, తన సమర్థతని నిలుపుకోవాలనే కోరిక మాత్రమే అతనిలోవుంది.

3

తిరిగి పదిహేను ఏళ్ళ తరువాత-అదే చెవర్లెట్ కారు, అదే నెంబరు అతని కళ్ళపడింది. అందులో అస్థిపంజరం ఎవరిదో కాదు జయది.

జయ హత్యకేసుఫైలు తీయించాడు. అంతా అతన్ని జాలిగా చూసారు. మరోసారి ఓటమిని చూడాలను కొంటున్నాడన్నట్లు.

ఆలోచనలతో తల బద్దలుగొట్టుకుంటుంటే సార్జెంట్ లోపలికి వచ్చాడు.

'సార్! జయ అస్థిపంజరం చుట్టూ మట్టిని తొల



గిస్తుంటే మన వాళ్ళకి ఈ రింగ్ దొరికిందట. జయదై వుండాలి'

"ఏదీ" నీరసంగా చెయ్యి చాపి, రింగ్‌ని అందుకొని చూసాడు. రెండు రంగుల పొళ్ళ మీద మెరుస్తున్న అక్షరాలు జయా అని. ఆ రింగ్ మహేందర్ దే. ఆ రోజు పోలీస్ స్టేషన్‌లో అతని వ్రేలికి చూశాడు తను.

ఇనస్పెక్టర్ ఆ రింగ్‌ని వెనక్కి తిప్పాడు. వెనక ఎన్. పి. అనే అక్షరాలున్నాయి. అతను సార్జెంట్ వైపు చూశాడు.

జయ అనే అక్షరాలు హతురాలి పేరు. మరి ఎన్. పి" అన్నాడు.

తల గోక్కున్నాడు సార్జెంట్. తెలియట్లేదు సార్: అన్నాడు.

ఇనస్పెక్టర్ రాజశేఖరం క్షణం దీర్ఘంగా ఆలోచించి

ఈ వూళ్ళో ఎన్ని బంగారు షాపులున్నాయో చెప్ప గలవా ! అని అడిగాడు.

వెంటనే చెప్పటం కష్టం.

నిజమే. నువ్వు మన వూళ్ళో ఎన్ని బంగారు షాపులు వున్నాయో, వాటన్నిటి పేర్లు సంపాదించి నా కివ్వు. ఇదంతా చాలా క్విక్‌గా జరగాలి.

అలాగే సార్ ! కాని ఈ రింగ్‌కి, బంగారు షాపు లకి లంకె ఏమిటో ? సార్జెంట్ అడిగిన ప్రశ్నకి జవాబివ్వలేదు ఇనస్పెక్టర్. ఏదో లోతుగా ఆలోచిస్తు న్నాడు.

4

నారాయణ పిళ్ళె షాపు ముందు జీప్ ఆగింది. దాని లోంచి ఇనస్పెక్టర్ రాజశేఖరం, సార్జెంట్ క్రిందకి దిగారు.

వణక్కుం సార్ ! నారాయణ పిళ్ళె చేతులు పిసుక్కుంటూ నిల్చున్నాడు.

ఇనస్పెక్టర్‌ని, సార్జెంట్‌ని కూర్చోబెట్టి, పని కుర్రాడి చేత డ్రింక్స్ తెప్పించి ఇచ్చాడు.

ఇనస్పెక్టర్ డ్రింక్ తీసుకున్నాక, తన జేబు లోంచి రింగ్ తీసాడు.

దీన్ని మీరే తయారు చేసారు కదూ ! అని అడిగాడు.

నారాయణ పిళ్ళె ఆ రింగ్ అందుకొని వెనక్కి తిప్పి చూసాడు.

ఎన్. పి. అంటే నారాయణ పిళ్ళె. నా పేరే చెక్కు

కున్నాను. నాకలవాటు పేరు చెక్కటం ఇకిలించాడతను.

ఈ రింగ్ మీ కష్టమర్ జయది. ఆవిడే చేయించారా ఈ రింగ్?

ఇంకెక్కడి జయ సార్. ఆవిడ పోయి ఇప్పటికి పదిహేను ఏళ్ళవుతోంది. ఆమెని ఎవరో మర్డర్ చేసే సారు విచారంగా ముఖం పెట్టాడతను.

సరిగ్గా ఆలోచించి చెప్పండి. ఇది జయ చేయించింది కదా! ఎవరికైనా ప్రెజేంట్ ఇవ్వాలంటా!

ఆవిడ కాదు సార్! అర్జునరావుబాబు చేయించారు. ఆయనకి జయమ్మంటే ప్రాణం! అయమ్మ పేరు వుంగరంలో చెక్కించుకున్నారాయన.

ఇనస్పెక్టర్ రాజశేఖరం షాక్ తిన్నాడు.

జయ భర్త అర్జునరావుదా ఈ రింగ్! తను మహేందర్ దగ్గర చూసాడే ఈ రింగ్. మహేందర్ వేలికున్న రింగ్ అర్జునరావుదెలా అయింది? ఈ నారాయణ పిళ్ళే అర్జునరావు చేయించుకొన్నాడంటున్నాడేమిటి?

రాజశేఖరం లేచి నిల్చున్నాడు.

"అర్జునరావు ఆ ఇంట్లోనే వుంటున్నాడా, ఇల్లు మార్చాడా?" అడిగాడు.

"మార్చలేదు సార్. అది అయన స్వంత బంగ్లా"

5

యూ ఆర్ అండర అరెస్ట్, మిస్టర్ అర్జునరావు?

లాన్‌లో కూర్చొని పేపర్ చూస్తున్నతను అంతెత్తున తృళ్ళిపడ్డాడు.

నన్ను అరెస్ట్ చేస్తారా ! ఎం ? ఎందుకు ?

పదిహేనేళ్ళ క్రితం, నీ భార్య జయని హత్య చేసి నందుకు !

నో, నో. కీచుగా అర్చాడు.

తీక్షణంగా చూసాడినస్పెక్టర్.

'అర్జునరావ్ ! పదిహేనేళ్ళ క్రిందట నువ్ మహేందర్ పేరుతో నా దగ్గరకి వచ్చావు.' ఇనస్పెక్టర్ జేబులోంచి రింగ్ తీసాడు.

'నువ్ జయ ప్రియుణ్నని చెప్పావు. ఆ అమ్మాయి యిల్లు కావాలని అడిగి ఫోటో చూపించావు. అప్పుడు నీ చేతి వేలికి ఈ రింగ్ చూసాను' రింగ్ చూపించాడినస్పెక్టర్.

దాన్ని చూడగానే అర్జునరావు ముఖం పాలిపోయింది.

'చాలా మేధతో, ప్రీ ప్లాన్ వేసి జయని చంపావు. నీ భార్య మామూలుగా హత్య చెయ్యబడితే పోలీసుల అనుమానం నీ మీదకి వచ్చి తీరుతుందని, మహేందర్ అనే వ్యక్తిని సృష్టించావు. పరిశోధకుడినైన నన్నే చిత్తుగా నమ్మించావు. మహేందర్ అనే వ్యక్తి హంతకుడని లోకమే కాదు, నేనూ నమ్మాను.

నేనా రోజు జయ భర్త అర్జునరావు అని చెప్పగానే ఆమెని చంపేస్తానని రెచ్చి పోయావు. ఆ రాత్రే హత్య జరిగింది. కరుణాకరాన్ని నువ్ చూసావ్. కావాలనే చక్కటి ఎలిబీ సృష్టించుకొన్నావ్. అతను నాకు చెప్పాడు. జయని హత్య చేసిన హంతకుడి పోలికలు చెప్పాడు. ఆ పోలికలు మహేందర్‌వే. లేని వ్యక్తిని సృష్టించావ్. ఎలా దొరుకుతాడు హంతకుడు.

పదిహేను ఏళ్ళు నేను చట్టం దృష్టిలో అసమర్థుడిగా నిలిచి పోయాను. నువ్ నిర్దోషివై పోయావు. పదిహేనేళ్ళ క్రితం నువ్ జయ శవాన్ని కారుతో సహా పాతి పెట్టిన జాగాని ఈ మధ్య నేను కొన్నాను. కారు, జయ అస్తిపంజరం, దాంతో పాటే నువ్ ఆమెమీద ప్రేమతో చేయించుకొన్న రింగ్ బయట పడ్డాయి.

'మిస్టర్ అర్జునరావ్ ! ఎంత తెలివిగా హత్య చేసినా, చట్టం దృష్టిలోంచి ఎంతోకాలం తప్పించుకోలేరు. ఈ రింగ్ నిన్ను పట్టించింది. ఇది తయారు చేసిన షాపు యజమాని నారాయణ పిళ్ళే అందుకు ప్రత్యక్ష సాక్షి !' ఇనస్పెక్టర్ బేడీలు పైకి తీసాడు.

అర్జునరావు కళ్ళలోంచి కన్నీళ్ళు జల జల రాలి పడ్డాయి.

'ఇనస్పెక్టర్। జయని ప్రాణంగా ప్రేమించాను పెళ్ళి చేసుకొన్నాను. కాని పెండ్లికి ముందు విధి వక్రించి ఓ ఎక్సిడెంట్ జరిగి సంతానం కల్గే అదృష్టాన్ని పోగొట్టు కొన్నాను. జయకి ఆసంగతి తెలిస్తే నన్ను అసహ్యించు కొంటుందని భయపడ్డాను. నిజాన్ని దాచి పెళ్ళి చేసేసు కొన్నాను.

తనే లోకమై పోయింది. నా ప్రాణం కన్నా ఎక్కు వని భావించే వాణ్ని. కాని జయ వయలు కురిపిస్తూ ఓ రోజు తను తల్లిని కాబోతున్నానని చెప్పింది. నాలో అగ్ని పర్వతాలు బ్రద్దలయాయి. జయ కడుపులో పెరి గేది నా సంతానం కాదని. ఆమెకి మరో పురుషుడితో శారీరక సంభందం వుందని తెలిశాక, నాలో రాక్షసుడు మేల్కొన్నాడు.

జయని చంపెయ్యాలనే ఆ వేళం కల్గ సాగింది. అయితే పోలీసులు నా కీళ్ళు, కాళ్ళు విర్చేస్తారనితెలుసు ఆలోచించి ఈ ప్లాను వేసి దాన్ని చంపాను.

జయని చంపేసి, కారుతో పాటే భూస్థాపితం చేసిన ఎన్నాళ్ళకో గాని నాకు రింగ్ సంగతి గుర్తుకు రాలేదు. గుర్తు వచ్చినా, చనిపోతూ నా వేలిరింగ్ తన చేతుల్లో వుంచుకొని, ఆ దుర్మార్గురాలు నన్నినాళ్ళకి అప్పగిస్తుం దను కోలేదు-' అన్నాడతను ఆవేదనగా,

నకిలీ మనిషి

మోదుకూరి జితేంద్రశేఖర్

వెతుక్కుంటూ వచ్చేరా? అడిగాను.

అవును. అబ్దుల్ చెప్పాడు నీ సంగతి. నుదుటి మీద చమటను హాండ్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూ అన్నా

దతను. చాలా కష్టం అయింది ఈ ఎడ్రస్ పట్టు కోనటం.

చిన్నగా నవ్వాను.

అలానే ఉండాలి మా పంటి వాళ్ళం. ఏమిటి పని ?

పట్టు పడకుండా చేయాలీ పనిని. అన్నాడతను.

"అబ్దుల్ చెప్పలేదా నా సంగతి, పూర్తిగా !" అడి గాను.

చెప్పాడు. యింతవరకూ నీ వంటి బర్గ్లర్‌వి ఎక్కడా చూడలేదని, పట్టుపడకుండా అన్ని జాగ్రత్తలూ నువ్వు తీసుకునే పనిలోకి దిగుతావనీ. కాని యీ పని కొంచెం....కొంచెమేం బాగా ప్రమాదకరమైనది. అందు కని....

ఆలోచనలో పడికొద్దిసేపు ఉండిపోయాను.

నేనెవరో మీకు చెప్పను. అనవసరం కనక. మీకు కావల్సింది డబ్బు కనక మీ రేటు చెపితే....

అతని ఖరీదయిన గ్రే కలర్ సూట్‌నీ చేతికున్న ఒమేగా వాచీని. ఉంగరాలనీ చూసి నా రేట్ ముందుగానే నిశ్చయించుకొన్నాను. యిటువంటి వాళ్ళు చాలా డబ్బు ఖర్చు పెట్టగలరు.

పని తెలుసుకోకుండా రేటు చెప్పటం వ్యాపారస్థుల లక్షణం కాదు. అన్నాను.

చిన్నగా నవ్వి అన్నాడు. సరే చెప్తాను. సి. ఐ. టి. నగర్‌లో ఉన్న ఓ బంగాళాలో దొంగతనం చెయ్యాలి !

అతని నవ్వు అసహజంగా అనిపించింది.

ఏమిటి దొంగతనం చేయాలి నేను ?

నగ ! విలువైనది అది, వజ్రాలతో పొదగబడి

ఉంది. ఉమ్మిడియార్ అమ్మిన నగలలో విలువైన నగ అది ఒకటే.

దాని ఖరీదు ఎంత ఉంటుంది?

ఆరు లక్షలు....

మై గుడ్‌నెస్. సిక్స్ లాక్స్. అప్రయత్నంగా అన్నాను.

అవును. కొంచెం గర్వంగా అన్నాడు. ఆ నగ డిజయిన్ యిదిగో, కోటు జేబులోంచి డిజైన్ తీసి యిచ్చేడు. ఆ నగ విషయంలో మీరు పొరబడకుండా ముందు జాగ్రత్త కోసం.

ఆ డిజైన్‌ని చూస్తూ ఆశ్చర్యపోయాను. చాలా అందమైన నగ అయి ఉండాలి. యీ నగని దొంగిలించాలి ఎలాగైనా. వీలయితే స్వంతం చేసుకోవాలి కూడా.

పూర్తిగా వివరాలు చెప్పండి.

వెస్ట్ సి. ఐ. టి. నగర్‌లో ఉందా బంగళా. ఆబంగళా కింద స్టెయిర్స్‌కి యిరుప్రైపులా ఆరు గదులు ఉంటాయి. స్టెయిర్స్ క్రింద ఉంటుంది ఈ నగ ఉన్న సేఫ్ ఉన్న గది. పూజ గది అది. దేవుడి మండపం వెనక ఉంటుంది ఆ సేఫ్. చాలా పాతది. అయినా దానికి అన్ని ఆధునిక సౌకర్యాలూ అమర్చబడ్డాయ్.

కోడ్ తెలియందే ఆ సేఫ్ తెరవలేరెవరూ. కోడ్ తెలియకుండా కట్ చేసి తీసినా లోపల బర్గ్‌లరీ ఎలారం ఉంది. ఆ ఎలారం స్విచ్ ఆఫ్ చేయకుండా ఆ సేఫ్ తెరిస్తే, బర్గలరీ ఎలారం ఆ యింట్లోనూ, దగ్గరున్న పోలీసు స్టేషన్‌లోనూ ఒక్కసారి మ్రోగుతుంది. అంతే

కాదు ఆ సేఫ్ తలుపులకి ఎలక్ట్రిక్ సప్లయ్ ఉంది. తెలీక ముట్టుకుంటే షాక్ కొడుతుంది.

అరు లక్షల విలువ చేసే నగ ఆ సేఫ్‌లో ఉంది. అంతే కాదు ఆ నగని అక్కడ పెట్టే జాగా అ సేఫ్‌లో వేరే ఉంది. అది కూడా తెలుసుకోవాలి. అగాడతను.

చాలా కష్టమయిన పనే. అన్నాను.

"అవును, అందుకే నీ దగ్గరికి వచ్చింది."

"ఏంత యివ్వగలరు మీరు ?" అరు లక్షల రూపా యల విలువ చేసే నగని దొంగిలించడానికి ఎంత అడిగితే బావుంటుందో లెక్క వేసుకోసాగేను. మనసులో.

"యాభై వేలు."

తల అడ్డంగా ఊపాను.

"యాభై అయిదు."

అనంగీకారంగా పెదవి విరుపుతో అన్నాను. 'డెబ్బది అయిదు వేలు."

కొంచెం సేపు ఆలోచించి అన్నాడు. "సరే! ఎప్పటి కివ్వగలరు."

"యివేళ బుధవారం. వచ్చే అదివారం యిస్తాను."

"మళ్ళీ నేనిక్కడికి రాను. మీరే అదివారం తొమ్మిది గంటలకి సెంట్రల్‌కి రండి. అక్కడ ఏ. హెచ్. వీలర్స్ కంపెనీ పుస్తకాల షాప్ దగ్గర నిలబడండి. వీలయితే యిదే గళ్ళ షర్ట్ వేసుకురండి గుర్తుగా. నేను వచ్చి కలుసుకుంటాను. లేస్తూ అన్నాడు. బట్ నో ట్రిక్స్. ఒక వేళ పట్టుబడ్డా నా విషయం సీక్రెట్‌గా ఉంచాలి నువు. క్షణానికో విధంగా మారుతోంది అతని సంబోధన.



"పట్టు బడటమా?' నవ్వేను. అది జరగని పని. మీ విషయం సీక్రెట్‌గా ఉంచాలి. కష్టమర్స్ విషయం రహస్యంగా ఉంచుతాను.' అన్నాను.

"ఓకే. ఆదివారం తొమ్మిది గంటలకి సెంట్రల్‌లో కలుద్దాం. బెస్టాఫ్ లక్' గుమ్మం దాటుతూ అన్నాడు. "అబ్దుల్‌కి థాంక్స్ చెప్పాలి. ఈ పని పూర్తయితే.' వెళ్ళిపోయేడు.

ఆలోచిస్తూ కూర్చున్నాను.

చేతిలో డిజయిన్ చూస్తుంటే ఓ ఆలోచన తళుక్కుమని మెరిసింది.

ఈ డిజయిన్‌ని వదిలేసి నాకు మంచి ఆలోచనని యిచ్చినందుకు థాంక్స్ చెప్పుకున్నాను, అగ్రేకలర్ సూట్ వ్యక్తికి.

ఈ డిజయిన్‌తో ఓ నకిలీనగ తయారు చేయించి అదే అతనికి అప్ప జెప్పితే....

నాకు తెలిసిన గోల్డ్‌స్మిత్ ఉన్నాడు. నకిలీ నగలు అద్భుతంగా తయారు చేస్తాడు. చూడగానే పోల్చడం కష్టం ఎవరికైనా. అతని చేత చేయించి ఆ గ్రేకలర్ సూట్ వ్యక్తికి ఆ నకిలీ నగ యిచ్చి వేయాలి.

అలా అయితే, నేననుకున్నది నెరవేరినట్లయితే నాకు చాలా లాభం. సుమారు మూడు లక్షల డెబ్బై అయిదు వేలు. ఆ నగని సగం ధరకి అమ్మి వేసినా.

'నిజంగానే అబ్దుల్‌కి థాంక్స్ చెప్పాలి.' అనుకున్నాను.

2

రెండు రోజులు ఆ బంగళా ముందు కాపు వేశాను.

చాలా ధ న వం తు లు ఆ బంగళా ఓనర్స్ అనిపిస్తుంది ఆ బంగళాని చూస్తే. రెండు కార్లు ఉన్నాయి ఆ బంగళాలో. గేట్ దగ్గర్నుంచి ఇరవై మీటర్ల దూరం ఉంటుంది బంగళా. ఆ మధ్య దూరంలో చెట్లు నాటబడి ఉన్నాయ్. కార్ షెడ్స్. సర్వెంట్ క్వార్టర్స్ ఆ బంగళాని ఆనుకొనే ఉన్నాయి.

తోటమాలితో పరిచయం చేసుకున్నాను. తమిళనాడులో ప్రొహిబిషన్ లేని కాలంలో ఓ పెద్ద డ్రంకర్డ్ ఆ తోటమాలి. అటువంటి వాడ్ని ఎలా లొంగదీసుకోవాలో నాకు తెలుసు. ఆ సాయంత్రానికంతా నా చేతిలో రమ్ బాటిల్ని చూసి నాకు మంచి మిత్రుడై పోయేడు. ఆ తోట మాలి దగ్గర్నుంచే వివరాలు రాబట్టేను.

ఉదయం పది గంటలకి అమ్మ గారూ, అయ్యగారూ యిద్దరూ వెళ్ళి పోతార్ట. ఆ ఓనర్‌కి పిల్లల్లేరట. ఏదో సినిమాలు తీస్తాడట. మొదట్లో చాలా డబ్బుండేదట కానీ యిపుడులేదట. ఉదయం పది గంటలకి వెళ్ళిపోయి రాత్రి పది గంటలకి వస్తారిద్దరూ.

యింట్లో ఓ ముసలాయిన ఉంటాడు. అతను మంచం నుంచి లేవలేడుట. సాయింత్రాలు మాత్రం ఓ నౌకర్ సహాయంతో షైర్‌కెళ్తాట్ట.

అతను చెప్పిన దాన్ని బట్టిచాలా విచిత్రంగా ఆ బంగళాలో సాయంత్రం ఆరునుంచి తొమ్మిద్దాక ఎవరూ ఉండరు. తోట మాలి సర్వెంట్ క్వార్టర్స్‌కి వెళ్ళిపోతాట్ట. వంట వాడు బజారుకి పోతాట్ట. ముసలాయిన షైర్‌కి వెళతాడు. కాబట్టి అదే అనువైన సమయం నాకు.

శనివారం రాత్రి ఆ బంగళాలో జొరబడాలని నిశ్చయించుకున్నాను.

ఆరున్నర అవుతుండగా చీకట్లు పడ్డాయి. ఆ వీధి మలుపులో ఓ జనరేటర్ ఉంది. ఎలక్ట్రిసిటీ సప్లయ్ ఫ్లోట్‌ని రెగ్యులేట్ చేసే రెగ్యులేటర్. సి. ఐ.టి. నగర్ కాలనీలో ప్రశాంతంగా ఉంటుంది. జన సందోహం ఉండదు ఆ కాలనీలో.

జనరేటర్ దగ్గర ఉన్న ఫ్యూజ్‌లాగేసేను. ఒక్కసారి ఆ వీధంతా కరెంటు పోయింది. ఒక్క ఆ యింటిలోనే పోతే వాళ్ళు వెంటనే ఎలక్ట్రిసిటీ మనుషులను పిలవచ్చు. వీధంతా పోతే కొంచెంసేపు నిరీక్షిస్తారు. ఆ సమయం చాలు నాకు.

ఆ యింటికి వెళుతున్న టెలిఫోన్ తీగెలని కట్

చేసేసేను. పీఠంతా చీకటిగా ఉంది. నన్నెవరూ గమనించలేదు. తోటమాలి గేట్ వేసేసేడు. నేనిచ్చిన రమ్ బాటిల్‌లో రమ్ కొట్టేసి, తన క్వార్టర్స్‌లో పడుకొనుంటాడు ఈ పాటికి.

గోడ జంప్ చేసి ఆ యింటిలో ప్రవేశించాను.

మెట్ల క్రింద ఉన్న పూజగదిలో ప్రవేశించాను. దేవుడి మంటపంలో చుట్టూ నూనె దీపాల వెలుగులో దేవుడు చిరునవ్వు నవ్వుతున్నాడు.

నమస్కారం పెట్టి మంటపం వెనక్కి సేఫ్ దగ్గరకి చేరాను. బాగ్ లోంచి గాస్ కట్టర్ తీసాను. సుమారు అర గంట పట్టింది ఆ తలుపు ఊడివచ్చేసరికి. కరెంట్ లేదుకనక బర్గ్‌లరీ ఎలారం మ్రోగే అవకాశం లేదు. సేఫ్ లోపల ఓ లక్ష్మీదేవి పటం ఉంది. సేఫ్ అంతా ఖాళీగా ఉంది. విచిత్రంగా నేనా విషయం పట్టించుకోలేదు. లక్ష్మీదేవి పటం లాగి చూసేను. వచ్చేసింది సులువుగా. నా అనుమానం నిజమే. ఆ లక్ష్మీదేవి పటం వెనకాల ఉంది ఆ నగ ఉన్న పెట్టె. టార్చ్‌లైట్ వెలుగులో ఆ నగని పరిశీలించి సంచిలో పడేసుకున్నాను.

"కరెంట్ లేదా? ఒరే రామన్!" అంటూ ఎవరో తమిళంలో అంటూ లోపలికి వచ్చిన అలికిడి అయింది.

ముసలాయన అయుంటాడు. ఆలస్యంచేసే వ్యవధి లేదు. ఆ ముసలాయన నన్ను చీకట్లో గమనించకుండా జాగ్రత్తపడి, బయట పడ్డాను.

3

ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకి సెంట్రల్ స్టేషన్ చేరుకున్నాను.



నేను వేరే నకిలీ నగ పెట్టే అవసరం రాలేదు నాకు.
ఆ నగ నకిలీది.

నేను చాలా కష్టపడి డెబ్బైయి అయిదు వేల రూపాయలకు ఒప్పుకొని దొంగిలించిన నగ నకిలీది.

నా కన్న ముందే ఆ యింట్లో ఎవరో ఆ నగ దొంగిలించి, నకిలీ నగ పెట్టి ఉండాలి.

రాత్రంతా ఆలోచించేను ఏంచేయాలో?

మూడు లక్షలు నష్టం. కనీసం డబ్బైయి అయిదు వేలన్నా రాబట్టుకోవాలి. యీ నకిలీ నగనే అతనికి యిచ్చేసి వెంటనే వెళ్ళిపోవాలి అక్కడ్నించి.

బుక్ స్టాల్ పక్కన పది గంటల వరకూ వెయిట్ చేసేను. అతను రాకపోయేసరికి మొట్టమొదటిసారిగా అనుమానమొచ్చింది. 'ఆ నగ నకిలీదని అతనికి ముందుగానే తెలుసా? తెలిసే రాలేదా?'

"బాలూ!" ప్రక్కనించి పిలిచేరెవరో.

చటుక్కున తిరిగి చూసేను.

పోలీస్ యిన్స్పెక్టర్, యింకో యిద్దరు కాన్స్టే బుల్స్.

"హాలూ! యూ ఆర్ అండర్ అరెస్ట్!" అన్నాడు చేతులకి సంకెళ్ళు వేస్తూ.

చేతిలో బ్రీఫ్ కేస్ తీసి చూసేడు. అందులో నగ తీసి చూస్తూ అన్నాడు. "ఊఁ! నగపట్టుకొనే తిరుగుతున్నా వన్నమాట పద." మెడమీద చెయ్యివేసి ముందుకు తోసేడు.

మౌనంగా అనుసరించేను.

స్టేషన్లో అడుగు పెడుతూనే ఆశ్చర్య పోయేను, ఆ గ్రేకలర్ సూట్ వ్యక్తినిచూసి. అతని ప్రక్కనే ఉన్నాడు ఆ బంగళా తోటమాలి.

"దొరికాడా?" ఆతృతగా అడిగేడు అతను యిన్స్పెక్టర్ని.

"ఆహా! నగతో సహా సెంట్రల్లో దొరికేడు. ఎక్కడికో పారిపోవాలనుకుంటున్నట్లుంది." విజయగర్వంతో అన్నాడు యిన్స్పెక్టర్ ఆ నగ అందిస్తూ.

అతను నావైపు చూడలేదు. ఆ తోటమాలి నన్ను తినేసేటట్లు చూడసాగేడు.

ఆ నగ చూస్తూనే అతను ఆశ్చర్యంగా మొఖంపెట్టి అన్నాడు. "కానీ యిన్స్పెక్టర్ యిది నకిలీది."

యిన్స్పెక్టర్ అదిరిపడ్డాడు. "నకిలీదా?"

"అవును. అసలు నగ దాచిపెట్టి నకిలీది పట్టుకొని తిరుగుతున్నాడు."

కోపంగా నా చెంప పగిలేటట్లు కొట్టేడు యిన్

స్పెక్టర్. 'స్కాండ్రల్. ఎక్కడా నగ?"

నాకు అంతా అర్థమయిపోయింది. ఎందుకో తెలీదు. కానీ ఆ గ్రేకలర్ సూట్ వ్యక్తి నకిలీ నగనే దొంగ తనం చేయించేడు. తన యింట్లోనే- యిపుడు నాకు అసలు నగ తెలీదు. నేను కొట్టేసింది ఆ నగనే అంటే ఎవరూ నమ్మరు.

చాలాసేపు హింసించాడు యిన్‌స్పెక్టర్ నన్ను ఆ నగ కోసం.

నాకు తెలీదనే సమాధానం చెప్పగలిగేను.

సెల్‌లో పడేశారు ఆఖరికి. ఓ మూల కూలబడు తుంటా అబ్దుల్ పిలిచాడు నన్ను. ఆ సెల్‌లో అబ్దుల్‌ని చూసి ఆశ్చర్యపోయేను నేను.

"ఏం నేరంమీద వచ్చేవ్?" అడిగాడు.

"దొంగతనం"

"దొంగతనమా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ఆరు లక్షల రూపాయలు విలువచేసేనగ."

చిన్నగా నవ్వేడు అబ్దుల్. "కానీ అదినకిలీది. అవునా?"

ఈ సారినేను ఆశ్చర్యపోయాను. "నీ కెలా తెలుసు?"

"నేనూ అదే నేరంమీద వచ్చేను కనక. అతను ఆ నగలని యిన్స్యూర్ చేసేడు. థెఫ్ట్ యిన్స్యూరెన్స్. దొంగతనం జరిగితే ఆ నగపోతే అ నగ విలువ వస్తుం దతనికి. నకిలీ నగపెడతాడు సేఫ్‌లో. అసలు నగే పోయిందని నమ్మించగలడు కోర్టులో, యిన్స్యూరెన్సీ కంపెనీని. మనలాటి వాళ్ళని ఎన్నుకొంటాడీపనికి. మనం దొరికిపోతాం. మన యిన్ఫర్మేషన్ కూడా అతనే యిస్తాడు పోలీస్‌లకు. అతనికి రెండు విధాల లాభం. అసలు నగ అమ్మిన సొమ్ము, యిన్స్యూరెన్స్ సొమ్ము."

"నకిలీ మనిషి...." అన్నాను కోపంగా. ●

కొట్టు గురూ

(కోర్టులో)

జడ్జి : నువ్వా అమ్మాయిని కొట్టావా, లేదా?

ముద్దాయి : కొట్టడం మాట నిజమే. కాని, ఆ అమ్మాయే-కొట్టుగురూ! నువ్వుకొట్ట కుంటె ఒట్టుగురూ! గురూ...అంటూ నన్ను రెచ్చగొట్టితే ఊరుకొనేదా-?

— అందవిల్లి కొండలరావు
పార్వతీపురం.

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ట్రాన్సిస్టర్ దొంగ

"నమస్కారం సర్"

డిటెక్టివ్ పృథ్వీరాజ్ తన ఎదురుగా నిలబడ్డ ఆ యువకుడి వంక చూసాడు కొన్ని క్షణాలు.

"కూర్చోండి"

అతను కూర్చున్నాక నవ్వుతూ అడిగాడు, తన చేతి లోని పుస్తకాన్ని టేబుల్ మీద వుంచి;

'మీరు సోలమన్ రాజు కదూ ?'

సోలమన్‌రాజు కళ్ళలో కొద్దిక్షణాలు ఆశ్చర్యం తొంగి చూసింది.

"మనం కలిసి దాదాపు సంవత్సరం అవుతోంది. నా పేరు గుర్తుంచుకుంటారనుకోలేదు.' చెప్పాడు.

చిన్నగా నవ్వి, చెప్పాడు డిటెక్టివ్ పృథ్వీరాజ్.

.మీ కాలేజీ డే రోజు 'క్రయిం అండ్ డిటెక్షన్' మీద మాట్లాడటానికి పిలిచారు క్రిందటి సంవత్సరం .... చెప్పండి,

'చిన్న సమస్యతో వచ్చాను. నాకు మీతో గల కొద్ది పాటి పరిచయాన్ని పురస్కరించుకుని సహాయం కోర 'డాని వచ్చాను:

'ప్లీజ్ గో ఎ హెడ్.'

'నేను మా కాలేజీ హాస్టల్‌లో వుంటున్నాను. నా గది లోని ట్రాన్సిస్టర్ మాయమయ్యింది మీరు ఆ దొంగని పట్టుకోగలరేమో నని వచ్చాను. దాని విలువ మూడు వందలు మించదు. కాని ఇంతటితో వూరుకోకపోవచ్చు ఆ దొంగ. ముందు ముందు మరి కొన్ని దొంగతనాలు జరిగే అవకాశం వుందని మీ సహాయం కోరడానికి వచ్చాను.'

'ఎలా పోయింది ?'

'అదే తెలియటం లేదు.'

'అంటే ?'

'ట్రాన్సిస్టర్‌ని నా టేబిల్‌కుండే డ్రాయరులో వుంచు

తాను ఎప్పుడూ. నిన్న పుదయం గదికి తాళం వేసి కాలేజీకి వెళ్ళాను. సాయంత్రం సినిమా చూసి కొద్దిగా ఆలస్యంగా వచ్చాను. సిలోన్ స్టేషన్ పెట్టుకుందామని చూస్తే టేబిల్‌కుండే డ్రాయర్‌లో ట్రాన్సిస్టర్ లేదు."

"మాయమయిందా?"

"అవును దొంగతనం జరిగింది."

"ఆ గదిలో ఒక్కరే వుంటున్నారా? లేక రూం మేట్ కూడా వున్నాడా?"

"ఒక్కడినే వుంటున్నాను. నే నుండే ఫ్లోర్‌లో పద్నాలుగు గదులున్నాయి. అన్నిటిలో ఒక్కరొక్కరే వుంటున్నారు."

"తాళం పగల కొట్టారా?"

"ఉహూ. అదే విచిత్రం వేసిన తాళం వేసినట్లేవుంది."

"కిటికీ లోంచి వచ్చే అవకాశం వుందా ?"

"ఎంతమాత్రం లేదు. కిటికీ తలుపులు వేసి వెళ్ళడం అలవాటు నాకు. కిటికీకి ఇనపకమ్మీలున్నాయి. అవి వంచి లోపలకి రాలేరు."

"ఇంకేమార్గం లేదా?"

"లేదు. తలుపు లోంచే వచ్చి వుండాలి. బహుశ ఆ దొంగ దగ్గర మారుతాళంచెవి వుండి వుండాలి."

"మీ తాళంకప్ప డూప్లికేట్ ఎక్కడవుంది?"

"ఒరిజినల్, డూప్లికేట్ రెండూ నా తాళం చెవుల గుత్తికే వుంటాయి ఎప్పుడూ."

"అంటే తెలివిగా ఏ మేకులోనో తీయటమో జరిగి వుండాలి."

"మాంఛెస్టర్ లాక్ అది. సెవెన్ లీవర్స్. కాబట్టి అది అలా వచ్చే అవకాశం లేదు.

డిటెక్టివ్ పృథ్వీరాజ్ కొన్ని క్షణాలు ఆలోచిస్తూండి పోయాడు. తర్వాత అన్నాడు.

"నేనొసారి మీ గది చూడాలి."

"మీకు ఎప్పుడు వీలుంటుంది?"

"ఇప్పుడేం పని లేదు......."

"అయితే వెళదాం. సరాసరి కాలేజీ నుంచి ఇటే వస్తున్నాను."

"పదండయితే" అన్నాడు డిటెక్టివ్ పృథ్వీరాజ్ లేచి నిలబడి.

ఇద్దరూ కన్సల్టింగ్ రూం లోంచి బయటకి వచ్చారు. డిటెక్టివ్ పృథ్వీరాజ్ కారులో పదినిముషాల్లో సోలమన్ రాజు వుండే హాస్టల్ చేరుకున్నారు.

2

మూడో అంతస్తులో చివరి గది అది.

ఆ గదికి మాంఛెస్టర్ తాళంకప్ప వేలాడుతోంది.

సోల్‌మన్‌రాజు తన జేబులోంచి తాళం చెవులుంచే కీబంచ్ తీసి తాళం తెరచి లోపలకి వెళ్ళాడు.

అప్పటికే చీకటి పడింది. లైటు వెలిగించి, తాళం కప్పని తలుపు లోపలవున్న ఇనప అడ్డగడియకి వ్రేలాడ దీసాడు.

డిటెక్టివ్ పృథ్వీరాజ్ ఆ గదివంక నిశితంగా చూసాడు. గదిలో ఓ మూల లైటు కింద వెలుగు పడేలా ఓ చెక్క బల్ల, దాని ముందు ఓ కుర్చీ వున్నాయి. బల్లమీద పుస్తకాలు, నోట్ బుక్స్, ఏష్‌ట్రే. ప్రక్కన ఓ ఇనప మంచం. దానిమీద పరుపు. పైన సీలింగ్‌ఫేన్. ఓ చిన్న వెంటిలేటర్. గోడకి పుస్తకాల రేక్ నిండా పుస్తకాలు.

ఆ వెంటిలేటర్ లోంచి మనిషి లోపలికిదూరి వచ్చేంత విశాలంగా లేదు. పైగా ఇనపజాలీ అమర్చి వుంది.

వెంటిలేటర్‌కి మూడున్నర అడుగుల క్రింద ఓ కిటికీ. తలుపు వేసివుంది. దగ్గరకి వెళ్ళితలుపు తెరచి చూసాడు.

అవతలప్రక్క మనిషి నిలబడే అవకాశం లేదు. సన్‌షేడ్ లాంటివేమీ లేకపోవడం వల్ల. ఆ కిటికీలోంచి కర్రలాంటిది వుపయోగించి బల్లమీద ఆ ట్రాన్సిస్టర్ మర్చిపోయినా దొంగతనం చేసే అవకాశం లేదు.

దొంగ ఆ గదిలోకి తలుపులోంచే వచ్చే దొంగతనం చేసి వుండాలనుకున్నాడు పృథ్వీరాజ్.

ఆ మాంఛెష్టర్ తాళాన్ని అందుకుని పరిశీలించాడు. ధృఢంగా వుంది.

"మీకెవరి మీదయినా అనుమానం వుందా ?" అడిగాడు సోలమన్‌రాజుని.

అతను తల అడ్డంగా వూపాడు.

"ఈతాళంకప్ప ఎవరికయినా వాడుకోవటానికిచ్చారా ఎప్పుడయినా"

మళ్ళీ తల అడ్డంగా తిప్పి చెప్పాడు సోలమన్‌రాజు.

"లేదు"

"కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని ఆ సమస్య గురించి ఆలోచిస్తూండిపోయాడు డిటెక్టివ్ పృధ్వీరాజ్.

తర్వాత బయటకి వచ్చి చూసాడు. ప్రక్కనే వున్న గది తాళం పెట్టబడి వుంది.

"ఇందులో వుండేది ఎవరు ?" అడిగాడు ఆ గదికి వేలాడుతున్న తాళంకప్ప వంకచూసి.

"బి.ఎ. ఫైనల్‌లో వున్న విద్యార్థి"

"డబ్బు గల వాడేనా?"

"కొద్దిగా బీదవాడనే చెప్పాలి. ఏం అలా అడుగుతున్నారు ?"

డిటెక్టివ్ పృధ్వీరాజ్ మరికొన్నిక్షణాలుఆలోచిస్తూండిపోయాడు. తర్వాత చెప్పాడు సోలమన్ రాజుతో–అతన్నోసారి చూడాలి."

"ఇంకో పావుగంటలో వచ్చేస్తాడను కొంటాను. సాయంత్రం ఏడున్నర దాకా అటూ ఇటూ తిరిగివస్తాడు."

పృధ్వీరాజ్ చేతి గడియారం వంక చూసుకుని చెప్పాడు.

"ఇంకా ఇరవై నిముషాల టైం వుంది కదా ఈలోగా ఓ సారి బయటకి వెళ్ళొస్తాను".

"అలాగే మీకేదయినా పని వుంటే పోనీ రేపు...."

"మీ పని మీదే. ఓ సారి మీ తాళం కప్ప ఇవ్వండి. మళ్ళీ వచ్చేటప్పుడు తీసుకు వస్తాను."

డిటెక్టివ్ పృధ్వీరాజ్ అతనిచ్చిన తాళం కప్ప తాళం చెవులు అందుకుని బయటకి వెళ్ళిపోయాడు.

3

అరగంట తర్వాత తిరిగి వచ్చాడు పృధ్వీరాజు, సోల మన్ రాజు ప్రక్కగది తలుపు తీసి వుండటం చూసి అతను వచ్చి వుంటాడనుకున్నాడు.

"ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు సోలమన్ రాజు.

"మీ ప్రక్క గదిలో వుండే బి. ఏ. ఫైనల్ విద్యార్థికి కళ్ళజోడు వుంది కదా?" అడిగాడు పృధ్వీరాజ్ అతని ప్రశ్నకి సమాధానం చెప్పకుండా.

"ఉంది. మీ కెలా తెలుసు?"

"తెల్ల బట్టలున్నాయి కదా?"

"తను ఎప్పుడూ తెల్ల బట్టలే వేసుకుంటాడు"

"ఐదున్నరడుగుల ఎత్తుంటాడా?"

"అవును"

"గుడ్. అయితే అతనే దొంగ."

"అతన్ని చూడకుండా ఎలా చెప్పగలుగుతున్నారు?" అడిగాడు సోలమన్ రాజు ఆశ్చర్యంగా.

"పిలవండి చెప్తాను".

సోలమన్ రాజు ప్రక్కగదిలో వుండేవ్యక్తిని పిల్చుకు వచ్చాడు వెంటనే.

డిటెక్టివ్ పృధ్వీరాజ్ అతనివంక దీక్షగా చూసాడు

కొద్ది పేప్పు. తర్వాత సూటిగా అడిగాడు.

"ట్రాన్సిస్టర్ అమ్మేశావా ?"

మొదట తెల్లబోయాడతను. తర్వాత కోపంగా అడిగాడు.

"ఎవరు మీరు ? ఏమిటంటున్నారు?"

"సోలమన్‌రాజు గదిలోంచి నిన్న దొంగిలించిన ట్రాన్సిస్టర్ గురించి అడుగుతున్నాను."

"నేను ట్రాన్సిస్టర్ ఈ గదిలోంచి దొంగిలించడమా? అబద్ధం" అన్నాడతను.

"నిన్న సోలమన్‌రాజు కాలేజీలో వుండగా ఈ గది తలుపు మారు తాళం చెవితో తెరచి ట్రాన్సిస్టర్ దొంగిలించావు."

"అబద్ధం"

"కాదు–నిజం." మృదువుగా నవ్వి చెప్పాడు డిటెక్టివ్ పృధ్వీరాజ్.

"నా దగ్గర మారుతాళంచెవి ఎక్కడినుంచి వస్తుంది?

"చేయించావు"

"ఎలా చేయించగలను ? ఈ తాళం తలుపుకుంటే తీసుకువెళ్ళి చేయించగలనా?"

"ఊహూ. ఈ తాళం తీసుకెళ్ళే చేయించావు."

"నేనా? నేనెప్పుడూ ఈ తాళంచెవి అడగలేదు సోలమన్ రాజుని."

"నిజమే సర్ ! ఈ తాళంకప్ప ఎప్పుడూ నా గది లోనే వుంటుంది. నేను గదిలో లేని సమయంలో తాళంవేసి వెళతాను. ఇతను తీసే అవకాశంలేదు."

చిన్నగా నవ్వాడు డిటెక్టివ్ పృధ్వీరాజ్.

"పొరబాటు. మీరు గదిలో వుండగా ఈ గదిలోనో, బయటకి వెళ్ళినప్పుడు తాళం వేయబడో ఓ తాళం కప్ప-ఓ మాంఛెస్టర్ తాళంకప్ప వుంటోంది. అంతేకాని ఇదే తాళంకప్ప కాదు."

"అంటే?"

"ఇతని తాళంకప్ప కూడా మాంఛెస్టర్ సెవెన్ లీవర్స్ తాళంకప్ప. రెండూ గుండ్రంగా వుండే ఇత్తడి కప్పలే. చూడటానికి రెండూ ఒకే మాదిరిగానే వుంటాయి.

నాలుగు రోజుల క్రితం ఇతను మీకు తెలియకుండా తన తాళంకప్ప, తన డూప్లికేట్, ఒరిజినల్ మీవాటి స్థానంలో రహస్యంగ ఉంచి మీవి సంగ్రహించాడు. దొంగిలించిన మీ తాళంకప్పకి ఓ డూప్లికేటు చేయించి

తిరిగి తన తాళంకప్ప, తాళంచెవులు తీసుకుని మీవి యధాస్థానంలో వుంచేసాడు.

ఇదంతా మీకు తెలియకుండా జరిగింది. దాంతో మీ తాళంచెవికి మారు తాళంచెవి తయారయి ఇతని దగ్గర ఒకటి వుందన్న మాట. మీరు తాళంకప్పల మార్పిడి గురించి తెలుసుకునే అవకాశంలేదని ఇతనికి తెలుసు కాబట్టి, ఆ సాహసం చేసాడు."

"అబద్ధం. అసలితనెవరు?"అరిచాడతను వుక్రోషంగా.

"నిజమే. నాలుగయిదు రోజులక్రితం ఇతను తన గదికిమామూలుగా ఎప్పుడూవేసే తాళంకప్ప వేయకుండా ఇంకొకటి వేసుకున్నాడు. ఆ సమయంలో ఇతని తాళం కప్ప నా దగ్గర, నాది తాళంచేతులు తయారుచేసే దుకాణంలో వుండి వుండాలి." వుత్సాహంగా చెప్పాడు సోలమన్ రాజు.

"అబద్ధం. అబద్ధం" అన్నాడతను. అప్పటికే అతని మొహం పాలిపోయింది.

"మీ హాస్టల్ దగ్గర, గాజుల షాపు ప్రక్కన తాళం చెవులు తయారు చేసే దుకాణానికి ఇప్పుడే వెళ్లొచ్చాను మిస్టర్. మాంఛెస్టర్ తాళంకప్ప తీసుకువెళ్ళి చూపించాను. ఆ దుకాణంలోని వ్యక్తి తను దీనికి మారు తాళం చెవి చేసానని చెప్పాడు. అది చేయించుకు వెళ్ళిన నీ గుర్తులు కూడా చెప్పాడు. ఇంక అబద్ధం ఆడి ప్రయోజనం లేదు."

కొద్దిసేపు అతను మారు మాట్లాడలేకపోయాడు. కళ్ళు దించుకున్నాడు.

తర్వాత జేబులోంచి రెండు వంద రూపాయల నోట్లు

తీసి సోలమన్ రాజుకి అందించాడు.

"సారీ బ్రదర్. టరమ్ ఫీజు కడదామని...."

కొంతసేపు ముగ్గురిలో ఎవరూ మాట్లాడ లేదు.

"మీరు...." సందేహంగా చూసాడు డిటెక్టివ్ పృధ్వీరాజ్ వంక.

చిన్నగా నవ్వి తల అడ్డంగా వూపాడు పృధ్వీరాజ్.

"పోలీస్ డిపార్ట్మెంట్‌కి చెందిన వ్యక్తిని కాను... మీ తలుపుకు ఇదే కంపెనీ తాళం వేలాడుతుండటంవల్ల ఇలా జరిగి వుండచ్చని వూహించి పరిశోధన చేసాను. నా అంచనా తప్పలేదు."

"ఇంతకీ మీరు... ?"

డిటెక్టివ్ పృధ్వీరాజ్ తన జేబులోంచి ఓ విజిటింగ్ కార్డ్ తీసి అతనికిచ్చి చెప్పాడు.

"నేరం చేయడానికి అలవాటు పడటం మంచిది కాదు. నీకు పార్టుటైం వుద్యోగం కావాలంటే ఇప్పించగలను. కావాలనుకుంటే వీలున్నప్పుడు నన్ను కలు."

ఆ కార్డు వంక చూసాడతను.

"మీ ఫీజ్ ?" అన్నాడు సోలమన్ రాజు సందేహంగా.

చిన్నగా నవ్వి అతని భుజం మీద తట్టి చెప్పాడు.

"చదువు పూర్తయి స్వంత సంపాదన వచ్చాక ఎంత పంపదలుచుకుంటే అంత పంపు. అపుడు కాదనను."

బయటకి నడిచాడు.

చావు ఎవరికి?

-కృష్ణచైతన్య

ఉదయం పది గంటలు.

చక్రవర్తి ఆఫీసు గదిలో కూర్చొని ఫైల్సు చూసుకుంటున్నాడు. ఆఫీసు ప్యూను పోస్టు తెచ్చి టేబిలుమీద ఉంచాడు. చక్రవర్తి ఫైల్సు పక్కగా పెట్టి, పోస్టు అందుకున్నాడు.

మూడు ఉత్తరాలు వచ్చాయి. మూడూ ఇన్‌లాండ్ లెటర్సే. అందులో ఒకటి హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడు చౌదరి వ్రాసిన ఉత్తరం. విశేషాలు ఏమీ లేవు. ఊరికే ఉబుసుపోక యోగక్షేమాలు వ్రాశాడు.

రెండో ఉత్తరం ఒక కస్టమర్ వ్రాసింది. అవసర సమయంలో అప్పిచ్చినందుకుగాను కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉత్తరం వ్రాసాడు.

మూడో ఉత్తరం చింపబోతూ, ఒక్క క్షణం అడ్రసు వైపు పరీక్షగా చూచాడు. ఉత్తరం మీద పేరు తనదే! కాని ఆ అక్షరాలు....రాత, తనకు బాగా పరిచయ మైనవే।

ఆలోచిస్తూ ఉత్తరం చింపాడు. ఆ ఉత్తరంలో రెండే రెండు వాక్యాలు ఉన్నాయి.

"నీ భార్య సుభద్ర, మారుతి అనే వ్యక్తితో తిరుగుతూంది తెలుసా? ఇకనైనా కళ్ళు తెరిస్తే బాగుపడతావ్."

అంతే; అంతకు మించి ఉత్తరంలో క్రింద ఎలాంటి సంతకం గాని, గుర్తు కాని లేవు.

ఉత్తరాన్ని అలాగే టేబిలు మీద పెట్టి, రివాల్వింగ్ ఛైర్‌లో వెనక్కి వాలాడు చక్రవర్తి.

ఫ్యాను గాలికి ఉత్తరం రెప రెప లాడుతోంది. ఉత్తరంవైపే చూస్తున్న చక్రవర్తి అయోమయంలో పడిపోలేదు. ఎదురు చూస్తున్న దుర్వార్త అందినంత నిస్పృహగా ఉంది.

సుభద్ర గురించి వారం రోజుల క్రితమే ఎందుకో అనుమానం తగిలింది. ఇంటికి వెళ్ళేసరికి, ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతూ, తనను చూడగానే తత్తరపడుతూ ఫోన్ పెట్టేయడం, అప్పుడప్పుడు సుభద్ర విడిచిన చీర సిగరెట్ వాసన కొట్టడం, కాస్తంత అనుమానం కల్గించినా ఆధారాలు దొరకలేదు. అలాంటిది ఈ రోజు తన అనుమానానికి ఆధారం దొరికింది. అందుకే పెద్దగా కంగారు పడిపోలేదు.

అయితే అతనికి అర్థం కానిదొక్కటే; ఉత్తరంలో అక్షరాలు చూస్తే, ఈ ఉత్తరం సుభద్ర వ్రాసినట్లుగానే ఉంది. అక్షరాలు ఎంత మార్చి వ్రాసినా, సుభద్ర రాత తను తెలుసుకోగలడు.

కాని సుభద్రే ఎందుకు వ్రాసిందీ ఉత్తరం? తను చెప్పలేక ఈ విధంగా తన సంగతి నాకు తెలియజేసి,

విడాకులు తీసుకోవడానికా ? లేక ఇంకేదైనా తన ఊహ కందని ప్రతిఫలం ఆశించా ?

"సార్ మీ కోసం ఎవరో వచ్చారు !" ప్యూన్ వచ్చి చెప్పాడు.

చక్రవర్తి విసుగ్గా చూచి, "ఈ రోజు ఎవ్వర్నీ చూడనని చెప్పు. లోపలికి ఎవర్నీ రానివ్వక ?" అని ఉత్తరం మడిచి కోటు జేబులో పెట్టుకుని, డ్రాయర్ సొరుగు తెరిచాడు. విల్స్ కింగ్ సైజ్ సిగరెట్ పాకెట్లు మూడున్నాయి అందులో.

పాకెట్ లోంచి ఒక సిగరెట్ తీసి వెలిగించి, కుర్చీలో వెనక్కి వాలాడు.

"సుభద్ర ! ఒకప్పుడు తన అదృష్టానికి అ, ఆ లు దిద్దింది. ఈనాడు తన పతనానికి నాంది పలుకుతోందా ?" చక్రవర్తి ఆలోచిస్తున్నాడు.

2

"రేపు బెంగుళూరు వెళుతున్నాను." అన్నాడు చక్రవర్తి ఇంట్లోకి రాగానే !

సుభద్ర తల ఊపి, "మళ్ళా ఎప్పుడొస్తారు !" అడిగింది, చక్రవర్తి చేతిలోని బ్రీఫ్ కేసు అందుకుంటూ.

"రెండు మూడు రోజులు పట్టవచ్చు. పని కాకపోతే వారం రోజులు ఉండవలసి ఉంటుంది."

సుభద్ర మాట్లాడలేదు.

మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకల్లా బయలు దేరాడు చక్రవర్తి. సుభద్ర వరండాలో నిలబడి టాటా చెప్పింది.

టాక్సీ కదిలింది.

"ఎక్కడికి పోనివ్వమంటారు." అడిగాడు డ్రైవరు.

"రైల్వే స్టేషన్"

పది నిముషాల తర్వాత టాక్సీ ఆగింది. చక్రవర్తి క్రిందకిదిగి ఫేర్ చెల్లించి లోపలికి నడిచాడు. బుకింగ్ కౌంటర్ దగ్గర చాలామంది నిలబడి ఉన్నారు. అక్కడే ఒకప్రక్కగా అయిదు నిమిషాలు నిలబడి నెమ్మదిగా బైటకు వచ్చాడు.

తనింతకుముందు వచ్చిన టాక్సీ అక్కడ ఉన్నట్లు లేదు. తృప్తిగా నిట్టూర్చి, వేరే టాక్సీ ఎక్కి "హోటల్ అశోక్' అన్నాడు.

అర్ధగంట తర్వాత, హోటల్ అశోక్, రూంనెంబర్ నూటయాభై లో సూట్ కేస్ పెట్టి, మంచంమీద అలసటగా వాలాడు.

ఇక ఇప్పుడు ప్రారంభించాలి పని. ఎలా? సినిమాల్లోలాగా మారు వేషాలు వేసుకొని వెంటాడడం తనకు తెలియదు. ఏం చెయ్యాలి? పావుగంట తర్వాత ఒక నిర్ణయాని కొచ్చి, కాలింగ్ బెల్ నొక్కాడు.

రూం బాయ్ వచ్చాడు.

"అర్జెంటుగా కాఫీ కావాలి.' అన్నాడు చక్రవర్తి.

ఆయిదు నిముషాల్లో కాఫీ తెచ్చాడు రూంబాయ్ '

'నీ పేరేమిటి ! 'కాఫీ అందు కుంటూ అడిగాడు.

'కీర్తి' చెప్పాడు అతను

'చూడు కీర్తి! ఈ అంతస్తులో ఉండే రూమ్స్ అన్ని టిని నువ్వొక్కడివే సర్వీస్ చేస్తావా?' అడిగాడు.

"లేదు సార్ ! నేను కాక మరో ఇద్దరు ఉన్నారు."

అన్నాడు కీర్తి.

చక్రవర్తి తల ఊపి, రెండు రూపాయల కాగితం కీర్తి కందించి "కాలక్షేపానికి ఎవరైనా దొరుకుతారా?" అడిగాడు నెమ్మదిగా.

కీర్తికి అలాంటి మాటలు కొట్టిన పిండే.

తల ఊపి దొరుకుతారు। కాని ఇప్పుడు కాదు. రాత్రికి" అన్నాడు నవ్వుతూ.

చక్రవర్తి పెదిమవిరచి 'రాత్రికి నేను వెళ్ళిపోతాను పోనీ ఒక పని చేస్తావా?' అడిగాడు.

'చెప్పండి'.

'నేనొక అడ్రస్సు ఇస్తాను. ఆ ఇంట్లో ఒకావిడ ఉంది. నాకు పరిచయం ఉందిలే! అక్కడికి వెళ్ళి, ఇంట్లోకి వెళ్ళకుండా బయటే ఉండి, ఆమె ఎక్కడికి వెళుతుందో తెల్సుకొని రావాలి! చెయ్యగలవా?' అడిగాడు చక్రవర్తి.

కీర్తి ఉత్సాహంగా తల ఊపాడు.

'నేను చెప్పిన పని సక్రమంగా చేస్తే వంద రూపాయలు ఇస్తాను. అంతకుమించి ఇంకేదైనా తెల్సుకోగల్గితే ఇంకా ఇస్తాను!' అన్నాడు.

'అడ్రస్సివ్వండి!' అడిగాడు కీర్తి.

చక్రవర్తి వ్రాసిచ్చిన అడ్రస్సు కాగితం అందుకొని ఉత్సాహంగా నడిచాడు బైటకు.

3

టాక్సీ వచ్చి ఇంటి ముందు ఆగింది. సుభద్ర గబ గబ క్రిందకి దిగివచ్చింది. అప్పటికే డ్రైవర్ రెండు

పండ్ల బుట్టలు తెచ్చి లోపల పెట్టాడు.

'ఏమిటివీ ?' అడిగింది సుభద్ర.

'పండ్ల బుట్టలు. వాటినిండా లేవులే. కొద్దిగానే ఉన్నాయి. ఎవ్వరూ అనుమానించకుండా ఉండేందుకు ఇవి తెచ్చాను।' చెప్పాడతను సిగరెట్ వెలిగిస్తూ

'ఇంతకీ కాయా ? పండా !"

"పండే ! గురుడు నేరుగా రైల్వే స్టేషన్‌కు వెళ్ళాడు అయిదు నిముషాలు అక్కడే నిలబడి వేరే టాక్సీలో హోటల్ అశోక్‌కు వెళ్ళి నూటయాభై రూం నెంబరులో దిగాడు", 'చెప్పాడతను.

"వెరీగుడ్। మరి పక్కనే ఉన్న రూం బుక్ చేసావా। అడిగింది సుభద్ర.

అతను తల ఊపి, పక్కరూం దొరకలేదు. ఆ గదికి ఎదురుగా ఉన్న రూం దొరికింది. రూం నెంబరు నూట అరవై నాలుగు" అన్నాడు.

సుభద్ర నవ్వి 'అదిసరే నీకీ టాక్సీ ఎక్కడ దొరికింది' అడిగింది.

"విన్న ఉత్తరం వ్రాసి పడేశావ్‌గా। గురుడు ఇలాంటి ప్లాన్ ఏదో వేస్తాడని తెలుసు. నాకు తెల్సిన టాక్సీ డ్రైవర్ని అడిగి, టాక్సీతీసుకొని ఉదయం నుంచి ఇంటి ముందే కాచుకున్నాను' అన్నాడు నవ్వుతూ.

సుభద్ర నవ్వి ఇక బయలు దేరుదామా" అంది.

"నీదే ఆలస్యం !? నవ్వాడతను.

"ఒక్కనిముషం : చీర మార్చుకొని వస్తాను" అంది లోపలికి వెళుతూ.

4

కీర్తి చటుక్కున లోపలికి వచ్చాడు.

చక్రవర్తి ఉలిక్కిపడి లేచి ఏం చేసుకొచ్చావ్', అడిగాడు ఆత్రుతగా.

కీర్తి, నవ్వి, ,నాకు రెండు వందలిస్తే ఆవిడ ఎక్కడ ఉందో ఆవిడతో పాటు ఎవరున్నారో కూడా చెబుతాను' అన్నాడు.

చక్రవర్తి రెండొందలు అతని చేతిలో పెట్టి త్వరగా చెప్పు' అన్నాడు.

'అతనిపేరు మారుతి ! ఇంతకు ముందు వాళ్ళిద్దరూ కలిసి, రెండు, మూడు సార్లు వచ్చారు. ప్రస్తుతం మీగది ఎదురుగదిలోనే ఉన్నారు. "అన్నాడు నవ్వుతూ.

చక్రవర్తి ఒక్కక్షణం మౌనంగా ఉండి "ఆల్‌రైట్ నువ్వెళ్ళి, రెండు కాఫీ తీసుకురా ! నే నిలా అడిగిన విషయం ఎవ్వరికీ చెప్పవద్దు!నోరు జారావా? ఈ అంతస్థు నుంచి నీ శవం నేల మీద పడుతుంది.' అన్నాడు.

చక్రవర్తి మొహంలో కాఠిన్యానికి కీర్తి, అదిరి పోయాడు. తలఊపి నెమ్మదిగా వెళ్ళిపోయాడు.,

కాస్సేపటి తర్వాత కీర్తి తెచ్చిన రెండు కాఫీలు తాగి, 'ఎలా ఉంటాడతను!' అడిగాడు చక్రవర్తి.

కీర్తి వర్ణించి చెప్పాడు.

చక్రవర్తి నవ్వుకున్నాడు.

కీర్తి వెళ్ళిపోయాక, కుర్చీ వెనక్కు వాలి ఆలోచనల్లో పడ్డాడు. పదినిముషాల తర్వాత ఒక నిర్ణయానికొచ్చి



గదితలుపు బార్లా తెరిచి, వాకిలి దగ్గరగా, గది ఎదురుగా కుర్చీలాక్కొని కూర్చున్నాడు.

ఎదురుగా ఉన్న గది తలుపు గడియ వెయ్యలేదు. ఓరగా దగ్గరకు వేసివుంది. మధ్యమధ్యలో గదిలోంచి మాటలు విన్పిస్తున్నాయి. చక్రవర్తి ఆవేశపడి పోవడం లేదు. తాపీగా కూర్చొని గది తలుపువైపే చూస్తున్నాడు.

గంట.... రెండుగంటలు ...మూడుగంటలు .... గది తలుపులు తెరుచుకోలేదు.

చక్రవర్తి కాలింగ్‌బెల్ నొక్కి, రూంబోయ్ రాగానే సిగరెట్ పాకెట్ తెప్పించుకొని, సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు.

5

'గురుడు వాకిలి దగ్గరే కుర్చీలో కూర్చున్నాడు" కిటికీలోంచి చూస్తూ అన్నాడు, మారుతి.

'ఇప్పుడేం చేద్దాం' అడిగింది సుభద్ర విసుగ్గా కుర్చీలో కూర్చుంటూ.

'చెయ్యవలసిందేమిటో తెల్సు' కాని ఏం చేస్తాం. నీ మొగుడి అవతారం చూడు ప్రపంచం అంతా విరిగి పడినా ఉలిక్కి పడే మనిషిలా లేడు. ఆ గంభీరతను చూస్తుంటే నాకు భయం వేస్తూంది.' అన్నాడు అతను నిరుత్సాహంగా.

సుభద్ర విసుగ్గా చూసిందతని వైపు.

'ఓకె! ఓకె! నువ్వలా చూడకు! ఇంత దూరం వచ్చాక జంకుతానా?' అని లేచి నిలబడి సిగరెట్ వెల్గించి, ఒక్క నిముషం తర్వాత నేను తలుపు నెమ్మదిగా తెరుస్తాను. అంటే చూచే వాళ్ళకు అది గాలికి తెరుచుకున్నట్టుగా ఉండాలి. సరిగ్గా ఆ సమయానికి నీవు బెడ్ మీద నుంచి లేచి నిలబడాలి. పైట ఉండ కూడదు. పైట జారవిడచి జాకెట్ హుక్స్ రెండు విడదీసి, వాటిని పెట్టుకుంటు న్నట్లు నటిస్తూ తలవంచి తలుపుదాకా వెళ్ళి అక్కడ మీ ఆయన్ను చూడగానే భయపడినట్లు చకచక వెళ్ళి పోవాలి.' అంతే అన్నాడతను.

సుభద్ర తల ఊపింది.

6

ఎదురుగా ఉన్న గది తలుపు నెమ్మదిగా తెరుచు కుంటుంది. అది గాలికి తెరుచుకోవడం లేదని తెల్సు. అతను నెమ్మదిగా వెనక్కు లాగు తుండాలి. చక్రవర్తి అటే చూస్తున్నాడు.

సుభద్ర మంచం దిగింది. పైట నేలమీద జారాడు

తుంది. తల క్రిందకు దించుకొని, ఊడిపోయిన జాకెట్ హుక్స్ పెట్టుకుంటూ వస్తుంది.

చక్రవర్తి చూస్తున్నాడు. చేతిలోని సిగరెట్ కాలుతుంది.... వాకిలి దగ్గరకు వచ్చి సుభద్ర తల ఎత్తింది.

ఎదురుగా చక్రవర్తి. కాని, తనూహించినట్లు కళ్ళు ఎర్రగా కోపంగా, మనిషి ఆవేశంతో ఊగిపోతూ కన్పించలేదు. మామూలుగా ఏదో బజార్లో పోయే జనాన్ని చూస్తున్నట్లు .... చూస్తున్నాడు. చటుక్కున తల దించుకొని చక చక ముందుకు నడిచింది.

చక్రవర్తి లేచి వెళ్ళి సూట్‌కేసు సర్దుకొని, గది ఖాళీచేసి ఇంటికి వచ్చాడు.

అప్పటికే సుభద్ర స్నానంచేసి చీర మార్చుకొని కుర్చీలో కూర్చుని పుస్తకం చూస్తూంది.

చక్రవర్తి స్నానం చేసి వచ్చి, తాపీగా ఆమె ఎదురుగా కూర్చుని 'కాఫీ తీసుకురా' అన్నాడు.

సుభద్ర కాఫీ తెచ్చిచ్చింది.

"మారుతి అతనే కదూ!" కాఫీ త్రాగుతూ అడిగాడు

సుభద్ర ఉలికి పాటు నటించింది.

"నటించకు. నిన్న నా కొచ్చిన ఉత్తరం నువ్వు వ్రాసిందే అని తెల్సు!" అన్నాడు.

సుభద్ర మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది.

"అతను నీకు కావాలి! అంటే నా నుంచి నీకు విడాకులు కావాలి. అవునా?" అడిగాడు చక్రవర్తి.

సుభద్ర తలెత్తి భర్త పైపొకసారి చూచి మళ్ళీ తల దించుకుంది.

"అతనితో నేను మాట్లాడాలి! రేపు ఇక్కడకు

రమ్మని చెప్పు!"

"వద్దు!" అంది సుభద్ర కంగారుగా.

చక్రవర్తి నవ్వాడు. 'చూడు సుభద్రా! నేను బిజినెస్ మాన్‌ని, విరక్తి కలిగితే వ్యాపారం మానుకుంటాను. ఇంటరస్టు ఉంటే, వందమందిని చంపైనా వ్యాపారం నిలుపుకుంటాను. జీవితం కూడ అంతే! అర్థం అయిందా? రేపు అతను ఇక్కడకు రావాలి.' అన్నాడు.

సుభద్ర స్థాణువులా చూస్తుండిపోయింది.

7

ఉదయం పది గంటలకల్లా చక్రవర్తి విజిటర్స్ గది లోకి వచ్చి కూర్చున్నాడు,

సుభద్ర కాఫీ తెచ్చిచ్చింది.

చక్రవర్తి కాఫీ త్రాగి "అలా కూర్చో!" అన్నాడు.

సుభద్ర అతని ఎదురుగా కూర్చుంది.

అతను ఇంకో పావుగంటలో వస్తాడనుకుంటాను. ఈ లోపల మనం కొన్ని విషయాలు ఫ్రాంక్‌గా మాట్లాడు కుందాం. సరేనా? అడిగాడు చక్రవర్తి.

సుభద్ర తల ఊపింది.

"నువ్వు చాల పేద కుటుంబంలోంచి వచ్చావు. అలాంటి నీకు ఐశ్వర్యం, హోదా అన్నీ కల్పించాను. నీకు ఏ విధంగాను నేను లోటు చెయ్యలేదు. అలాంటప్పుడు నా మీద నీకు విరక్తి ఎందుకు కల్గింది?'

సుభద్ర కళ్ళు మూసుకుంది. ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలుసు. అయినా ధైర్యం చిక్కపట్టకోలేక

పోతున్నాను. మీరంటే నాకు విరక్తి కలగలేదు. అభిమానం, అనురాగం ఉన్నాయి. అయినా అతనంటే ఎందుకో ఇష్టం. అతన్ని వదలి ఉండలేను.' అంది నెమ్మదిగా.

చక్రవర్తి తల ఊపి, 'ఓకె. నీకతనంటే ఇష్టం ఉంది. అతనికీ నువ్వంటే ఇష్టం ఉంది. కాని మీ మధ్య నేను అడ్డం ఉన్నాను. నేను నీకు విడాకులిస్తేనే కదా నువ్వతన్ని పొందగలిగేది? నేనివ్వకపోతే ఇద్దరూ కలిసి నన్ను చంపాలని అనుకున్నారా?' అడిగాడు.

సుభద్ర చటుక్కున తలెత్తి చూచి, 'లేదు! లేదు! అంత ఘోరం ఊహించలేదు, మీ కెలాగైనా ఈ విషయం తెలియజేసి, మీకు నా మీద విరక్తి కలిగేలా చేసి, విడాకులు పొందాలనే ఉద్దేశ్యంతోనే....మీకు ఉత్తరం వ్రాయడం.... మీ గది ఎదురుగా గది తీసుకోవటం లాంటి నాటకం ఆడాం. అంతేగాని, అలాంటి ఘోరం తలపెట్టాలనే కోరిక ఏ నాడూ లేదు! అంది దిగులుగా.

చక్రవర్తి సుభద్ర కళ్ళల్లోకి చూచి ఏదో అనబోయాడు. అంతలోనే అడుగుల శబ్దం విన్పించింది. తల తిప్పి చూచాడు. ఎదురుగా ద్వారం దగ్గర అతను.

'నమస్కారం!' అన్నాడు అతను.

'ఇలా వచ్చి కూర్చో!' గంభీరంగా అన్నాడు చక్రవర్తి.

అతను కుర్చీలో కూర్చున్నాడు.

'నీ పేరు మారుతి కదూ!'

అతను తల ఊపాడు.

మారుతి వైపు పరీక్షగా చూచాడు. కుర్రాడిలా ఉన్నాడు. సుభద్ర కంటె రెండు మూడేళ్ళు చిన్నవాడయి ఉంటాడు అనుకున్నాడు.

చక్రవర్తి లేచివెళ్ళి, విస్కీ, బీర్ బాటిల్స్ తెచ్చాడు. రెండూ కాక్టెయిల్ చేసి, మూడు గ్లాసులూ నింపాడు.

సుభద్ర వెర్రిగా చూస్తూంది.

,,దీంట్లో'' ఏం విషం కలపలేదు, నువ్వు త్రాగు! పర్వాలేదు. "బీరు త్రాగడం అలవాటు ఉందిగా!" అన్నాడు.

ముగ్గురూ గ్లాసులు అందుకున్నారు.

చక్రవర్తి కొద్దిగా సిప్‌చేసి, సిగరెట్ వెల్గించి, " నువ్వు సుభద్రా ప్రేమించుకున్నారు కదూ! " అడిగాడు హఠాత్తుగా.

మారుతి నవ్వి తల ఊపాడు.

"మీరు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా?"

"మీరు అంగీకరిస్తే...!"

''యు స్టుపిడ్! నీకు సిగ్గు లేదూ అలా అడగడానికి. నువ్వు ఒప్పుకుంటే నీ పెళ్ళాన్ని నేను పెళ్ళి చేసుకుంటాను అని అంటే ఎవడైతే మాత్రం ఏం అంటాడు?

ఇలాచూడు! సుభద్ర, నేను, ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. దాని జీవితంలో ఇంతవరకు ఏ కొరతా రానివ్వలేదు. కావలసినంత డబ్బు వుండీకాదు. నా భార్య అనీకాదు. సుభద్రను నేను ప్రేమించాను. కవిత్వం చెప్పలేను...అమర ప్రేమికులతో పోల్చనుగాని, గుండె నిండా ప్రేమించా! నా భార్యను మించి మరింకేదీ నాకు ప్రపంచంలో గొప్పకాదు అనేంత గాఢంగా

ప్రేమించా! అయినా నా ప్రేమకు ప్రతిఫలం దక్కలేదు. నా జీవితాన్ని ఇంతగా దగా చేసింది నువ్వు ! నువ్వు లేకపోతే నా సుభద్ర నన్ను వదలదు. ఈ క్షణంలో నిన్ను చంపినా నీకు దిక్కులేదు. అయినా నేను నిజాయితీ పరుణ్ని. అంత ఘోరం చెయ్యను.

సుభద్ర నాకూ కావాలి! నీకూ కావాలి! నువ్వుంటే సుభద్ర నాకు దక్కదు. నేనుంటే నీకు సుభద్రను దక్కనివ్వను. మరి ఈ సమస్య ఎలా తీరుతుంది?'

మారుతి, సుభద్ర వెర్రివాళ్ళలా చూస్తుండి పోయారు.

"అర్ధగంట టైం ఇస్తున్నాను. మీ ఇద్దరికీ ఏదైనా అయిడియా వస్తే చెప్పండి. అలా చేద్దాం. లేదా! నేనొక పథకం ఆలోచించాను. ముగ్గురికి సమ్మతమైతే దాన్ని ఆలోచిద్దాం. సరేనా! ఆలోచించుకోండి. సరిగ్గా అర్ధగంట తర్వాత వస్తాను. మీ అభిప్రాయం చెప్పండి" అంటూ తన గదిలోకి నడిచాడు చక్రవర్తి!

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకొని ఆలోచనలో పడ్డారు.

అర్ధగంట దాటాక చక్రవర్తి వచ్చాడు. చేతిలో ఉన్న మూడు 'బీరు' బాటిల్సు టేబిలుమీద పెట్టి "ఏం ఆలోచించుకున్నారు?" అడిగాడు.

ఇద్దరూ మాట్లాడలేదు.

"అయితే నేనో పద్ధతి చెబుతాను. ఇందులో ముగ్గురం నిజాయితీగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇందులో మోసం ఏమీలేదు. కేవలం అదృష్టం. అంతే! ఏమంటారు!"

"చెప్పండి!" అన్నాడు మారుతి.

చక్రవర్తి ఇద్దరి వైపొకసారిచూచి, ‘ఈ మూడు బీర్ బాటిల్స్‌లో దేంట్లోనో ఒకదాంట్లో మాత్రమే విషం కలిపాను. విషం కలిపి కార్కులు బిగించాను. నిజానికి ఆ బాటిల్ ఏదో కూడ నాకు తెలియదు. అయినా మీ అనుమాన నివృత్తికోసం ముందు మీకే ఛాన్సు ఇస్తాను. వీటిల్లో మీ ఇష్టం వచ్చినవి, చెరొక బాటిల్ తీసుకోండి. మిగిలింది నేను తీసుకుంటాను.

సుభద్ర ఈ ఇంట్లోనే ఉంటుంది. నువ్వు నీ గదికి వెళ్ళు. నేను హోటల్లో గది తీసుకుంటాను. రాత్రికి ముగ్గురం బీర్ త్రాగుదాం. ఎవర్ని దురదృష్టం వరిస్తే వాళ్ళు చచ్చిపోతారు. ఇందులో ఎలాంటి మోసం లేదు.

ఒకవేళ నేను చచ్చిపోతే, మీరిద్దరూ సుఖంగా ఉండవచ్చు. నువ్వు చచ్చిపోతే, నేను, సుభద్రా మళ్ళీ హాయిగా ఉంటాం. లేదా సుభద్ర చనిపోయిందా ఇద్దరికి ఎలాంటి సమస్యా ఉండదు. అయితే త్రాగే ముందు ముగ్గురం ఆత్మహత్య వుత్తరం వ్రాసి పెట్టుకోవాలి. ఏమంటారు?’ చెప్పడం ఆపి, వాళ్ళ మొహాల వైపు చూశాడు.

ఇద్దరి మొహాల్లో భయం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది

చక్రవర్తి నవ్వాడు. ‘అంత భయం ఎందుకు! నా చేతుల్లో ఉన్నదీ విషం కలిపిందికావచ్చు. ఇది కేవలం ధర్మయుద్ధం వంటిది. మీ ఇద్దరికి ఇష్టమైతే సమస్య సులభంగా పరిష్కారమౌతుంది. ఏమంటారు.’

“ఇందులో మోసం ఏమీ లేదు కదా?” భయంగా అడిగాడు మారుతి.

“లేదు! మీకా భయం అక్కర్లేదు! నా వైపు

చూడు. నాకు ప్రాణం మీద తీపి లేదు. నేను చని పోయినా బాధపడను. ఎందుకంటే ఆ తర్వాత సుభద్ర ఎవరికి దక్కుతుందో నాకు తెలియదు కాబట్టి బాధ పడే అవకాశం లేదు. నేను బతికినా, సుభద్ర నాకు దూరమైతే నేను బ్రతకలేను. సరేనా ?"

మారుతి రెండు నిముషాలు ఆలోచించి తల ఊపాడు.

చక్రవర్తి. సుభద్రవైపు చూశాడు. సుభద్ర మాట్లాడ లేదు.

"సుభద్రా ! అనవసరంగా బాధ పడకు. నీవు బ్రతి కావా , నీ ప్రియుడో, భర్తో నీకు దక్కుతాడు. నువ్వు పోయావా ? మా ఇద్దర్లో ఎవర్నో ఒక్కర్ని క్షోభ పెట్టాననే పాపచింత నీకు లేకుండా పోతుంది!" అన్నాడు చక్రవర్తి.

సుభద్ర మౌనంగా తల ఊపింది.

"వెల్ ! సమస్య తేలిపోయింది. ఇక వెళదాం; కాని ముగ్గురిలో నిజాయితీ ఉండాలి. మగ్గుకం త్రాగాలి. తెల్ల వారగానే, ఎవరు బ్రతికున్నా ఇక్కడకు రావాలి ! సరేనా !"

ముగ్గురూ తల ఊపారు.

ఇద్దరూ సుభద్రకు టాటా చెప్పి, బయటకు నడిచారు.

8

సుభద్ర మంచం మీద పడుకొని ఆలోచిస్తుంది.

ఎదురుగా టేబులు మీద బెడ్‌లైట్ వెలుగులో మృత్యుదేవతలా ఉంది 'బీర్' బాటిల్. లేచి వెళ్ళి దాని వైపు పరీక్షగా చూచింది. కొత్తదనం ఏమీ కన్పించలేదు.

కార్క్ ఊడదీసి వాసన చూచింది. మామూలుగా ఉంది.

"ఒక్క గుటక త్రాగితే?"

"అమ్మో! అయినా తనెందుకు తాగాలి? నూరేళ్ళ జీవితం, నిండు యవ్వనం ఎందుకు బలి చేసుకోవాలి? ఒకవేళ వాళ్ళిద్దరిలో ఎవ్వరు బ్రతికినా తనకు బాధ లేదు. కాని తనే చనిపోతే?

అయినా ఎందుకు చావాలి? వాళ్ళిద్దరూ బ్రతికినా తనకు పెద్ద సమస్య కాదు. ఎవరితోనైనా ఉండగలదు?

అలాంటప్పుడు అనవసరంగా ప్రాణాల మీదకు ఎందుకు తెచ్చుకోవాలి?"

బీర్ బాటిల్ తీసుకెళ్ళి బాత్‌రూంలో పారబోసి, హాయిగా పడుకుంది.

తెల్లవారగానే ఇద్దర్లో ఎవరొస్తారు? ఇద్దరూ వస్తారా... ఆలోచిస్తు పడుకుంది.?

9

సుభద్ర నిద్ర లేచేసరికి ఎనిమిది దాటింది. క్రిందటి రోజు విషయం జ్ఞప్తికి రాగానే హడావుడిగా క్రిందకు దిగి వచ్చింది.

క్రింద హాల్లో సోఫాలో కూర్చొని సిగరెట్ కాలుస్తున్నాడు చక్రవర్తి. సుభద్ర ఆశ్చర్యపడింది.

చక్రవర్తి చిన్నగా నవ్వాడు.

"అయితే మారుతి....?" మధ్యలోనే ఆపేసింది.

చక్రవర్తి నవ్వి "తప్పదు. అతనే చావాలి. ఎవర్ని ఎలా చంపాలో నాకు తెలుసు?" అన్నాడు గర్వంగా.

సుభద్ర ఆశ్చర్యపడి "ఆ విషం సీసా అతనికి ఎలా అందింది?" అంది అనుమానంగా.

చక్రవర్తి పకపకా నవ్వి, "ఆ రహస్యం నీ కింకా అర్థం కాలేదు. నిజానికి మూడు బాటిల్స్‌లో విషం కలిపాను. కలిపింది నేనే కాబట్టి నేను తాగను కదా! పోతే నీ విషయం నాకు తెలుసు. మా ఇద్దర్లో ఎవరు బ్రతికినా నీకు అభ్యంతరం లేదు. అందుకే నువ్వు తాగవని తెల్సు. ఇకపోతే అతనే! అతని చేత ఆ మాత్రం తాగించటం పెద్ద కష్టం కాదు!!" పకపక నవ్వుతూనే ఉన్నాడు చక్రవర్తి.

సుభద్ర కొయ్యబారిపోయింది.

"ప్లాస్టర్ సెలవు"

ఆ రోజే ఉద్యోగంలో చేరిన రాజు మేనేజరు వద్ద కెళ్ళి "ఒక ప్లాస్టర్ సెలవు ఇప్పించండి సార్" అన్నాడు వినయంగా.

"మిస్టర్! మీరిక్కడ చేయవలసింది కరస్పాండెన్సు గానీ ఎలక్ట్రిక్ తీగలతికించటం కాదు. సెలవెందుకు?" అన్నాడు కోపంగా.

"అదేంటి సార్! మీరేగా ఉదయం పది గంటలు నుండీ సాయంత్రం అయ్యేవరకూ సీటుకతుక్కుపోయి పని చెయ్యాలన్నారు?" అన్నాడాశ్చర్యంగా!

— సుంచు కృష్ణస్వామి,
నిజామాబాద్.

సీరియల్

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

(గత సంచిక తరువాయి)

"కూతురు దారిద్ర్యం అనుభవిస్తోందని వాళ్ళకి తెలుసు-భవిష్యత్ బాగుపడే నమ్మకం లేదు. శుక్లాని అంతం చేస్తే ఆస్తి అల్లుడికి చెందుతుంది. అప్పుడు కూతురు క్షేమంగా వుంటుంది.

ఇక శుక్లాకి అందిన బెదిరింపు లేఖ గురించి, ప్రొఫె

సర్ శర్మ హత్య ఎలా జరిగిందో వాళ్ళకి తెలుసు కాబట్టి ఈ హత్య కూడా అదే పద్ధతిలో చేస్తే అనుమానం వాళ్ళ మీదికి రాదు - ఇప్పటి పరిస్థితిని బట్టి ఇంతకంటే ఏమీ చెప్పలేను",

కారు బంగళా చేరుకుంది. గేటు దగ్గర ఇద్దరు కానిస్టేబిల్స్ డ్యూటీలో వున్నారు. కార్లో డిటెక్టివ్‌లని చూసి లోని కెళ్ళడానికి అనుమతించారు.

జాన్ కారును పోర్టికోలో ఆపాడు. 'సడెన్' చెంగున బయటికి దూకింది. ఆ తర్వాత ఇద్దరూ దిగారు.

ఇద్దరూ హాల్లో కెళ్ళగానే ఎదురుగా రంభ, ఆమె భర్త కన్పించారు. వారి ముఖాలు ఇంకా విచారంగా వున్నాయి.

డిటెక్టివ్‌లని చూసి ఉలికిపడి, 'మీరా !' అన్నాడు ఆశ్చర్యంగా సింగ్.

'ఏం ? మేం మళ్ళీ రామకున్నారా ?' అడిగాడు జాన్ 'ఆరాత్రి మీరిద్దరూ అబద్ధాలు చెప్పారు-'.

'అబద్ధాలు చెప్పామా !' అర్చింది రంభ.

'అవును. వీరేంద్ర భార్య మీ కూతురని ఎందుకు చెప్పలేదు ?' వాళ్ళిద్దరు-అదిరి పోయారు.

'మీరు - మీరు - అక్కడికి కెళ్ళారా ? ఈ విషయం జానకి చెప్పిందా ?" బలహీనంగా అన్నాడు సింగ్.

'మేం ఇప్పుడు అక్కడి నుంచే వస్తున్నాం జానకి ఏమీ చెప్పలేదు. ఆ ఇంట్లో మీ ఇద్దరి ఫోటో వుంది' అన్నాడు జాన్.

వాళ్ళిద్దరు అయోమయంగా చూడసాగారు.

లాల్ అన్నాడు, 'నేను జానకితో మాట్లాడాను. రాత్రి నువ్వు ఫోన్ చేసి ప్రొఫెసర్ హత్యగురించి చెప్పావట. మేం విచారిస్తే పక్కింటికి రాత్రి నువ్వు ఫోన్ చెయ్య లేదని తెలిసింది. నీ కూతురి ముఖం చూస్తే రాత్రంతా నిద్ర పోనట్టు తెలుస్తోంది. రాత్రంతా ఇంట్లోనే వున్నానని చెప్పింది. కానీ లేదని నా అనుమానం. రాత్రి ఆమె, ఆమె భర్త ఇక్కడికొచ్చారు-ప్రొఫెసర్ని కలుసుకో డానికి. అవునా ?

రంభ నిశ్చ్చలంగా చూసింది.

'అవునా ?' లాల్ గద్దించాడు.

'అవును !' అందామె ఛటుక్కున. 'జానకి రాత్రి వచ్చింది వంటరిగా-వీరేంద్ర రాలేదు.'

'ఎన్ని గంటలకి ?'

'బాంబు పేలకముందు-అంటే ప్రొఫెసర్ గారు ఇంటికి వచ్చిన అయిదు నిమిషాలకి ?'

'వెరీగుడ్ ! వివరంగా చెప్పు '

'అసలేం జరిగిందంటే-'

రంభ ఆగిపోయి భర్తని చూసింది. అతను నీరసంగా తలూపాడు.

ఆమె లాల్ వేపు తిరిగి అంది, 'ప్రొఫెసర్ గారు బయటి నుంచి వచ్చి తలుపులూ, కిటికీలూ మూసెయ్య మన్నారు. నా కేమీ అర్థంగాక హాలుతలుపు మూస్తోంటే అవతలి నుంచి బలంగా ఎవరో నెట్టారు. నేను భయ పడ్డాను.

ద్వారంలో జానకి వుంది. ఆమె ఎందుకొచ్చిందో నా కర్థమైంది. కొద్ది రోజుల్లో ప్రసవించబోతోంది - చేతిలో

డబ్బులేదు. రోజు గడవడమే కష్టంగా బ్రతుకుతోంది - ఇక్కడికి ప్రొఫెసర్‌ని డబ్బు అడగడానికి వచ్చింది. అంతకు ముందు రెండుసార్లు వచ్చి నాతో చెప్పింది.

ఇప్పుడు నేను లోనికి రానీయకపోతే గొడవ జరుగుతుంది. రానిచ్చినా గొడవ జరుగుతుంది-ప్రొఫెసర్ నాకు గట్టిగా చెప్పారు-ఆమెని గానీ, వీరేంద్రని గానీ ఇంట్లోకి రానిస్తే నన్ను బయటికి గెంటేస్తానని".

"నువ్వేం చేశావు ?"

'రాబోయే ప్రమాదం నుంచి తప్పించుకోడానికి తెలివి తప్పినట్టు నటించి కింద పడిపోయాను' అంది రంభ.

'అప్పుడేం జరిగింది ?'

'జానకి లోనికొచ్చేసింది. నేను తెలివితప్పి పడిపోయాను గనుక ప్రొఫెసర్‌కి నా మీద అనుమానం రాదు. పైగా జానకి ఆయన్ని కలుసు కుంటుంది. జానకి ప్రొఫెసర్‌ని కలుసుకుని ప్రాధేయ పడింది. చాలా సేపు బ్రతిమాలింది. ఆయన విన్పించు కోలేదు-నాకు తెలుసు, ఆయన పట్టుదల ఎలాటిదో.

జానకి మాటలు విన్పించకుండా ఆమెని ఈడ్చుకొచ్చి బయటికి గెంటేశారు.'

"అంతేనా ?"

'అవును, అంతే' చెమటలు తుడుచుకుంటూ అంది రంభ.

"సరే, నువ్వు తెలివి తప్పి పడిపోయాక లోనికి ఇంకెవరేనా వచ్చారా ?"

'లేదు !'

'జాగ్రత్తగా ఆలోచించి చెప్పు! వీరేంద్ర వచ్చాడా

'లేదు !'

'నీ కెలా తెలుసు ?'

'జానకి లోని కొచ్చాక నేను ఓరగా కళ్ళు తెరచి చూడసాగాను—గదిలో మాటలు వింటూ.'

'జానకిని బయటికి గెంటేశాక ఏం జరిగింది? ప్రొఫెసర్ నిన్ను లేపాడా ?'

'అవును. నన్ను లేపి తలుపు మూసేశారు. నన్ను మా గదికెళ్ళి తలుపు వేసుకోమన్నారు. అలాగే చేశాను. కానీ—ఇంతలో—పెద్దగా చప్పుడు వినిపించింది ! పరిగెత్తి వచ్చి చూస్తే—గదిలో—ప్రొఫెసర్—'

ఆ తర్వాత ఆమె మాటలు పెగల్లేదు. వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

లాల్, జాన్‌ని చూశాడు. జాన్ నిట్టూర్చాడు.

'ప్రొఫెసర్ ఎలా హత్య చెయ్యబడ్డాడో నీకు తెలుసా "? అడిగాడు జాన్, సింగ్‌ని.

'తెలుసు. ఆయన మీద ఎవరో బాంబు విసిరారు.'

'వీరేంద్ర దగ్గర రెండు బాంబులున్నాయని నీకు తెలుసా ?'

అదిరిపడ్డాడు సింగ్ ! 'ఏమిటీ! అతని దగ్గర ఎక్కడివి ?'

'నీకూతురు జానకి చెప్పింది.'

'నాకు తెలియదు ! నా కేమీ తెలియదు ! రంభ ! వీరేంద్ర దగ్గర బాంబు లెక్కడివి ?'

రంభ తేరుకుంది, 'వున్నాయి. వాటిని అమ్మేసినట్టు జానకి చెప్పింది.'

సింగ్ ముఖంలో రంగులు మారాయి, 'ఎవరికి ?'

'ఎవరో ఇద్దరు ఇంటికి వచ్చారట. అయిదు వందలకి అమ్మేశారట.,

సింగ్ గాభరాగా జాన్‌ని చూశాడు.

జాన్ నవ్వి అడిగాడు, 'ఆ ఇద్దరెవరో నీకుతెలుసా?'

'ఓహ్, తెలియదు! నా కేమీ తెలియదు!' అర్చాడు సింగ్.

ఇంతలో వరండాలో అడుగుల చప్పుడు విన్పించింది. ఒక స్త్రీ కంఠం డ్యూటీలో వున్న కానిస్టేబిల్‌ని ఏదో అడుగుతోంది. కొన్నిక్షణాలయ్యాక కెవ్వున అర్చింది. వేగంగా పరిగెత్తి హాల్లోకొచ్చింది. 'అనూరాధ. ప్రొఫెసర్ గారి సెక్రటరీ' అంది రంభ.

17

సెక్రటరీ అనూరాధ ఏడుస్తూ ప్రొఫెసర్ బెడ్ రూంలోకి, ఆ తర్వాత స్టడీ రూం లోకి పరిగెత్తింది. చివరకి హాల్లో కొచ్చి రంభ సింగ్ లని చూసింది. కానీ డిటెక్టివ్ లని చూసి అవాక్కయిపోయింది.

లాల్ కళ్ళు ఆమె మీద పడ్డాయి. అనూరాధ ముప్ఫై ఏళ్ళ వయసులో వున్న అందమైన విధవ. చామనఛాయ రంగు. మామూలు ఎత్తు. ఆమె ముఖంలో జాగ్రత్తగా చూస్తే ఆమెకి ప్రొఫెసర్ పట్ల ప్రేమ వుందని తెలుస్తుంది.

'నేను లాల్‌ని. ఇతను జాన్. మా గురించి మీకు తెలుసనుకుంటాను. జరిగిన దానికి నేను చాలా చింతిస్తున్నాను. మిసెస్ అనూరాధ, ఈ ట్రాజెడీ గురించి మీకిప్పుడే తెలిసిందా?'

ఆమె ముఖం తుడుచుకుని, దుఃఖం ఆపుకొని లాల్‌ని చూసింది.

'అవును. నా కెలా తెలుస్తుంది ? రాత్రి నా కెవరూ ఫోన్ చెయ్యలేదు ! ఉదయం నేను పేపర్ కూడ చూడ లేదు ! ఓహ్, ఇలాటి వార్త నేను జీవితంలో ఎన్నడూ విన్లేదు !' అందామె ఆందోళనగా.

'మిసెస్ అనూరాధ, ప్రొఫెసర్ గదిలో మా కో ఉత్తరం దొరికింది–నీలిరంగుకవరులో. అదెలా వచ్చిందో చెప్పగలరా ?'

ఆమె తలూపింది. 'ఆ ఉత్తరం ప్రొఫెసర్‌కి నేనే ఇచ్చాను. దాన్ని ఎవరో అమ్మాయి నా కిచ్చి వెళ్ళింది.'

'మీ రామె పేరడిగారా ?'

'అడిగాను. శ్యామసుందరి అని చెప్పింది.'

'శ్యామసుందరి !'

'అవును'

జాన్ అయోమయంగా చూశాడు లాల్‌ని. లాల్ నవ్వి వూరుకున్నాడు.

'వెల్, వెల్, వెల్ !....మిసెస్ అనూరాధ, ఆమె ఏం చెప్పింది?'

ఆమె జాన్‌ను చూసి అంది. "తను యూనివర్శిటీలో ఎమ్మే చదువుతున్నట్టు చెప్పింది. ప్రొఫెసర్‌తో ఒక ముఖ్యవిషయం మాట్లాడేందుకు వచ్చినట్టు చెప్పింది. ఒక వేళ ప్రొఫెసర్ వుండరేమో సన్న అనుమానంతో ఒక ఉత్తరం వ్రాసి తెచ్చుకున్నట్టు చెప్పింది. అనుకున్నట్టు నే ఆయన ఇంట్లో లేరు కాబట్టి, ఆ వుత్తరం నా కిచ్చి

మర్చిపోకుండా ప్రొఫెసర్‌కి ఇమ్మంది. ఆ తర్వాత వెళ్ళి పోయింది.'

జాన్ ముక్కుమీద వేలేసుకుని కాస్సేపాలోచించి. అన్నాడు, 'ఆమెనివర్ణించగలరా ?"

'చాలా చురుకైన అమ్మాయి. చలాకీగా మాట్లాడింది. వయసు ఇరవై పైన వుంటుంది. కళ్ళలో చిలిపితనం వుంది. వెంట్రుకలు భుజాల వరకు కత్తిరించుకుంది. బ్లూ కలర్ బెల్‌బాటం, షర్టులో వుంది—వెనకనుంచి చూస్తే సన్నగా, పొడుగ్గా, అబ్బాయిలా కనిపించింది."

ఆమె మాటలు విని లాల్ మెదడులో ఒక మెరుపు మెరిసింది.

హోటల్ మయూర్‌లో ప్రొఫెసర్‌ని హత్య చేసిన స్త్రీ మెదిలింది.

స్ప్రింగుల నుపయోగించి భవనాల నెక్కడం అభ్యసించిన స్త్రీ !

తనువూహించుకుంటున్న ఆమె విగ్రహానికి, ఇప్పుడు అనూరాధ వర్ణించిన అమ్మాయికీ చాలాపోలికలున్నాయి!

అంతే గాక ఆమె తన పేరు 'శ్యామసుందరి' అని చెప్పడంతో అనుమానం ఇంకా బలపడింది.

'మిసెస్ అనూరాధ, ఆమె దేనిమీద వచ్చింది ?" జాన్ అడిగాడు.

"లేడీ సైకిల్ మీద"

'ఐసీ ! ఇప్పుడు చెప్పండి, ప్రొఫెసర్ గారికి ఒక కుమారుడు వున్నట్టు మీకు తెలుసా ?'

ఆమె తలూపింది, 'తెలుసు. వీరేంద్ర నాకు తెలుసు.

రెండు మూడు సార్లు నా సమక్షంలోనే తండ్రిని కలుసు కున్నాడు. తన పరిస్థితి విన్నవించుకుని డబ్బు సహాయం చెయ్యమన్నాడు. కాని ప్రొఫెసర్ ఒక షరతు పెట్టారు. ఆ షరతు ఒప్పుకుంటే ధన సహాయం చేస్తానన్నారు.'

జాన్, లాల్‌ని చూశాడు, 'ఏమిటా షరతు ?"

అనూరాధ అంది, 'వీరేంద్ర భార్యాపిల్లల్ని వదిలేస్తే, ఆస్తిమొత్తం వ్రాసిఇస్తానని ప్రొఫెసర్ చెప్పారు. అంతే గాక, ఆ భార్యా పిల్లలు బ్రతకడానికేదేనా ఏర్పాటు కూడా చేస్తానన్నారు. కానీ, వీరేంద్ర ఈ షరతు ఒప్పుకో లేదు."

'వీరేంద్ర చివరసారి తండ్రిని ఎప్పుడు కలిశాడు?'

'నాలుగు రోజుల క్రితం" అంది అనూరాధ,' ప్రొఫెసర్ అతనికి వారం రోజుల అల్టిమేటమ్ ఇచ్చారు. వారంరోజుల్లో భార్యా పిల్లల్ని వదిలేస్తే ఆస్తి చెందు తుందని, లేదా, జీవితాంతం అదే దారిద్ర్యం అనుభ వించ వలసి వుంటుందనీ చెప్పారు."

'ప్రొఫెసర్, వీరేంద్రకి వారంరోజుల అల్టిమేటమ్ ఇచ్చారా ?"

'అవును. ఇంకా మూడురోజులు మిగిలి వున్నాయి"

ప్రొఫెసర్ యోగీంద్రనాథ్ శుక్లా జీవిత రహస్యంలో ఈ కొత్త విషయం విని ఆశ్చర్యపోయాడు లాల్.

'ప్రొఫెసర్‌కి ఎవరయినా లాయర్ వున్నాడా ?' జాన్ అడిగాడు.

తలూపిందామె, 'మిష్టర్ సంఘర్షన్ రెడ్డి. బషీర్ బాగ్‌లో హోటల్ నాగార్జున ప్రక్కన ఆఫీసు వుంది.'

'థాంక్స్. నేనొక ప్రశ్న అడగాలనుకుంటున్నాడు.

'ఇప్పటి వరకు అడుగుతూనే వున్నారు.'

'అవును. అయితే ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది.'

ఆమె కళ్ళు చిట్లించి, 'అడగండి' అంది.

జాన్ అన్నాడు 'ప్రొఫెసర్ ఢిల్లీ ఎందుకెళ్ళారు'.

ఆమె తేలిగ్గా వూపిరి వదిలింది. 'ఈ ప్రశ్న అంత ముఖ్యమైనదా ? క్షమించండి. నాకు తెలియదు.'

'మీకు చెప్పి వెళ్ళలేదా'

'చెప్పి వెళ్ళారు. కానీ దేనికి వెళుతున్నారో చెప్పలేదు.'

'ఎందుకు చెప్పలేదు ? మీ రాయన సెక్రటరీ కాదా?'

'సెక్రటరీనే. కానీ ఆయన వ్యక్తిగత విషయాలు నాతో చర్చించరు.'

'ఆయన ఢిల్లీ వెళ్ళింది వ్యక్తిగత విషయం మీదనా?'

'నాకు తెలియదు.'

'మంచిది. ప్రొఫెసర్ శంకర్ దయాళ్ ఎవరో తెలుసా ?'

'మొన్న హత్య కాబడ్డాడు–ఆయనే కదూ? – ఆయన గురించి పత్రికల్లో చదివాను.'

'అంతకు ముందు తెలియదా ?'

అడ్డంగా తలూపిందామె.

'ఆయన మీ ప్రొఫెసర్ స్నేహితుడని తెలియదా ?'

'ఏమిటీ ?'

'ఓహ్, ఐ యాం సారీ. మిమ్మల్ని కంగారు పరుస్తున్నానా ?....వాళ్ళిద్దరు కలిసి ఏదో పని చేస్తున్నట్టు మీకు తెలుసా ?'

'నా కేమీ తెలీదు !'

'పోనీ, మీ ప్రొఫెసర్‌కి సి.బి.ఐ.తో రహస్య సంబంధాలున్నాయని తెలుసా?,

'సి. బి. ఐ. !' గాభరాగా అర్చిందామె. 'మిస్టర్ జాన్ ! ఈ విషయం ఇప్పుడే వింటున్నాను !'

'నెవర్ మైండ్. మీ ప్రొఫెసర్ ఏదో సీక్రెట్ జాబ్ చేస్తుండడం వల్లనే హత్య చెయ్య బడ్డారు .... ఆయన ఏదో పరిశోధన చేస్తున్నారని విన్నాను. ఎలాటి పరిశోధన చెప్పగలరా ?'

కాస్సేపయ్యాక తేలికపడి అందామె. 'ఆయన పరిశోధనకి, హత్యకి ఏమీ సంబంధం లేదు. ఆయన చరిత్రని పరిశోధిస్తున్నారు. జీవితాంతం పరిశోధిస్తారు. అ రాక్‌లో వున్న పుస్తకాలు ఆయన వ్రాసినవే .... చాలా వరకు ఆయన పుస్తకాలు కాలేజీల్లో పాఠ్యాంశాలుగా స్వీకరించ బడ్డాయి. అయితే, మిస్టర్ జాన్, ఆయన సి.బి.ఐ.లో కోసం పని చేస్తున్నారని మీ కెవరు చెప్పారు ?'

'నెవర్ మైండ్. మర్చిపోండి. మేం ఆయన హంతకుల్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. మీ రనవసరంగా అందోళన చెంది అరోగ్యం పాడుచేసుకోకండి.,

అనూరాధ నిట్టూర్చింది. 'నా కింకేం మిగిలింది ? ఆయన ప్రేమ పొందాలని తపించి పోయాను. కానీ నా ప్రేమ వ్యక్తం చెయ్యడానికి భయపడ్డాను. ప్చ్, ఈ బ్రతుకింతే....'

,ఐయాం సారీ. మీ దురదృష్టానికి చింతిస్తున్నాను.'

,మిస్టర్ జాన్, మీ గురించీ, కాంతిలాల్ గురించీ విన్నాను. మీ కేసులు కొన్ని చదివాను. మీ రిప్పుడు పని చేస్తున్న కేసు వాటన్నిటి కంటే క్లిష్టమైనది. త్వరలో

హంతకుల్ని పట్టుకోవాలని కోరుతున్నాను-అప్పటి వరకు నాకు శాంతి వుండదు !' అందామె ఆందోళనగా.

డిటెక్టివ్‌లు ఆమెని ఓదార్చి సెలవు తీసుకున్నారు.

18

'దిసీజ్ ఎ డామ్ స్ట్రేంజ్ ఎఫైర్ యార్ !' అన్నాడు జాన్ కారు స్టార్ట్ చేసి, 'ఇప్పుడెక్కడికి ?'

లాల్ వెనక సీట్లో కూచొని, 'లాయర్ సంఘర్షన్ రెడ్డి' అన్నాడు

'సడెన్' జాన్ పక్కన కూచుంది. కారు గేటు లోంచి బయటకి వచ్చి రోడ్డెక్కింది.

జాన్ ఎడమ వేపుకి తిప్పి స్పీడు పెంచాడు. కారు కొంత దూరం నిశ్శబ్దంగా ప్రయాణించింది. లాల్ సిగరెట్ వెల్గించి ఆలోచిస్తున్నాడు. జాన్ సూటిగా రోడ్డుకేసిచూస్తూ డ్రైవ్ చేస్తున్నాడు.

ఉన్నట్టుండి 'సడెన్' మొరిగింది.

జాన్ తిరిగి దాన్ని చూశాడు, 'వాట్ మైడియర్ ?'

కుక్క మళ్ళీ మొరిగింది - తలాడిస్తూ ముందుకు చూస్తూ.

జాన్ తలతిప్పి రోడ్డు మీదికి చూశాడు-నిర్మానుష్యంగా వున్న వీధిలో, వంద గజాల దూరాన ఎడమ పైపున ఎలిక్ట్రిక్ పోల్ దగ్గర ఇద్దరు మనుషులు నిలబడి వున్నారు.

జాన్ ఉలికిపడ్డాడు. 'సడెన్'ని చూసి, 'యూ ఆర్ గ్రేట్, మైడియర్ !' అన్నాడు.

'ఏమిటి జాన్ ?' లాల్ అడిగాడు తేరుకుని.

'తిన్నగా చూడు' కారు స్పీడు తగ్గించి అన్నాడు జాన్.

లాల్ ముందుకి వంగి విండ్ స్క్రీన్‌లోంచి ఎదురుగా చూశాడు.

ఈసారి ఆ మనుషులు ఎనభై గజాల దూరాన వున్నారు. ఇద్దరూ సన్నగా, పొడుగ్గా, తెల్లగా వున్నారు.

ఇద్దరి కళ్ళూ కారుకేసి ఉన్నాయి.

ఇద్దరి చేతులూ జేబుల్లో వున్నాయి.

'మన కోసం కాచుకున్నారు! జేబుల్లో రివాల్వార్స్ ఉన్నాయి!' అన్నాడు లాల్. మరు క్షణం అతని చేతిలో రివల్వార్ ప్రత్యక్షమైంది.

'జాన్, కారుస్పీడు పెంచు— రాకెట్ స్పీడ్. కుడి చేతిలో రివల్వార్ పట్టుకో. వాళ్ళని దాటుతూ, వాళ్ళు షూట్ చేసే లోపున మనం ట్రిగ్గర్ లాగాలి. బి కేర్‌ఫుల్. వాళ్ళకేమాత్రం అవకాశం చిక్కకూడదు! లెటజ్ గో!'

జాన్ ఎక్సలేటర్ బలంగా నొక్కి జేబులోంచి రివల్వార్ తీశాడు. ఇప్పుడు దూరం యాభై గజాలుంది. లాల్ కిటికీవేపు జరిగిసీటునానుకుని చూచున్నాడు. ఆ ఇద్దరూ వేగంగా వస్తున్నకారును చూసి తటాలున ముందుకు కదిలారు. జాన్ స్టీరింగ్‌ని ఎడమచేతిలో తీసికుని రివాల్వార్ కుడిచేతితో పట్టుకున్నాడు. మరు నిమిషంలో కారు వాళ్ళని చేరుకుంటుందనగా, ఆ ఇద్దరు మనుషులు ఛటుక్కున జేబులోంచి రివాల్వార్స్ తీశారు.

స్పీడామీటర్ డెభై చూపిస్తుంటే జాన్ అదే వేగంతో

కారుని వంకరటింకరగా తిప్పేస్తూ ముందుకు సాగించాడు. సరిగ్గా ఎలక్ట్రిక్ పోల్‌ని చేరుకునే సరికి ఆ మనుషుల రివాల్వర్స్ శబ్దం కాకుండా పేలాయి. బుల్లెట్స్ గుట్టు చప్పుడు కాకుండా ఎదురింట్లోకి దూసుకెళ్ళాయి

అదే క్షణంలో డిటెక్టివ్‌ల చేతిలోని రివాలర్స్ క్షణం విరామంలేకుండా నాలుగుసార్లు గర్జించాయి- శత్రువులు సుదీర్ఘమైన ఆర్తనాదంతో నేల కూలారు.

మరుక్షణం నడెన్ కిటికీలోంచి ఛెంగున బయటికి దూకింది. డిటెక్టివ్‌లు విస్తుపోయేంతలో అది శవాల దగ్గరినుంచి ఒక పిస్తోలు నోటకరిచి రివ్వునపరిగెత్తివచ్చి కార్లోకి దూకింది.

జాన్ పిస్తోలుఅందుకుని, "యూ ఆర్ గ్రేట్ డాగ్, మై సన్!" అన్నాడు.

కారు వీధిదాటి మెయిన్ రోడ్డెక్కింది.

19

రివాల్వర్ షాట్స్ విని పోలీస్ పెట్రోలింగ్ కారు ఎదురుగా దూసుకొచ్చింది.

జాన్ తటాలున బ్రేకు వేశాడు. పోలీసు కారు రివ్వునవచ్చి డిటెక్టివ్‌ల కారుకి కొన్నిఅంగుళాల ఎడంగా మాత్రమే ఒక్క కుదుపుతో ఆగింది.

ఒక ఇన్‌స్పెక్టర్ తల బయటపెట్టి, "మిస్టర్ జాన్! ఏంజరిగింది?" అనర్చాడు.

జాన్‌నవ్వి వెక్కి తిరిగి లాల్‌ని చూశాడు. లాల్ కారు దిగి ఇన్‌స్పెక్టర్ దగ్గర కెళ్ళాడు, ఇన్‌స్పెక్టర్

కూడ కారుదిగాడు.

"త్వరగా ఆ వీధిలో అంబులెన్స్ పంపండి!" అన్నాడు లాల్ చూపిస్తూ.

"ఎందుకు?"

"అక్కడ రెండు శవాలున్నాయి- ఒక ఎలక్ట్రిక్ పోల్ వగ్గర. వాళ్ళు మమ్మల్ని షూట్ చెయ్యాలనుకున్నారు- సైలెన్సర్ రివాల్వర్‌తో," లాల్ వెనక్కి తిరిగి జాన్ అందించిన రివాల్వర్ తీసుకున్నాడు. దాన్ని ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చి, వాళ్ళు ప్రయోగించిన తూటాలు బహుశ ఎదురిట్లో దూసుకెళ్ళి వుండాలి. కానీ-బదులుగా రేకలేమీ విన్పించలేదు కాబట్టి ఎవరికి హాని జరగలేదనుకుంటాను. వెంటనే వెళ్ళిచూడండి' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ వెనక్కి తిరిగి కార్లోవున్న మరో ఇద్దరు అధికారులకి ఏదో చెప్పాడు.

లాల్ ముందుకుజరిగి కార్లోవున్న అధికారులతో అన్నాడు:

"శవాల్ని హెడ్ క్వార్టర్స్‌లో క్రైం ఇన్‌స్పెక్టర్ కృష్ణన్‌కి అప్పగించండి మేం తర్వాత వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తామని చెప్పండి!

కారు ముందుకు దూసుకెళ్ళింది.

"లాల్, ఇది మీ పైన రెండవ హత్యా ప్రయత్నం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కాదు, మూడవది" అన్నాడు లాల్.

"వాట్! లాల్, మీరలా నిర్లక్ష్యంగా తిరగడం మంచిది కాదు."

లాల్ నవ్వి వూరుకున్నాడు.

'మిస్టర్ లాల్,' మళ్ళీ అన్నాడు ఇన్‌స్పెక్టర్, "పరిస్థితి ఏమీ బాగాలేదు. సిటీలో నాలుగు చోట్ల ఫైరింగ్ జరిగింది. విద్యార్థులు రెండు హోటళ్ళు, రెండు పత్రికాఫీసులు తగుల బెట్టారు. చాలా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది....'

లాల్ ముఖం ఎర్రబడింది, "ఐసీ!"

"కర్ఫ్యూ విధించే సూచనలున్నాయి." మళ్ళీ అన్నాడు ఇన్‌స్పెక్టర్, 'బహుశ కొన్ని నిమిషాల్లో సైరన్ మోగవచ్చు....'

అదే క్షణాన ఒక పోలీసు కారు ఎదురుగా వస్తూ కన్పించింది. లౌడ్ స్పీకర్ లోంచి ప్రకటన వినబడుతోంది.

ప్రకటనలో ముఖ్యాంశాలు:-

'....నగర వాసులకు ముఖ్య ప్రకటన....జంట నగరాల్లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటం వలన మరో పది నిమిషాల తర్వాత సరిగ్గా పన్నెండు గంటలకి కర్ఫ్యూ విధించబడుతుంది....ఈ కర్ఫ్యూ రేపు ఉదయం ఎనిమిది గంటల వరకు అమలులో వుంటుంది....నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారు కాల్చివేయబడతారు.... ....'

'లాల్‌గారూ! ఇక మీరు ఇంట్లో వుండటం మంచిది.' అన్నాడు ఇన్‌స్పెక్టర్ పోలీసు కారు దాటిపోయాక.

లాల్ ఆందోళనగా చూశాడు; 'ఇన్‌స్పెక్టర్, నేనొక ముఖ్యమైన పని మీద వెళ్ళవలసి వుంది-బషీర్ బాగ్‌లో ఒక లాయర్ ఆఫీసుకి. ఈ లోపు కర్ఫ్యూ విధించబడుతుంది. మీరు మాతో వస్తారా-ఎలాటి చిక్కులు వుండవు?

ఆ తర్వాత మమ్మల్ని విద్యార్థి సంఘర్షణ సమితిలో వదిలి వెళ్ళిపోవచ్చు-ఏమంటారు?'

ఇన్‌స్పెక్టర్ కాస్సేపు ఆలోచించాడు: 'ఓ. కే. ముఖ్యమైన కేసు కాబట్టి మీతో సహకరిస్తాను. పదండి.,

ఇన్‌స్పెక్టర్‌తో కారెక్కాడు లాల్. పావు గంటలో బషీర్ బాగ్‌లో లాయర్ ఆఫీసుకి చేర్చాడు జాన్.

లాయర్ సంఘర్షన్ రెడ్డి యాభై ఏళ్ళ వ్యక్తి ముఖంలో వృద్ధాప్యపు ఛాయలు కన్పిస్తున్నాయి. తెల్ల షర్టు, నల్లకోటు తొడుక్కుని సిగార్ కాలుస్తూ కన్పించాడు.

డిటెక్టివ్‌లనీ, వెనక ఇన్‌స్పెక్టర్‌నీ చూసి ముందుకు తూలి, 'వాట్! వాట్!-ఎక్కడికి?' అన్నాడు గాభరాగా.

ముగ్గురూ వెళ్ళి కుర్చీల్లో కూచున్నారు.

'మీ కోసమే వచ్చాం.' అన్నాడు లాల్. 'ప్రొఫెసర్ యోగీంద్రనాథ్ శుక్లా కేసులో కొన్ని వివరాలు కావాలి.'

లాయర్ కుదుటపడ్డాడు; 'ప్రొఫెసర్ శుక్లా గొప్ప వ్యక్తి. ఆయన్ని, చంపినవాడు మరు జన్మలో జంతువై పుట్టుగాక!'

'ప్రొఫెసర్ వీలునామా వ్రాసినట్టు విన్నానుదా.ని వివరాలు చెప్తారా?'

'ప్రొఫెసర్ హత్య నాకెంతో దుఃఖం కలిగిస్తోంది. పద్దెనిమిదేళ్ళ క్రితం ఆయనొక వీలునామా రిజిస్టర్ చేయించారు. దాని ప్రకారం ఆయన యావదాస్తి ఆయన కుమారుడు-ఏకైక సంతానం వీరేంద్ర శుక్లాకి చెందుతుంది.

'కానీ, నెల రోజుల క్రితం ఆ విల్లును సవరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయం ప్రకారం ఆస్తిని రెండు సమ భాగాలుగా విభజించారు. మొదటి భాగం ఆయన నమ్మకమైన సెక్రటరీ శ్రీమతి అనూరాధ గారికి, రెండవ భాగం యూనివర్సిటీ హిస్టరీ విభాగానికీ చెందుతాయి.'

లాల్ తలూపాడు; 'అయితే ఈ కొత్త విల్లును ఆయన రిజిస్టర్ చేయించారా?'

లాయర్ అడ్డంగా తలూపాడు' లేదు. నేను డాక్యుమెంట్స్ సిద్ధం చేశాను. ఆయన సంతకం చెయ్యవలసి వుంది'

'ఎప్పుడు చేయాలను కున్నారు?'

'ఇంకా మూడు రోజులు సమయం వుంది.'

'దేనికి?'

'ఆయన తన కుమారుడికి అల్టిమేటమ్ ఇచ్చారు. ఆ అల్టిమేటమ్ గడుపు మూడు రోజుల్లో తీరిపోతుంది.

'ఏమిటా అల్టిమేటం?'

'వీరేంద్రకు ఆస్తి చెందాలంటే అతను భార్యాపిల్లల్ని వదిలేయాలి. లేదా, ఆస్తిలో చిల్లి కానీ దక్కదు. జీవితాంతం దారిద్ర్యంలోనే మగ్గిపోవాలి. ఈ విషయమై నిర్ణయం తీసుకోడానికి ఆయన కుమారుడికి వారం రోజులు గడువు ఇచ్చారు అప్పుడు కుమారుడి నిర్ణయాన్ని బట్టి ఆయన కొత్త వీలునామా మీద సంతకం చెయ్యవల్సింది, లేనిదీ ఆలోచిస్తారు. ఇంకా మూడు రోజులు వ్యవధివుంది. వీరేంద్రకి భార్యా పిల్లల్ని వది

లేయడం ఇష్టం లేదు. మిస్టర్ లాల్, నాకో అనుమానం వుంది-"

"'చెప్పండి?"

"వీరేంద్రకి భార్యా పిల్లల్ని వదిలేయడం ఇష్టం లేదు. కాబట్టి అతనికి ఆస్తి దక్కదు. అందువల్ల కొత్త వీలు నామా మీద సంతకం చెయ్యకుండా తండ్రిని చంపే శాడేమో?"

డిటెక్టివ్ లు ఒకర్నొకరు చూసుకున్నారు.

'అలా జరిగి వుంటుందంటారా? లాల్ అడిగాడు.

'ఎందుకు జరక్కూడదు? పాత విల్లు ప్రకారం తండ్రి యావదాస్తి వీరేంద్ర ఒక్కడికే దక్కుతుంది?'

'థాంక్స్, మిస్టర్ రెడ్డి. చాలా విషయాలు చెప్పారు. మేమిక వెళ్తాం.' లేచి కరచాలనం చేశాడు లాల్.

20

ఇంతకీ ఆ కుమారుడెక్కడ వున్నాడు? అడిగాడు జాన్ కారు స్టార్ట్ చేస్తూ.

సమయం 12-30 అయింది. ఎంతో రద్దీ ఉండే విశాలమైన బషీర్ బాగ్ రోడ్డు ఇప్పుడు కర్ఫ్యూ మూలాన నిర్మానుష్యమై పోయింది.

షాపులన్నీ మూసివేయబడ్డాయి. రోడ్డు మీద ఎక్కడా ఒక్క మానవ మాత్రుడు లేడు. వాహనాలు లేవు-గస్తీ తిరుగుతున్న పోలీసు దళాలు తప్ప.

కారు ముందు కెళుతోంది. కొంత దూరంలో ఒక పోలీసు జీపు ఆగివుంది. కారును చూడగానే ఇద్దరు

ఇన్‌స్పెక్టర్లు జీపు దిగారు. జాన్ కారును నెమ్మదిగా పోనిచ్చి వాళ్ళ పక్కన ఆపాడు.

"ఏమిటి మిస్టర్ ? మీరీ లోకంలో లేరా ? యూ డామ్ లిటిల్ ——

ఇన్‌స్పెక్టర్ అరుపుకి అడ్డు తగిలాడు, డిటెక్టివ్‌లతో ఉన్న ఇన్‌స్పెక్టర్, ఎక్స్‌క్యూజ్ మీ. వీరు లాల్ అండ్ జాన్. ఎమర్జెన్సీ పని మీద తిరుగుతున్నారు. నౌ దే ఆర్ గెటింగ్ హోమ్ !

ఆ ఇన్‌స్పెక్టర్ కార్లోని వారందర్నీ చూసి, యూ కెన్ గో ! అని కసిరాడు, మెయిన్ రోడ్స్ మీద కాదు, సందులు గొందులు తిరిగి ఇంటికి చేరుకోండి !

థాంక్యూ, ఇన్‌స్పెక్టర్. అన్నాడు జాన్ కారును ముందుకు పోనిస్తూ.

జాన్ కారును కొంత దూరం పోనిచ్చి 'సైకిలైన్, రోడ్‌లోకి తిప్పాడు.

'వెల్, పార్టనర్. ఇప్పుడు చెప్పు, వీరేంద్ర ఎక్కడ వున్నాడు !'

లాల్ భుజాలెగరేశాడు, 'కృష్ణన్ గాలిస్తుండవచ్చు. ఈ హత్య అతనే చేశాడని ఇప్పుడు నా నమ్మకం బల పడింది.

''హత్య కేసులో ఒక అనుమానితుడు కన్పించనంత మాత్రాన అతనే హంతకుడని భావించలేం ?" అన్నాడు జాన్.

వి. స. స. కార్యాలయం ముందు కారాగగానే లోపల కలకలం బయలుదేరింది. కార్యాలయం తలుపులు మూసి వున్నాయి. డిటెక్టివ్‌లు కారు దిగి తమతో సహకరించి

సందుకు ఇన్‌స్పెక్టర్‌కి థాంక్స్ చెప్పారు. అతను సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. డిటెక్టివ్ లు 'సడెన్' తో సహా కార్యాలయంలోకి నడిచారు. డిటెక్టివ్‌లను చూస్తూనే కొందరు విద్యార్థులు చుట్టుముట్టి అరిచారు.

'కర్ఫ్యూ విధించారు. మీ రిశ్ళకి వెళ్ళి పోకుండా ఇక్కడెందుకున్నారు?' అడిగాడు లాల్.

'మీ రిక్కడికి వస్తారన్న ఆశతో.' అన్నాడొక విద్యార్థి, 'పోలీసులు మా మీద దౌర్జన్యం చేస్తోంటే మీరేం చేస్తున్నారు?'

'ఐయాం సారీ, మీ మీద ఫైరింగ్ జరిగినట్టు విన్నాను. నిజమేనా?'

'అవును'

'ఎలా'

'మేం సెక్రటేరియేట్ ముందు పికెటింగ్ చేస్తున్నాం. ఉద్యోగుల్ని లోని కెళ్ళ నీయకుండా ఘెరావ్ చేస్తున్నాం. ఇంతలో హఠాత్తుగా పోలీసు వాన్లు వచ్చాయి. వార్నింగ్ ఇవ్వకుండా, కారణం చెప్పకుండా రిజర్వు పోలీసులు మా మీద లాఠీ ఛార్జి చేశారు! మేమంతా పారిపోయాం.'

'అసలలా ఎందుకు జరిగింది?'

'తర్వాత తెలిసింది. 'మార్నింగ్ స్టార్' పత్రికాఫీసునీ, మరొక పత్రికాఫీసునీ—ఇంకా రెండు హోటల్స్‌నీ విద్యార్థులు తగుల బెట్టారట! కానీ—అప్పుడక్కడ విద్యార్థులెవరూ లేరు!

'బహుశ గూండాలయి వుంటారు. ఫైరింగ్ జరిగింది మీ మీదకాదు. పోలీసులు పొరబడి ఆ దహన

కారండకు కారకులు మీరనుకుంటున్నారు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. ఫైరింగ్ జరిగింది స్టూడెంట్స్ మీదకాదు, గూండాల మీద సంతోషించండి';

'అసలీ గూండాలు మమ్మల్ని ఎందుకు రెచ్చగొడుతున్నారు?' అన్నాడు శీతల్ ప్రసాద్.

'ఆ విషయం జాన్‌తో చర్చించండి.' అని ఫోన్ వేపు కదిలాడు లాల్.

ఒక నెంబర్ డయల్ చేసి, హల్లో. కృష్ణన్. అన్నాడు.

అవతల కృష్ణన్ కంఠం విన్పించాక, 'మరో రెండు శవాలు పంపించాం. అందాయా?' అనడిగాడు.

'మిస్టర్ లాల్, ఏమిటిదంతా!' కృష్ణన్ అరిచాడు.

'మమ్మల్ని చంపడానికి హంతకులు ప్రయత్నిస్తున్నారు. హతులవుతున్నారు.'

'మీరిప్పుడెక్కడ ఉన్నారు?' అడిగాడు కృష్ణన్.

చెప్పాడు లాల్.

'మిస్టర్ కృష్ణన్, ఆ శవాల్ని గుర్తించారా? ఎవరివి?'

'తెలియదు. వాళ్ళు అస్సామీస్‌లా వున్నారు.

'ఐసీ! ఐతే వీరేంద్ర విషయమేమిటి?'

'గాలిస్తున్నాం. ఎక్కడా దొరకడం లేదు.'

ఒక పని చెయ్యండి. అతని ఇంటి దగ్గర నిఘా వుంచండి.'

"ఆ పని ముందే చేశాను."

"మరొక పని వుంది కృష్ణన్, మరి కొన్ని హత్యలు జరుగుతాయని మీకు ముందే చెప్పాను. ఆ హత్యలు

జరక్కుండా ఒక మార్గం కనిపెట్టాను."

అలాగా ?

అవును-ప్రచార సాధనాలన్నిటినీ వినియోగించుకోండి. ప్రస్తుతం జరిగిన హత్యల స్వరూప స్వభావాల్ని ప్రజలందరికీ తెలియజెయ్యండి. హత్య చేసే ముందు హతులకి ఉత్తరాలు అందుతున్నాయి. కాబట్టి ఎవరికేనా ఎలాటి బెదిరింపు లేఖ అందినా మూర్ఖంగా ప్రవర్తించకుండా వెంటనే పోలీసులకి తెలియజేయమనండి! ఏమంటారు?"

"గుడ్. అయిడియా!"

"వెల్, ఒక పాట్రోలింగ్ ఆఫీసర్ మమ్మల్ని ఇంట్లో కూచోమన్నాడు. ఇది న్యాయమేనా? వెంటనే మాకు రెండు కర్ఫ్యూ పాస్‌లు, ఒక పోలీస్ జీపు పంపండి!"

"అలాగే, లాల్. మీరు ప్రైవేట్ డిటెక్టివ్‌లయినా మా మనుషులుగానే భావిస్తాం. వెంటనే ఆ ఏర్పాట్లు చేస్తాను"

"థాంక్స్" లాల్ లైను కట్ చేశాడు.

జాన్ విద్యార్థులకి సుదీర్ఘమైన ఉపన్యాసాలిస్తున్నాడు. ప్రొఫెసర్ శుక్లా హత్యకూడ విద్యార్థుల్ని రెచ్చగొట్టింది. కానీ ఆవేశాన్ని అదుపు చేసుకున్నారు. తమ ఉద్యమం ఇలా అర్ధాంతంగా నిలిచిపోవడం వారినెంతో బాధించింది. డిటెక్టివ్‌లు ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఉద్యమం విరమించుకోవాలని సలహా ఇచ్చారు.

పావుగంట తర్వాత కృష్ణన్ మళ్ళీ ఫోన్ చేశాడు.

"హల్లో లాల్, గుడ్ న్యూస్! చేప దానికదేవచ్చి వల్లో పడింది! వీరేంద్ర మాకు చిక్కాడు. కర్ఫ్యూ ఆజ్ఞలని ఉల్లంఘిస్తూ పట్టుబడ్డాడు. అతన్ని హెడ్

క్వార్టర్స్‌కి తీసుకొచ్చారు. ఇక్కడే వున్నాడిప్పుడు॥"

"అతను వీరేంద్ర అని మీకెలా తెలుసు?"

"పేరు చెప్పాడు. హత్యకాబడ్డ ప్రొఫెసర్ శుక్లా తన తండ్రి అని చెప్పాడు."

"వెరీ గుడ్. ఇక్కడికి తీసుకురండి।"

"అక్కడికా?"

"అవును. ఇక్కడికే."

"నో, మిస్టర్‌లాల్। స్టూడెంట్స్ నా మీద పడతారు। ఏమైనా చేస్తారు। ఉదయం వాళ్ళమీద చేసిన ఫైరింగ్ రెచ్చగొట్టింది"

"ఉదయం మీరు ఫైరింగ్ చేసింది విద్యార్థుల మీద కాదు. రౌడీ మూక మీద. మీరేమీ భయపడకండి. విద్యార్థులు ప్రశాంతంగా వున్నారు. వెంటనే రండి."

"అయితే వస్తాను. నా కేదేనా సంభవిస్తే బాధ్యత మీదే।"

"వచ్చేటప్పుడు నేను చెప్పినవి తీసుకరండి" ఫోను పెట్టేశాడు లాల్.

21

పావుగంట తర్వాత వి. స. స. కార్యాలయం ముందు రెండు పోలీసు జీపులాగాయి.

రెండు జీపుల్లోంచి ఇన్‌స్పెక్టర్ కృష్ణన్, మరొక అధికారి, ఒక మధ్యవయస్కుడు దిగారు.

లాల్ వాళ్ళని చూసి విద్యార్థులకి సౌజ్ఞ చేశాడు. వాళ్ళు కదలకుండా కూచున్నారు.

కృష్ణన్ లోనికి వచ్చి, 'హల్లో ఫ్రెండ్స్' అన్నాడు

డిటెక్టివ్‌ల నుద్దేశించి, అతని కళ్ళు విద్యార్థుల మీద పడ్డాయి.

డిటెక్టివ్‌లు అతనితో కరచాలనం చేసి పక్కగదిలోకి తీసికెళ్ళారు. అందరూ లోనికొచ్చాక కుర్చీలు చూపించి కూర్చోమన్నారు.

'మీరేనా వీరేంద్రేశుక్లా ?' లాల్ అడిగాడు, మధ్య వయస్కుడివి చూస్తూ.

తలూపాడతను.

అతని వాలకం చాలా దయనీయంగా వుంది. వొంటి మీద సరయిన దుస్తులు లేవు. కాళ్ళ కి తెగిపోయిన చెప్పులు. మాసినగెడ్డం. జీవితం పట్ల ఎలాంటి ఆసక్తి లేని చూపులు. విషాదంగా యున్న ముఖకవళికలు ....

కుమారుడి పట్ల ప్రొఫెసర్‌కి ఇంత ఏహ్యభావం వుండటం డిటెక్టివ్‌ల మనసులను కలిచి వేసింది.

'మిస్టర్ వీరేంద్ర, మీ తండ్రి తదనంతరం ఆయన వ్రాసిన వీలునామా ప్రకారం యావదాస్థి మీకే చెందుతుం దని తెలుసా ?"

'తెలుసు'

"మంచిది. ఆ వీలునామాను మీ తండ్రి మారుస్తు న్నట్టు తెలుసా ?"

"ఈ మధ్యే తెలిసింది.'

'ఈ కొత్త వీలునామా ప్రకారం ఆస్తి మీకు దక్క దనీ, ఇతరులకి చెందుతుందనీ తెలుసా ?'

'తెలుసు. ఆ ఆస్తి నాకు దక్కడం, దక్కక పోవడ మన్నది నా తండ్రి పెట్టిన షరతు మీద, నేను తీసుకునే

ఇంటి దొంగ?

(పాఠకుల పరిశోధన పోటీ-86 ఫలితాలు)

దొంగ—రంగనాధరావు చిన్న కొడుకు రాజు.

దొంగతనం జరిగిన గది సౌండ్ ప్రూఫ్ చేయించబడింది. అంటే ఆ గదిలో నుండి ఎటువంటి శబ్దమూ బయటకు రావటానికి వీల్లేదు. 'రాత్రి బీరువా తలుపు తెరిచిన శబ్దం వినిపించిందని' రాజు చెప్పటమే అతని నేరాన్ని నిరూపిస్తున్నది. రాజు కుర్రవాడు కనుక నగలు మార్చడం కష్టమని డబ్బుతో సరిపెట్టుకున్నాడు. ఇతరులైతే నగలు కూడా కాజేసేవారు.

—ఈ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇరువురు పాఠకులకు చెరొక రూ. 25/- లు బహుమతి పంపబడుతుంది.

(1) శ్రీ ఆర్. కె. స్వామి,
మారిన్ ఇంజనీరింగ్ కాలేజ్,
పి-19, తారతొల్లా రోడ్,
కలకత్తా-700053.

(2) శ్రీమతి సి. హెచ్. ఝాన్సీరాణి,
ఎల్. ఇ. సి.. ఇ,
C/o సి. హెచ్. కోటేశ్వరరావు,
పోరంకి, (కృష్ణా జిల్లా)

[సరియైన సమాధానాలు వ్రాసిన ఇతర పాఠకులు అసఖ్యాకంగా వున్నందున, స్థలాభావం వల్ల వారి పేర్లు ఇక్కడ ప్రచురించలేక పోతున్నాము.

—ఎడిటర్.]

నిర్ణయం పైన ఆధారపడి వుంది."

'వెరీగుడ్. అయినా మీరేం నిర్ణయం తీసుకున్నారు.'

పీతేంద్ర అన్నాడు, 'ఆయన షరతు ప్రకారం నేను నా భార్యా పిల్లల్ని వదిలి పెట్టిన పక్షంలోనే ఆ స్తికి నేను అధికారి నవుతాను. ఈ షరతుపెట్టి నాలుగు రోజులైంది. వారం రోజులు గడువిచ్చారు. ఇంకా మూడు రోజులు మిగిలి వున్నాయి"

వెల్ మీరేం నిర్ణయం తీసుకున్నారు ?"

నవ్వాడతను, 'మీరే చెప్పండి, నే నెలాటి నిర్ణయం తీసుకోవాలి ? డబ్బుకోసం ఎవరేనా భార్యా పిల్లల్ని వదులుకుంటారా !"

'సరే, మంచిది. ఇప్పుడు చెప్పండి, మీ భార్య జానకిని మీ ఇష్ట పూర్వకంగా పెళ్ళాడారా, లేక ఎవరేనా మిమ్మల్ని బలవంత పెట్టారా ?

మళ్ళీ నవ్వాడతను. 'ఈ విషయం వినడానికి చాలా వింతగా వుంటుంది, లాల్. లక్షాధికారి ఏకైక వారసుడు ఇంట్లో వంటమనిషి కూతుర్ని పెళ్ళాడ్డం ఏమిటి ! ఇలాటివి కథల్లో సినిమాల్లో మాత్రమే జరుగు తాయంటే నే నొప్పుకోను! వాస్తవ జీవితాల్లోనూ జరుగుతాయి - అందుకు నేను ఉదాహరణని. జానకిని నేను ప్రేమించాను. ఇప్పుడూ ప్రేమిస్తున్నాను. ప్రేమకు అంతస్తులు అడ్డుకావని మీకు తెలుసు!

జానకిలో ఆత్మసౌందర్యం వుంది. అది నన్ను లొంగదీసుకుంది. ఆమె మనుషుల్ని చక్కగా అర్థం చేసుకోగలదు - ఎక్కువ చదువుకోక పోయినా, నా జీవితాన్ని నా కిష్టమైన విధంగా మలుచుకునే హక్కు నాకుంది.

అపరాధ పరిశోధన పోటీ-134

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు వాటి ప్రక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబులను నెంబరు వారీగా ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టు స్టాంపులు జతపరిచి పంపండి.

ఆల్ కరెక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాది పాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము. ఒక్కొక్కరు 3 కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు.

మీ కూపనులు 7-9-'79 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు నవబంరు' 79 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. నేటి దేశ పరిస్థితి చూస్తే అదే నయమేమో ననిపిస్తుంది-? [బ్రిటిష్ పాలన, అత్యయిక పరిస్థితి.)

2. యీ మధ్యన దేశప్రజలను హడలగొట్టింది-? (స్కైలాబ్, రాజ్‌నారాయణ్.)

3. ఎప్పుడు ఏ కొరత ఏర్పడుతుందో తెలియని మన దేశంలో దీనికి కొరత లేదు-? అధిక జనభా, నిరుద్యోగ సమస్య.)

4. పార్టీలను చీల్చడంలో అగ్రగణ్యులు-? (ఇందిరా గాంధీ, చరణ్‌సింగ్.)

5. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఇవి పెరుగుతూనే వున్నాయి-? (ధరలు, ప్రజల కష్టాలు.)

తండ్రులనెదిరించి పెళ్ళాడిన తనయు లెందరు లేరు మన చరిత్రలో ? అంతే....జానకిని నా కిష్ట పూర్వకంగా పెళ్ళాడాను. ఎవరి బలవంతమూ లేదు !"

'సరే, రాత్రి మీతండ్రి మరణించినట్టు మీకుతెలుసా?'

'తెలుసు. ఈ ఉదయం పేపరు చదివి తెలుసుకున్నాను.'

డిటెక్టివ్‌లు విస్తుపోయారు.

'ఈ ఉదయం తెలిసిందా ? రాత్రి మీ భార్య చెప్ప లేదా ?" అడిగాడు లాల్.

అడ్డంగా తలుపాడతను. "ఈ ఉదయమే తెలిసింది."

"రాత్రి మీ రెక్కడ వున్నారు ?"

"ఇంట్లోనే. రాత్రి నా పళ్ళు విపరీతంగా నెప్పి పుట్టాయి."

"మీ భార్య ఎక్కడ వుంది ?"

'ఇంట్లోనే వుంది. నా తండ్రి దగ్గరకు వెళ్ళడానికి తయారైంది. చివరిసారి ప్రాధేయపడి డబ్బు సహాయం పొందాలని చెప్పింది. నేను అభ్యంతరం చెప్పాను. ఆత్మాభిమానం చంపుకోవద్దన్నాను. కానీ ఆ డబ్బు తన కోసం కాదనీ, తన కడుపులో పెరుగుతున్న బిడ్డకీ, ఆకలితో ఏడుస్తున్న పిల్లలకీ అని వాదించింది. నేనామెను ఆపలేకపోయాను. ఆమె వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళి పోయాక నా పళ్ళు తీవ్రంగా నెప్పి పుట్టసాగాయి...

భరించలేని బాధ ! పిల్లలు నిద్రపోయారు. నేను ఆగలేక వెంటనే డాక్టర్ దగ్గరికెళ్ళాను.

"ఎన్ని గంటలకి ?"

"పది గంటలకి"

"అంత రాత్రి ఏ క్లినిక్ వుంటుంది?"

"నా మిత్రుడున్నాడు-డాక్టర్ జగన్నాథ్ మిశ్రా. అతని ఇల్లూ క్లినిక్ ఒకటే. అరగంటసేపు తంటాలు పడి నా పన్ను పీకేశాడు'

వీరేంద్ర నోరు తెరిచి పైదవడ చూపించాడు. కుడి వేపు వరసలో నాల్గవ పన్నులేదు."

'ఆ తర్వాత ఏం చేశారు?' అడిగాడు లాల్.

"పన్ను తీయడం వలన నెప్పి ఇంకా ఎక్కువైంది. డాక్టర్ నన్ను ఆ రాత్రి అక్కడే పడుకోమన్నాడు. బ్రాందీ తాగించాడు. ఉదయం లేవాక అతను నాకు పేపరు చూపించాడు. అందులో నా తండ్రి హత్య వార్త వుంది. అతని దగ్గర ఇరవై రూపాయలు తీసుకుని వెళ్ళిపోయాను.

సారా కొట్లో కూచొని తాగుతూ జరిగిన దారుణం మర్చిపోవడానికి ప్రయత్నించాను. ఎంత తాగినా మరువ లేక పోయాను. దుఃఖం ఘుంభుక వస్తోంది. నా తండ్రి వీలునామా మార్చే ప్రయత్నంలో వున్నాడు. కానీ అది జరక్కముందే చనిపోయాడు!. అంత ఆస్తికి నేనిప్పుడు ఏకైక వారసుడ్ని!

నాకాస్తి ముఖ్యమైతే భార్యాపిల్లల్ని ఎప్పుడో వదిలేసేవాడ్ని. నా తండ్రి హత్యతో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది...ఇంతలో కర్ఫ్యూ ప్రకటించారు. నేను తెగించి వీధిలోకొచ్చాను-పోలీసులు పట్టుకున్నారు''

లాల్ మరొక ప్రశ్న వేశాడు. "వీరేంద్ర, మీ దగ్గర రెండు హాండ్ గ్రెనేడ్స్ వున్నట్టు తెలిసింది. వాటిని మీరు అమ్మినట్టు కూడా తెలిసింది. ఎవరికి అమ్మారు?

వీరేంద్ర ఆశ్చర్యపోయి చూశాడు. కృష్ణన్ కూడ విస్మయంగా చూశాడు. ఈ విషయం అతనికి తెలియదు.

వీరేంద్ర అన్నాడు. "నా దగ్గర చేతి బాంబులు వున్నట్టు వాళ్ళకెలా తెలిసిందో అర్థం కాలేదు."

"వాళ్ళెవరు? ఎలా వుంటారు?"

"వాళ్ళెవరో నాకు తెలియదు. ఇద్దరు వచ్చారు.."

అని వీరేంద్ర వారిని వర్ణించాడు.

కృష్ణన్ ఛటుక్కున అన్నాడు, "లాల్, ఈ ఇద్దరు ఉదయం మిమ్మల్ని చంపడానికి ప్రయత్నించిన అసామీలు"

'ఈజిట్?' అన్నాడు లాల్.

కృష్ణన్ తలూపాడు.

లాల్, వీరేంద్రని చూశాడు.

వీరేంద్ర అన్నాడు, "ఆ ఇద్దరు నా యింటికి వచ్చారు. నా దగ్గర వున్న గ్రేనేడ్స్ రెండు వందలకి కొంటామన్నారు. నా దగ్గర అది వున్నట్టు మీకెలా తెలిసిందని అడిగాను. నేను సారా కొట్లో తాగిన మైకంలో అది నా దగ్గర వున్నట్టు చెప్పుకున్నానట. నాకప్పుడు డబ్బు ఇబ్బంది చాలా వుంది. అవి అమ్మడానికి అంగీకరించాను. అయితే అయిదు వందలకి బేరం పెట్టాను. ముందు వాళ్ళు ఒప్పుకోకపోయినా చివరికి అంగీకరించారు."

'వెల్, ఇప్పుడు డాక్టర్ జగన్నాధ్ మిశ్రా దగ్గరికి వెళదాం. మీ స్టేట్‌మెంట్ సరయినదని రుజువు చేసుకోవాలి.' అన్నాడు లాల్.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 12 : ప్రసన్న, వైదేహిని వివాహం చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులతో అంగీకారానికి వచ్చాడు. వివాహపు ఏర్పాట్లకోసం సుమారు రూ. 1000/-ల వరకు ప్రసన్న ఖర్చుచేశాడు.

ఇంతలో వైదేహి మూర్ఛరోగి అనే విషయం అతనికి తెలిసిపోయింది. వెంటనే ప్రసన్న ఎంగేజిమెంట్ రద్దును వైదేహి తల్లిదండ్రులకు తెలియపరుస్తూ, యీసందర్భంగా తనకు ఖర్చు అయిన రూ.1000/-లు తిరిగి ఇచ్చివేయాలని కోర్టుకెక్కాడు.

మీ తీర్పు ఏమిటి ?

నిబంధనలు : మీ తీర్పును 7-9-79 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హూం. డె. సభ్యులు కానివారు తమ తీర్పుతో 50 పైసలు పోస్టు స్టాంపులు జతపరచాలి. ఉత్తమమైన తీర్పుకు రూ. 25/- లు బహుమతి పంపుతాము. ఫలితాలు నవంబరు '79 నెల పంచికలో చూడండి.

జులై '79 పోటీ ఫలితాలు

తీర్పు : కృష్ణకాంత్ నేరస్తుడు అవుతాడు.

'ఇండియన్ కంట్రాక్ట్ అక్ట్' ప్రకారం కంట్రాక్ట్ లోని ఉద్దేశ్యం ఏదైనా చట్టాన్ని ఉల్లంగించేటట్లయితే అది చెల్లదు.12 యేళ్ళ బాలికకు వివాహం చేయటం చట్టవిరుద్ధం.కాబట్టి రాజారావిచ్చిన ప్రామిసరీనోటు కోర్టులోచెల్లదు. కనుక కృష్ణకాంత్,రాజారావ్ ఇంట్లోసామాన్లు తీసుకొని పోరాదు. అదినేరం

ఈ నెల న్యాయనిర్ణేత : శ్రీ కె. పి. అశోక్ కుమార్, ఎం.ఏ.,బి.కాం.. 4-77, హనుమాన్ టేకిడి, మచ్చ బొల్లారం, సికింద్రాబాదు-500 010.

22

డాక్టర్ జగన్నాథ్ మిశ్రా క్లినిక్ బ్యాంక్ స్ట్రీట్‌లో సాగర్ టాకీస్ ఎదురుగా బిల్డింగ్‌లో వుంది.

డిటెక్టివ్‌లు పది నిమిషాల్లో కృష్ణన్, వీరేంద్ర, ‹సడెన్› లతో సహా చేరుకున్నారు.

డాక్టర్ ముందు ఆశ్చర్యపడి, పరిచయాలు ముగిశాక ఆనందపడి, డిటెక్టివ్‌లను ఆహ్వానించాడు.

‹డాక్టర్, మేమొక ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి. రాత్రి వీరేంద్ర మీ దగ్గరే వున్నాడా?' అడిగాడు లాల్.

‹అవును. వీరేంద్ర ఇక్కడే వున్నాడు. రాత్రి పన్ను తీయించుకుని బాధపడుతోంటే ఇక్కడే వుండి పొమ్మన్నాను. ఉదయం తండ్రి మరణ వార్త విని నా దగ్గర డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.' అన్నాడు డాక్టర్.

‹వీరేంద్ర మీ దగ్గరికి ఎన్ని గంటలకి వచ్చాడు?'

‹పది గంటలకి.'

‹ఖచ్చితంగా ఎలా చెప్తున్నారు?'

‹పది గంటలకి నేను బ్రాందీ తాగి భోజనం చేస్తాను.'

'మీ ఇల్లూ క్లినిక్ ఒకటేనా?'

'అవును. వెనకపోర్షన్‌లో ఇల్లువుంది.'

'రాత్రంతా వీరేంద్ర ఇక్కడే వున్నాడా?'

'అవును. రాత్రంతా మూల్గుతూ సరిగా నిద్రపోలేదు.'

'డాక్టర్, మీరు చెప్పిందంతా నిజమని ప్రమాణం చెయ్యగలరా?'

డాక్టర్ ఉలికిపడి చూశాడు, 'నేను చెప్పిన విషయాలు

పాఠకుల అభిప్రాయాలు :

ఆగస్టు నెల అపనలో లత ఇళ్ళు, డెడ్ లెటర్ కథలు బాగున్నాయి. 'పగబట్టిన పడుచువాడు' కథకు ఆర్టిస్టు వేసినబొమ్మ విరుద్ధంగా వుంది. సప్లిమెంట్ లో వసుంధర గారి సీరియల్ బాగా సాగుతోంది

—ఎస్. ఎస్. శాస్త్రి, ఏలూరు.

సప్లిమెంట్ లోని నవలలన్నీ చాల బాగున్నాయి. వసుంధరగారి సీరియల్ మరీ బాగుంది. కథల పత్రికలో కథలు చిన్నవిగా వుండి బోరు కొట్టేస్తున్నవి.

—యం.బి. స్వరూప్ గౌడు, కామారెడ్డి.

పుస్తకం చేతికి తీసుకొంటె మొదట్నుంచీ చివరదాకా చదవందే వదలబుద్ధికాని పత్రికలు తెలుగులో మూన్నాళ్ళకంటె మించిలేవు. అందులో అపన ఒక్కటంటే పత్రిక చదివిన ప్రతి ఒక్కరూ ఆమోదించి తీర్తారు. అతి ముత్యాల్లాంటి జోకులు, కార్టూన్లు అపనకే హైలైట్.

—ఎమ్. లేపాక్షిరెడ్డి, బండారు చెట్లపల్లె.

9, 57, 69, 101 పేజీలలోని కార్టూన్స్ మమ్మల్ని కడుపుబ్బ నవ్వించాయి. వసుంధర సౌజన్య, కె. బి. యస్. కుమార్ గార్ల కథలు, సప్లిమెంట్ లోని అన్ని నవలలు చాల ఫైన్ గా వున్నాయి.

—గొల్ల దేవిప్రసాద్, రాజమండ్రి.

'కర్ణపిశాచి' కథ పాతదైనా వెరైటీతో కూడిఉన్నది. ఎదురు చూసిన దొంగ, కథలో రచయిత శాస్త్రీయతను ఉపయోగించారు. ఈనాడు మనకు కావలసింది ఇలాంటి ప్రయోగాత్మక కథలే. రచయితకు నా అభినందనలు. జోక్స్, కార్టూన్స్ బాగున్నాయి.

—కందికట్టు సూర్యప్రకాశరావు, నెల్లూరు-4.

ప్రమాణం చెయ్యవలసినంత ముఖ్యమైనవా? అయితే అంగీకారమే. నేను కాదు, నా భార్యకూడా ప్రమాణ పూర్వకంగా స్టేట్ మెంట్ ఇవ్వగలదు.'

'థాంక్స్ డాక్టర్, ఇక మేం వస్తాం.'

బయటకి వచ్చాక లాల్, కృష్ణన్ ని చూశాడు. 'ఇన్ స్పెక్టర్, వీరేంద్ర నిరపరాధి. అతన్ని వదిలేయండి.'

"నమ్మకంగా చెప్తున్నారా?" అడిగాడు కృష్ణన్.

లాల్ తలూపాడు. 'ఆయన్ని యింటి దగ్గర వది లేయండి. ఆ రెండవ జీపు మేం ఉపయోగించుకుంటాం. కర్ఫ్యూ పాస్ లు తెచ్చారా?'

కృష్ణన్ తలూపి జేబులోంచి రెండు పాస్ లు తీసి అందించాడు. ఆ తర్వాత వీరేంద్రతో జీపులో వెళ్ళి పోయాడు.

రెండవ జీపులో డిటెక్టివ్ లు కూచున్నారు, 'సడెన్'తో సహా.

'ఇప్పుడే మంటావ్!" అన్నాడు జాన్ నవ్వుతూ, 'ఈ హత్య వీరేంద్ర చెయ్యలేదని ముందే చెప్పాను.'

లాల్ తీవ్రంగా ఆలోచిస్తూ అన్నాడు, 'రంభ, సింగ్ ల హస్తముందంటావా? వెల్, వుండవచ్చు. అయితే ఈ అరాచకాన్ని సృష్టిస్తున్న ముఠా ఎవరు? విద్యార్థుల్ని రెచ్చగొడుతున్న గూండాలు ఎవరి తాలూకు మనుషులు? మనమీద హత్యా ప్రయత్నాలు చేస్తోందెవరు? ఆ అజ్ఞాత స్త్రీ ఎవరు? ఆ స్త్రీయే ఈ ముఠా నాయకురాలా?'

'కావచ్చు. ఈ ఆధునిక యుగంలో స్త్రీలు అన్నింటి టిలోనూ ముందడుగు వేస్తున్నారు.' అన్నాడు జాన్.

అపరాధ పరిశోధనపోటీ- 132

[ఫలితాలు]

జులై ' 79 'అపరాధ పరిశోధన పోటీ - 132'కి సరియైన సమాధానాలు :

1. మధ్యపానం.
2. సన్యాసులు.
3. ముష్టిఎత్తటం.
4. లాటరీవలన.
5. రాజకీయవారపత్రిక.

పై జవాబుల ప్రకారం ఐదుగురు పాఠకులు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి అక్టోబరు' 79 నెల నుండి ఒక ఏడాది పాటు 'అపరాధ పరిశోధన' మాస పత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడు తుంది.

1. శ్రీమతి పి. రోహిణి, c/o డాక్టర్ పి. సత్య నారాయణ మూర్తి, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా.

2. శ్రీ ఎన్. ఎన్. వి. ఎన్. కుమార్, c/o శ్రీ హరి మెడికల్ స్టోర్స్, పెనుగొండ- 534302.

3. డాక్టర్ యం. ఓబన్న, ఎమ్. బి. బి. ఎస్. , గవర్నమెంట్ వుమెన్ అండ్ చిల్డ్రిన్స్ హాస్పిటల్, ఆదోని, కర్నూల్ జిల్లా.

4. శ్రీ జి. వి. ఎస్. ఎస్. కుమార్, పానుగంటి వారి వీధి, ఆర్. ఆర్. పేట, ఏలూరు- 534002.

5. శ్రీ ఆర్. చంద్రరాజు, 8- 7- 1, గాంధీ రోడ్, చిత్తూరు.

23

మర్నాడుదయం ఎనిమిది నుండి పదకొండు.... వరకు మూడు గంటల సేపు కర్ఫ్యూ సడలించారు.

ఇరవై గంటల సేపు ఇళ్ళలో బందీలైన ప్రజలు కర్ఫ్యూ సడలించడంతోనే ప్రాణాలు లేచి వచ్చి బజారున పడ్డారు. నిత్యావసర వస్తువులు అవసరానికి మించి కొనుక్కొని నిల్వ చేసుకో సాగారు.

కర్ఫ్యూతో నిర్మానుష్యమై పోయిన జంటనగరాలు ఇప్పుడు కళకళ లాడుతున్నాయి.

హిమాయత్ నగర్‌లో 'తెలుగు అకాడమీ' ఎదురుగా ఒక ఇంటి ముందు, వందగజాలు ఎడంగా ఒక బ్రౌన్ కలర్ ఫియట్ ఆగి వుంది. అకార్లో ఒక అందమైన పాతికేళ్ళ యువతి కూచొని వుంది. ఆమె కుడి మోచెయ్యి కారు కిటికీ మీద, ఎడమ చెయ్యి స్టీరింగ్ వీల్ మీద వున్నాయి. ఆమె కళ్ళలో చిలిపితనం, ముఖంలో చలాకీ తనం ఉట్టిపడుతున్నాయి. బ్లూ కలర్ జీన్స్, అదే రంగు షర్టు ధరించింది.

ఆమె కళ్ళు ఆ యింటి గేటు కేసి తీక్షణంగా చూస్తు న్నాయి.

'ఓహ్, గాడ్! ఈ ప్రొఫెసర్ బద్ధకస్తుడిలా వున్నాడే? ఎనిమిది దాటినా నిద్ర లేవలేదా!' తనలో తాననుకుందామె.

ఆమె నడుము చాలా సన్నగా వుంది. తొడలు బలిసిగా, కాళ్ళు సన్నగా వున్నాయి. కోమలమైన దేహం. ఎవరైనా రెండు చేతుల్లో ఆమెని గట్టిగా బంధిస్తే పాద

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 3-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి.పి.ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అవసరమయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు.5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారా గాని, పోస్టు స్టాంపులుగానిపంప వచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వముకార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. పైగా సభ్యుల పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకుపంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 3/-లు వెంటనే M.O. చేయాలి. కాపీలు తిరిగి 'రిజిస్టర్డ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వముఅంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలుఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామ మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికివాటి అసలుధరకేవి.పి. ద్వారా పంపగలము.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునే వారు, ఏడాది పైకము రు. 30/-లు ముందుగా పంపవచ్చును.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ'లో చేరండి!

రసంలా జారిపోయే, చేపలాటి శరీరం.

ఆమె అసహనంగా టైం చూసుకుంది; ఎనిమిదిన్నర.

'ఓహ్! ఈ ప్రొఫెసర్ బుద్ధిమంతుడిలా వున్నాడు, కొంపదీసి పుస్తకాలు చదవడం లేదు కదా?' మళ్ళీ అనుకుందామె.

స్టీరింగ్ మీద అసహనంగా గుద్ది, జీన్స్ జేబులోంచి వెండి సిగరెట్ కేసు తీసింది. దానిలో ఒకే సిగరెట్ వుంది. స్టేట్ ఎక్స్‌ప్రెస్.

సిగరెట్‌ని పెదవుల మధ్య వుంచి సిగార్ లైటర్‌తో వెల్గించింది. గట్టిగా దమ్ములాగి మళ్ళీ ఇంటికేసి చూసింది.

'గాడ్! ఈ బ్రహ్మచారి ప్రొఫెసర్ వంట చేస్తూ కూచోలేదు కదా?'

అంత ఆందోళనలోనూ ఆమె రియర్‌వ్యూ మిర్రర్‌లో తన అందాన్ని చూసుకుంది: సుందరమైన అస్సామీ ముఖం. లిప్‌స్టిక్ చెదిరినట్లు కన్పించింది. పర్సులోంచి లిప్‌స్టిక్ తీసి అద్దుకుంటోండగా హారన్ శబ్దం విని ఉలికిపడి చూసింది.

ఆ యింటి గేటులోంచి ఒక గ్రీన్ అంబాసిడర్ వస్తూ కన్పించింది. డ్రైవింగ్ సీట్‌లో ఒక మధ్య వయస్కుడు వున్నాడు. తెల్లటిరంగు, నల్లటి వెంట్రుకలు. పెదవుల మధ్య సిగరెట్ వుంది. అతను కారును ఎడమ వేపుకు త్రిప్పి, రోడ్డువారగా ఆగివున్న బ్రౌన్ ఫియట్ లోకి తొంగి చూస్తూ ముందుకు సాగిపోయాడు.

ఆ యువతి ముఖం మాడ్చుకుంది, "ఓహో! ఆలస్యంగా రావడమేగాక, నన్ను చూసీ చూడకుండా వెళ్ళిపోతాడా! సరే, ప్రొఫెసర్! నీ బ్రహ్మచర్యం ఎంత

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈనెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను బాగా పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకుసంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలో గాని, చిన్న వాక్యంలో గాని వ్రాసి పంపండి.

మీ వ్యాఖ్యలు ఒక పోస్టు కార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, 7-9-'79 తేదీలోగా మాకు చేరే టట్లు పంపాలి. హోం. తె. సభ్యులు కానివారు తమవ్యాఖ్యలకు 50పైసల స్టాంపులు జత పర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలతో చెరొక రు.25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు నవంబరు '79 నెల సంచికలో చూడండి.

జులై '79 పోటీ ఫలితాలు

1. జులై '79 నెల 'అపరాధ పరిశోధన' ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య :

కత్తిలాంటి పిల్ల!
కాగితాల బొమ్మ!!

పంపినవారు : శ్రీ డి. వి. వి. సత్యనారాయణ మూర్తి, ఎస్. వి. ఎస్. మెటల్ అండ్ జనరల్ స్టోర్స్, మెయిన్ రోడ్, రాజోలు-533 242.

2. "సప్లిమెంట్" కు బహుమతి పొందిన వ్యాఖ్య :

రాకెట్ లాంటి చిన్నది!
రౌడీలా వున్నది!!

పంపిన వారు : శ్రీ పి.వి. శేషసాయి, మేనేజర్, సిండికేట్ బ్యాంక్, సీతారాంపురం, నెల్లూరు జిల్లా.

కాలమో చూస్తాను!"

ఆమె కారు స్టార్ట్ చేసి తటాలున ముందుకు దూకించింది.

యాభై గజాల దూరంలో గ్రీన్ అంబాసిడర్ వెళుతోంది. ఆమె ఆ దూరాన్ని అలాగే వుంచుతూ వెంబడిస్తోంది.

గ్రీన్ అంబాసిడర్‌లో కూచున్న అరవింద్ కుమార్‌కి ముప్పై అయిదేళ్ళుంటాయి. యూనివర్శిటీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అతనంటే విద్యార్థులకి మంచి అభిమానం వుంది.

బ్రౌన్ ఫియట్‌లో వున్న యువతి అంబాసిడర్‌ని బైపాస్‌చేసి ముందుకు దూసుకెళ్ళింది. కాస్సేపటికి నారాయణగూడా తాజ్‌మహల్ హోటల్ చేరుకుంది.

హోటల్ ముందు ఒక అంబాసిడర్ నిలిచివుంది. దాని బానెట్ ఎత్తి ఇద్దరుమనుషులు రిపేర్‌చేస్తూ కన్పించారు. అందులో ఒకడు ఫియట్‌ను చూసి తలెత్తినవ్వాడు. బదులుగా ఆ యువతి కొంటెగా చూసి నాలిక బయటపెట్టి వెక్కిరించింది. ఆ తర్వాత ముందుకు దూసుకెళ్ళిపోయింది.

కారు రిపేరు చేస్తున్నట్టు నటిస్తున్న మనుషులు, అటునుంచి వస్తున్న గ్రీన్ అంబాసిడర్‌ని చూసి ఒకరినొకరు సైగచేసుకున్నారు. ఆ కారు దాటిపోయాక బానెట్ మూసి కారెక్కి స్టార్ట్‌చేసి వెంబడించసాగారు.

ప్రొఫెసర్ అరవింద్ కుమార్ చాపెల్ రోడ్ చేరుకుని ఒక రెండంతస్తుల బిల్డింగ్ ముందు కారాపాడు.

"రచయితలతో ముఖాముఖి"

రమణశ్రీ గారికి,

నేను మీ రచనలన్నీ చదువుతున్నాను. మీరు మంత్ర శాస్త్రం, జ్యోతిషం విషయాలలో చాలా వరకు వివరణ యిస్తున్నారు. మీకు అందులో ప్రవేశం వున్నదా? లేక, ఎవ్వరిరాద్వారానైనా సేకరిస్తున్నారా? తెలుపగోరుచున్నాను.

—జి. రాజారెడ్డి, దేవలంపేట.

మీరు నా రచనలన్నీ చదువు తున్నందులకు నా కృతజ్ఞతలు. బహుశా, మీరు మరణలగ్నం, అతీంద్రియ శక్తులు చదివి పై అభిప్రాయమునకు వచ్చి వుండవచ్చు. నాకు ఆ పై శాస్త్రాలలో ఎలాంటి ప్రవేశం లేదు. నిజానికి ఆ సన్నివేశాల రూపకల్పనకు ఆ శాస్త్రాలలో ప్రవేశము అవసరం లేదేమో! అయితే తరచు వార్తా పత్రికలలో కన్పించే కొన్ని యదార్థ వార్తలను వూహాగానానికి జతకల్పుతుంటాను.

—రమణశ్రీ

వసుంధర గారికి,

నమస్కారములు. కొన్ని సంవత్సరాల క్రితం మీ నవల 'అవతారమూర్తి' ఒక్కటే చదివాను. ఆ తర్వాత ఇంకా ఎన్ని నవలలు మీరు వ్రాశారు? ఎన్ని ప్రచురించారు?

—నీలకంటి రామకృష్ణ, సంగారెడ్డి.

'అవతారమూర్తి' ఒక్కటే విడిగా ప్రచురించబడిన డిటెక్టివ్ నవల. ప్రస్తుతం విడిగా డిటెక్టివ్ నవల్లు ఏమీ వ్రాసి ప్రచురించడంలేదు. మీ అభిమానానికి ధన్యవాదాలు.

—'వసుంధర'

ఆ బిల్డింగ్ మీద సిమెంట్‌తో మలచబడ్డ అక్షరాలు న్నాయి. 'దేవికా భవన్'

ఆ రోడ్డులో షాపులన్నీ మూసి వున్నాయి.

ప్రొఫెసర్ కారు దిగి చుట్టూ చూశాడు. నిర్మానుష్యంగా వుంది. దేవికా భవన్ కింది భాగంలో షాపులు న్నాయి. పైన విలాస గృహం వుంది. ప్రొఫెసర్ కాలింగ్ బెల్ నొక్కాడు. కాలింగ్ బెల్ పైకి వెళ్ళే మెట్ల తలుపుకి వుంది.

బెల్ మోగిన కాస్సేపటికి ఒక స్త్రీ కంఠం విన్పించింది: "వచ్చే! వచ్చే!"

ప్రొఫెసర్ వాచీ చూసుకుని కాచుకున్నాడు. ఇంతలో మెట్ల మీద అడుగుల చప్పుడు విన్పించింది. కాస్సేపట్లో తలుపు తెరుచుకుంది.

"అరవింద్!.... నువ్వా!" అందామె.

అతను తలూపాడు.

ఆమెకి ముప్పయి ఏళ్ళుంటాయి. ఆకర్షణీయంగా వుంది.

ఆమె గాభరాగా చూసి ప్రొఫెసర్ చెయ్యి పట్టుకుని లోనికి లాగింది. దభాలున తలుపు మూసి గబగబ మెట్లెక్కింది.

"దేవికా. ఏమిటిది?" అన్నాడాతను.

(సశేషం)

Edited and Published by S. Damodar Reddy
3-4-554 Narayanaguda Hyderabad-500 029,
and Printed at Graphic Seva
Hyderabad-500004.